www.jagritiweekly.com


సంపుటి : 77 సంచిక : 18 పుటలు : 52

# జాగృతి

కలి 5126-శ్రీ క్రోధి మాఘ బహుళ ఏకాదశి

24 ఫిబ్రవరి-02 మార్చి 2025

వెల : ₹20/-



అందరికీ మహాశివరాత్రి శుభాకాంక్షలు

ప్రత్యేక వ్యాసం పే.26




# అరాచకాల యూఎస్‌ఎయిడ్


జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

77 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక

# మహా శివరాత్రి శుభాకాంక్షలు...

జై శ్రీరామ్..! భారత్ మాతాకీ జై..!!

## గ్రాడ్యుయేట్ల చూపు
## అంజిరెడ్డి వైపు



# నమస్కారం..!

- నేను మీ డాక్టర్ చిన్నమైల్ అంజిరెడ్డి. ఉమ్మడి మెదక్ జిల్లాలోని రామచంద్రాపురంలో ఓ సాధారణ రైతు కుటుంబంలో జన్మించాను.
- మానవ సేవే మాధవ సేవ అనే భావనతో 2002లో ఎస్ఆర్ ట్రస్ట్ స్థాపించి గత రెండు దశాబ్దాలుగా ట్రస్ట్ ద్వారా విద్య, వైద్యం, ఉపాధి, నైపుణ్య శిక్షణ, క్రీడలు. ఆర్ఓ ప్లాంట్ల ఏర్పాటుతో ఉచితంగా త్రాగునీటిని అందిస్తూ మొదలగు రంగాల్లో సమాజ సేవ చేస్తున్నాను
- నా సమాజ సేవను, పార్టీ పట్ల అంకిత భావాన్ని గుర్తించి పట్టభద్ర ఎమ్మెల్సీగా పోటీ చేసే అవకాశం కల్పించిన బిజెపి నాయకత్వానికి ధన్యవాదాలు.


**1** పట్టభద్రుల గొంతుకై వస్తున్న నాకు మీ మొదటి ప్రాధాన్య ఓటును వేసి గెలిపిస్తారని ఆశిస్తున్నాను.

సంఘే శక్తి కలౌ యుగే



## మీ..డా. చిన్నమైల్ అంజిరెడ్డి

ఉమ్మడి కరీంనగర్ -ఆదిలాబాద్- మెదక్ - నిజామాబాద్
నియోజకవర్గ బిజెపి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి


మహాశివరాత్రి సందర్భంగా..
ప్రజలందరికీ ఆ పరమశివుని కృప, కటాక్షాలు ఉండాలని కోరుకుంటూ..
హిందూబంధువులందరికీ
మహా శివరాత్రి
శుభాకాంక్షలు
అర్వింద్ ధర్మపురి
( పార్లమెంట్ సభ్యులు, నిజామాబాద్)

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.**

జి.తుకారాం : సర్క్యులేషన్ మేనేజర్
**040-27561453 / 9959997013**

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)**

| | | |
|---|---|---|
| కె. దుర్గారెడ్డి : | అసోసియేట్ ఎడిటర్ | - |
| సబ్ ఎడిటర్ : | - | 9959991304 |

డిజైనర్ : చిగుళ్ల కుమార్, ఎడ్ల కృష్ణ

## చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ "To Bank / UPID" ఆప్షన్ వాడండి.

**Link / QR Code** ద్వారా మీ చందా చెల్లించినప్పుడు **Remarks** దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

విడి ప్రతి రూ.20

5 సం॥ల చందా రూ.4000 | సంవత్సర చందా రూ.850

**బ్యాంకు ఖాతా వివరాలు**

**A/c Name & No. Jagriti Prakashan Trust, 92001006140 5325, Axis Bank, Kothapet Branch.**
**IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**

– సర్క్యులేషన్ మేనేజర్, జాగృతి

పేరు భారత జాతీయ కాంగ్రెస్ కావచ్చు. కానీ భారతీయత పట్ల తనకు ఉన్న ప్రతికూలతను, దేశ సార్వభౌమాధికారం పట్ల, భద్రత పట్ల ఉన్న అగౌరవాన్ని ఆ పార్టీ బాహాటంగానే వెల్లడిస్తున్నది. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్నీ, దేశాన్ని రక్షించే సైన్యాన్నీ గౌరవించుకునే తత్వం ఆ పార్టీలో పలచబడిపోయింది. భారత్‌తో శత్రుత్వం ప్రకటించిన, వైరాన్ని ప్రదర్శిస్తున్న ప్రతి వ్యవస్థతోను ఆ పార్టీ పెద్దలు మమేకమై ఉండడం కూడా తిరుగులేని వాస్తవమే. భారత వ్యతిరేక వ్యవస్థలతో తమ అనుబంధాన్ని వ్యక్తీకరించడానికి శతాధిక సంవత్సరాల పార్టీ రకరకాల పద్ధతులు అనుసరిస్తున్నది. టుక్డే టుక్డే ముఠాల నాయకులకి సిద్ధాంత రూపకల్పనలో పెద్ద పీట వేయడం, భారత్‌లో ప్రభుత్వాలను అస్థిరపరిచే పనిలో ఉన్నవాళ్లకి తోడ్పాటునివ్వడం, టూల్‌కిట్ ముఠాల హక్కుల కోసం గోల చేయడం, భారత్‌తో నిరంతరం కాలు దువ్వే ఇరుగు పొరుగు గొప్పతనాన్ని వేనోళ్ల కీర్తించడం ఆ పార్టీలో బాహాటంగా కనిపిస్తున్న పోకడ. ఆ పార్టీ ప్రవాస భారత విభాగం అధ్యక్షుడు శామ్ పిత్రోడా చైనా మంచితనాన్ని కీర్తిస్తూ చేసిన తాజా వ్యాఖ్యలూ; అస్సాం కాంగ్రెస్ ప్రముఖుడు, ఎంపీ, గౌరవ్ గొగొయ్ బ్రిటిష్ జాతి భార్యపై వచ్చిన ఆరోపణలూ దేశాన్ని ఆ దిశగా ఆలోచింపచేసేవే.

చైనాను శత్రువుగా చూడొద్దు అంటున్నారు శామ్. అసలు ఆది నుంచి భారత్ చైనాతో ఘర్షణ వైఖరితోనే ఉన్నదట. ఆ దేశం గొప్పతనాన్ని గుర్తించి గౌరవించాలట. ఐఏఎన్ఎస్ అనే వార్త సంస్థతో మాట్లాడుతూ శామ్ ఈ హితవచనాలు పలికారు. ఫిబ్రవరి 13న ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శ్వేత సౌధంలో సమావేశమైనప్పుడు ఈ ఇరు ఆసియా దిగ్గజాల మధ్య ఉన్న సంఘర్షణను పరిష్కరించడానికి మధ్యవర్తిత్వం వహిస్తామంటూ అగ్రదేశం ఉత్సాహం చూపించడం, అందుకు భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ నిరాకరించడం తెలిసిందే. ఆ నేపథ్యంలో వెలువడిన శామ్ వ్యాఖ్యలను సాధరణమైనవిగా పరిగణించడం సాధ్యం కాదు. చైనా గురించి అమెరికా చెబుతున్న భాష్యం ఆధారంగా డ్రాగన్‌ను శత్రువుగా పరిగణించడం తప్పిదమని శామ్ వాపోతున్నారు. కాబట్టి భారత్ చైనా పట్ల తన వైఖరిని మార్చుకోవడం తక్షణావసరమని కూడా అమెరికాలో ఉండే శామ్ హితోపదేశం

**శాలివాహన 1946 శ్రీ క్రోధి మాఘ బహుళ ఏకాదశి**

## లోపలి పేజీలలో...




ముఖపత్ర కథనం
**అరాచకాల యూఎస్‌ఎయిడ్**
6లో

ధారావాహిక నవల
**తూర్పు-పడమర**
– గన్నవరపు నరసింహమూర్తి
15

20లో

ప్రత్యేక వ్యాసం
**సదాశివా...! సదా స్మరామి..!!**

26లో

# జాగృతి

## సంపాదకీయం

# తీరు మారని కాంగ్రెస్

చేశారు. ఇక్కడ ఒక ప్రశ్న. శామ్ భారత్‌ను బెదిరించదలిచారా? చైనా అనే ఎర్రభూతం చేసిన, చేస్తున్న ఘోరాలను మరచిపొమ్మనీ, అణగిమణిగి ఉండాలనీ, లేదంటే మనకే నష్టమని చెప్పడం ఆయన ఉద్దేశమా? అక్కడ అభివృద్ధి నిజమే. కానీ అది నియంతృత్వం నీడలో జరిగింది. భారత్‌లో అభివృద్ధి ప్రజాస్వామ్య పంథాలో సాగింది. ఇది గుర్తించాలి. చైనా అభివృద్ధికి మానవీయ కోణం లేదు. కాబట్టి దానిని చూసి నేర్చుకోవలసిన అవసరం భారత్‌కు ఉండదు.

ఆది నుంచి చైనాతో భారత్ సంఘర్షణాత్మక వైఖరితోనే ఉందని చరిత్ర పట్ల కనీస అవగాహన ఉన్నవారు ఎవరైనా చెప్పగలరా? అంతర్జాతీయ దౌత్య విలువలను చైనా ధ్వంసం చేసిన తీరుతెన్నులు ఎరిగిన ఎవరైనా డ్రాగన్‌తో ఘర్షణ అవాంఛనీయమని తీర్పు ఇవ్వగలరా? హిందీ-చీనీ భాయి భాయి అనే నినాదాన్ని దారుణంగా భగ్నం చేసినది ఎవరో శామ్ వంటివారికి తెలియకపోతే ఆ పార్టీలో ప్రముఖులైనా నేర్పితే మంచిది. 'పంచశీలలో ఊడిపోయిన సీల పేరు చైనా' అంటాడు మన కవి దేవరకొండ బాలగంగాధర తిలక్. 1962లో ఎవరు ఎవరి మీద దండెత్తారు? అరుణాచల్‌ప్రదేశ్ మీద చైనా వాదన ఎంత అసంబద్ధమో శామ్‌కు తెలియనిది అనుకోగలమా? 1962 యుద్ధం తరువాత డార్జిలింగ్ చైనాకే చెందుతుందని వాదించిన కమ్యూనిస్టులను ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ఊచలు లెక్క పెట్టించవలసి వచ్చింది? పీవీ నరసింహారావు అంటే కాంగ్రెస్ పెద్ద కుటుంబానికి ఈసడింపు ఉండవచ్చు. కానీ ఆయనను కాంగ్రెస్‌వాది కాదని ఎవరూ అనలేరు. కాబట్టి పీవీ ఆత్మకథాత్మక కథ 'ది ఇన్‌సైడర్'లో చైనా ఎంతటి ప్రమాదకారో తెలియచేస్తూ, నిరంతరం గుర్తు చేస్తూ నెహ్రూకు సర్దార్ పటేల్ రాసిన లేఖల ప్రస్తావన గురించి శామ్ గమనించాలి. అంతర్జాతీయ శాంతిదూత హోదా మత్తులో పడిపోయిన నెహ్రూ గాఢ నిద్రను వదిలించడానికి పటేల్ పెద్ద ప్రయత్నమే చేశారు. అది విఫలమైంది. ఫలితం, యుద్ధం. పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్‌లో చైనా ఆక్రమించుకున్న భూభాగం చూసినా మనమే చైనాతో సంఘర్షణాత్మక వైఖరితో ఉన్నామని ఎవరైనా అంటే వాళ్ల దృష్టిని శంకించవలసిందే. గల్వాన్ లోయ పరిణామాలతో కూడా చైనా పట్ల మనమే ఘర్షణ వైఖరితో ఉన్నామని అంటే దేశం పట్ల వాళ్లకి ఉన్న దృక్పథాన్ని, దేశం పట్ల వాళ్ల ప్రేమని అనుమానించక తప్పదు.

అస్సాం కాంగ్రెస్ నాయకుడు, ఎంపీ గౌరవ్ గొగొయ్ బ్రిటిష్ భార్య ఎలిజబెత్ కోల్‌బర్న్‌కు పాకిస్తాన్‌తో సంబంధాలు ఉన్నాయని సాక్షాత్తు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ ఆరోపించారు. అస్సాం కేంద్రంగా భారత్ వ్యతిరేక కార్యకలాపాలు జరుపుతున్న ముఠాలపై దర్యాప్తు కోసం హిమంత ఒక కమిటీని కూడా నియమించారు. ఎలిజిబెత్‌తో కలసి పని చేసిన పాకిస్తాన్ దేశీయుడు అలీ తౌకీర్ షేక్ అనే వ్యక్తి మీద ఆ కమిటీ కేసు నమోదు చేసింది.

ఈ రెండు అంశాల మీద కాంగ్రెస్ రెండు రకాలుగా స్పందించవలసి వచ్చింది. శామ్ పిత్రోడా వ్యాఖ్యలు వ్యక్తిగతమనీ, వాటికీ పార్టీకీ ఏమీ సంబంధం లేదని ఆ పార్టీ మేధోవర్గ నేత జైరామ్ రమేశ్ చెప్పుకున్నారు. కానీ ఎంపీ గౌరవ్ గొగొయ్ భార్య విషయం మాత్రం పార్టీని అప్రతిష్ట పాల్జేయడానికి పన్నిన ఎత్తుగడ అని ఆయన తేల్చి పారేశారు. నిజానికి చైనా లేదా పాక్ పట్ల అవ్యాజమైన అనురాగం చూపించడం ఆ పార్టీకి కొత్త కాదు. ఇప్పుడు కాస్త ఎక్కువైంది. కాంగ్రెస్‌కు భారత్ పట్ల ఎప్పుడూ గౌరవం లేదని బీజేపీ ఆరోపించడం అందుకే. భారతీయ జనతా పార్టీ పట్ల వ్యతిరేకత, భారత్ పట్ల వ్యతరేకత వేర్వేరని ఆ పార్టీ ఎప్పుడు గుర్తిస్తుంది? ★

24 ఫిబ్రవరి 2025, సోమవారం | అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ - బృహదారణ్యకోపనిషత్




40లో

కథ

**సంరక్షణ**

- వి.రాజారామమోహనరావు





| | | |
|---|---|---|
| సేద్యాన్ని ప్రోత్సహించిన బడ్జెట్ (రైతే రాజు) | - | 10 |
| సమన్వయ లోపంతో పాలన అస్తవ్యస్తం (తెలంగాణ) | - | 14 |
| ఇస్రో 100 మిషన్ ప్రయోగం విజయవంతం (ఆంధ్రప్రదేశ్) | - | 16 |
| భారత్‌కు రెండో టైమ్ జోన్ అవసరమా? (జాతీయం) | - | 22 |
| మోదీ విదేశీ పర్యటనల్లో మరో మణిపూస (అంతర్జాతీయం) | - | 24 |
| వారసత్వానికి పురస్కారం (మహిళ) | - | 28 |
| ప్రపంచమొక 'పద్మ'వ్యూహం (వివాదం) | - | 30 |
| బాంగ్లాదేశ్‌లో హిందువులే లక్ష్యంగా దాడులు (వాస్తవం) | - | 32 |
| భారత్ 'మినీ' టార్గెట్ ! (క్రీడ) | - | 43 |
| వెండితెరపై 'కృష్ణ'కాంతులు (సినిమా) | - | 50 |




అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కుర్చీ ఎక్కిన కొద్ది రోజులకే దేశ ఖజానా మీద ఖర్చు తగ్గించడం కోసం అంతర్జాతీయ అభివృద్ధి ఏజెన్సీ- యూఎస్ఎయిడ్-తో పాటుగా ఇక అమెరికాలో ఏ ప్రభుత్వ సంస్థ కూడా విదేశాలకు ఎలాంటి ఆర్థికసాయాన్ని చేయాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పారు. అంతేకాదు, ఈ రకమైన కార్యకలాపాలను సమీక్షించడానికి 90 రోజుల వరకు వాటికి ఉద్దేశించిన నిధులను ఎటూ పోకుండా నిలిపివేస్తూ, కార్యనిర్వాహక ఉత్తర్వు జారీ చేశారు. దీంతో యూఎస్ఎయిడ్ అభివృద్ధి పేరు చెప్పుకొని తాను నియమించుకున్న 10 వేల మంది ఉద్యోగులకు తోడు భారత్ వ్యతిరేక శక్తులతో మనదేశంలో దశాబ్దాలుగా

# అరాచకాల యూఎ

డోనాల్డ్ ట్రంప్ సర్కారు యూఎస్ఎయిడ్‌కు కళ్లెం వేస్తూ జారీ చేసిన ఉత్తర్వు భారత్ లాంటి దేశాల నెత్తిన పాలు పోసినట్టయింది. మొదట్నుంచి కూడా ట్రంప్‌కు పన్నుల రూపంలో అమెరికాలో ఉంటున్న వారి నుంచి సేకరించిన సొమ్మును విదేశాలకు మానవీయ సాయం పేరిట ఖర్చు చేయడం ఏ మాత్రం ఇష్టం లేదు. అలా చేయడం వల్ల అమెరికా ఫస్ట్ అంటూ తాను అధికారంలోకి రావడానికి చేపట్టిన అభివృద్ధి నినాదం ఎందుకూ కొరగాకుండా పోతుందనేది ఆయన అభిప్రాయం. ట్రంప్ దృష్టి అందుకే, మరీ ముఖ్యంగా యూఎస్ ఎయిడ్ మీద పడింది. ప్రభుత్వ గణాంకాలకు లోబడి అమెరికా 2023లో అంతర్జాతీయ సాయం కోసమని 68 బిలియన్ డాలర్లు ఖర్చు చేసింది. అయితే ఈ మొత్తం వేర్వేరు డిపార్ట్‌మెంట్లు, ఏజెన్సీల ద్వారా ఖర్చవుతాయి. కానీ అందులో సింహభాగం యూఎస్ఎయిడ్‌దే. దానర్థం ఈ ఏజెన్సీ బడ్జెట్ 40 బిలియన్ డాలర్ల పైమాటే. మరో మాటలో చెప్పాలంటే అమెరికా ప్రభుత్వం సంవత్సరానికి పెట్టే మొత్తం ఖర్చు 6.75 ట్రిలియన్ డాలర్లు ఐతే అందులో యూఎస్ఎయిడ్ వాటా 0.6 శాతం.

ఇదంతా చూసిన ట్రంప్‌కు చిర్రెత్తుకొచ్చింది. శ్వేతసౌధం రంగంలోకి దిగింది. యూఎస్ఎయిడ్ నిధులను వృథా చేయడమే కాకుండా, దుర్వినియోగం చేస్తోందని ప్రకటించింది. ఈ మేరకు ఓ జాబితాను ప్రచురించింది. ఆ జాబితాలో యూఎస్ఎయిడ్ సెర్బియాలో ఎల్‌జీబీటీక్యూ మూకకు గ్రాంటు రూపేణా ఇచ్చిన 1.5 మిలియన్ డాలర్లు, వియత్నాంలో ఎలక్ట్రిక్ వాహనాలకు రూ. 2.5 మిలియన్ డాలర్లు, ఈజిప్టులో పర్యాటకానికి 6 మిలియన్ డాలర్లు లాంటి ఖర్చులు చాలా కనిపించాయి. టెక్నాలజీతో బిలియన్లకు పడగెత్తిన అమెరికా ప్రభుత్వ ప్రత్యేక ఉద్యోగి ఎలాన్ మస్క్ అయితే యూఎస్ ఎయిడ్‌ను ఇరుకునపడేయడంలో ఓ అడుగు ముందుకు వేశారు. యూఎస్ఎయిడ్ హాలీవుడ్ తారల ఉక్రెయిన్ పర్యటనకు ఖర్చు పెట్టిందంటూ ఓ వీడియోను సోషల్ మీడియాలోకి వదిలారు. అంతకుమునుపు అది ఓ నేరపూరితమైన సంస్థ అని మస్క్ అంటే అందుకు బదులుగా యూఎస్ఎయిడ్ తలుపులకు తాళాలు వేసేందుకు ట్రంప్ సరేనన్నారు. ట్రంప్‌కు ఈ మధ్యనైతే ఆ ఏజెన్సీపైన కోపం తారస్థాయికి చేరుకుంది. ఆ ఆగ్రహాన్ని వెళ్లగక్కడానికి తనదే 'ట్రూత్ సోషల్' పేజీలో ఓ పోస్ట్ పెట్టారు. యూఎస్ ఎయిడ్ పెడుతున్న ఖర్చు మాటల్లో చెప్పలేనంతగా ఉందని మండి పడ్డారు. దాన్ని మూసివేయండి అంటూ హుకుం జారీ చేయడం దాని ఫలితమే.

అయితే ఇదంతా అమెరికా వ్యవహారం కదా, ఇందులో భారత్‌కు వచ్చేదేముంది పోయేదేముంది అని అనుకుంటే పొరపాటే. అన్ని అనుకున్నట్టుగా జరిగితే నేడో రేపో దుకాణం మూత వేసుకునే దుస్థితిలో ఉన్న యూఎస్ఎయిడ్ భారత్‌లో ప్రత్యక్షంగా పరోక్షంగా చేసిన అఘాయిత్యాలను తెలుసుకుంటే గుండెను బండగా చేసుకున్న ఎంతటి వారికైనా మనస్సు చివుక్కుమనకమానదు. అదే సమయంలో యూఎస్ఎయిడ్ పట్ల పెల్లుబికే కోపానికి కట్టలు కట్టడం అంత తేలిగ్గాదు. ముందుగా ఇప్పటికీ తలచుకుంటే ప్రతి ఒక్క భారతీయుడికి ఎంతో వేదన కలిగించే ముంబై ఉగ్రదాడులతో మొదలెడదాం.

**ముంబై ఉగ్రదాడికి ఆర్థిక సాయం**

నవంబర్ 26, 2008, రాత్రి ముంబై నగరంపై ఉగ్రవాదులు జరిపిన దాడి యావత్ ప్రపంచాన్ని వణికించింది. పాకిస్తాన్ కేంద్రంగా పనిచేస్తున్న లష్కరే తోయిబా(ఎల్‌యిటీ) ఉగ్రమూకలో సాయుధులైన 10 మంది ఉగ్రవాదులు నగరంలోకి చొరబడ్డారు. 170 మందికి పైగా అమాయకులను పొట్టన పెట్టుకున్నారు. మదమెక్కినట్టుగా వరుసగా దాడులు జరిపి 300 మందికి పైగా ప్రజలను తీవ్రంగా గాయపరిచారు. అమానవీయమైన ఆ దాడులు భారత్ సమష్టి స్మృతిపై ఓ చెరిగిపోని మరకను మిగులుస్తున్నట్టుగా తాజ్ మహల్, ఒబెరాయ్ ట్రైడెంట్ లాంటి పేరున్న హోటళ్లు, ఛత్రపతి శివాజీ టెర్మినస్, ఓ ఆస్పత్రి, యూదులకు చెందిన ఓ కేంద్రం లక్ష్యంగా జరిగాయి.

అయితే ఈ ఘాతుకానికి పాల్పడిన ఎల్‌యిటీ, తదితర ఉగ్రమూకలకు ఆర్థిక సాయం అందించడం వెనుక పలు దాతృత్వ సంస్థలు ఉన్నాయన్న విషయం వెలుగులోకి రావడం అత్యంత దిగ్భ్రాంతికరం. వాటి

సాగిస్తున్న అరాచకాలకు సొమ్ముల్లేకుండా పోయాయి. యూఎస్‌ఎయిడ్ ఆక్టోపస్‌లా దేశాన్ని కమ్ముకుని అన్ని రంగాలను అతలాకుతలం చేసింది. 2019లో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రాకుండా కుయుక్తులు పన్నింది. అందులో భాగంగా వాట్సప్‌లో ఒకరి ఖాతా నుంచి గంపగుత్తగా పంపించే సందేశాల సంఖ్యకు పరిమితి విధించి తద్వారా సోషల్ మీడియాలో అప్రతిహతంగా సాగిపోతున్న బీజేపీ ప్రచార ప్రస్థానానికి మోకాలడ్డు పెట్టేందుకు ప్రయత్నించింది. అయినా కానీ యూఎస్‌ఎయిడ్ పథకం పారలేదు. మోదీ నేతృత్వంలో ఎన్డీయే కూటమి రెండోసారి కేంద్రంలో అధికార పగ్గాలు చేపట్టింది. సిగ్గుశరం లేని యూఎస్‌ఎయిడ్ దేశమంటే ఏ మాత్రం భక్తి లేని కొందరు భారత పాత్రికేయులతో చేతులు కలిపింది. అలాంటి పాత్రికేయులు అండగా తాను రూపొందించిన భారత్ వ్యతిరేక ప్రణాళిక అమలుకు ఒడిగట్టింది. ప్రధాని మోదీ హయంలో కశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా దేశ ప్రజలకు అందుతున్న అభివృద్ధి ఫలాలు యూఎస్‌ఎయిడ్‌కు, దాని అడుగులకు మడుగులు వొత్తుతూ లౌకికవాదులమంటూ చెప్పుకునే గుప్పెడంత మంది భారతీయులకు కంటగింపుగా మారాయి. యూఎస్‌ఎయిడ్ భారత్‌లో ఫ్యాక్ట్‌శాల అనే దుకాణం తెరిచింది. అమెరికాలో కాలిఫోర్నియా కేంద్రంగా స్వచ్ఛంద సేవా సంస్థ ముసుగులో అక్రమాలకు పాల్పడుతున్న ఇంటర్‌న్యూస్‌తో చేతులు కలిపింది. అటు అమెరికాలో ఇంటర్‌న్యూస్, ఇటు భారత్‌లో ఫ్యాక్ట్‌శాల ఈ రెండింటి సాయంతో మన దేశంలో మీడియాపై పెత్తనం చెలాయించడానికి మిలియన్ల కొద్దీ అమెరికన్ డాలర్లు కుమ్మరించింది. అక్కడితో ఆగితే అది యూఎస్‌ఎయిడ్ ఎందుకవుతుంది? భారత్‌లో అస్థిరత సృష్టించడానికి ముస్లిం మతోన్మాద ఉగ్రమూకలతో యూఎస్‌ఎయిడ్ చేతులు కలిపింది. ప్రజలపై దాడులు చేయడానికి, అన్నెంపున్నెం ఎరుగని యువకుల్లో మతోన్మాద బీజం నాటి, వారిని మూర్ఖత్వం తలకెక్కిన జిహాదీలుగా మార్చి అఘాయిత్యాలు చేయడం కోసమని వారికి నిధులను సమకూరుస్తోంది యూఎస్‌ఎయిడ్. ఇలా చెప్పుకుంటే పోతే అది చేసే అరాచకాలు కోకొల్లలు.

# ...స్‌ఎయిడ్

వివరాల్లోకి వెళితే ఫలా హ్–ఎ–ఇన్సానియత్ (ఎఫ్ఐఎ) ఫౌండేషన్ ముంబై దాడుల సూత్రధారి హాఫీజ్ సయీద్ స్థాపించినదే. అమెరికా ప్రభుత్వం దీనిని చాలా కాలం క్రితమే ఓ ఉగ్రవాద సంస్థ అని ప్రకటించింది. సయీద్ ఓ వైపు ఉగ్రవాద కార్యకలాపాలకు ఊతమిస్తూనే మరోవైపు అమెరికాలో మిచిగాన్ కేంద్రంగా పనిచేస్తున్న హెల్పింగ్ హ్యాండ్ ఫర్ రిలీఫ్ అండ్ డెవలప్‌మెంట్ (హెచ్‌హెచ్‌ఆర్‌డీ) అనే దాతృత్వ సంస్థ లాంటి సంస్థలతో మానవ కల్యాణానికి పాటుపడుతున్నాననే ముసుగు కప్పుకున్నాడు. అయితే పాకిస్తాన్‌లో హెచ్‌హెచ్‌ఆర్‌డీ జరిపిన అనేక మానవీయ కార్యక్రమాల వెనుక




సయీద్‌కు చెందిన ఫలాహ్-ఎ-ఇన్‌సానియత్ ఉందనే వార్తలు బాగానే వచ్చాయి. అణగారిన వర్గాలకు సాయం అందిస్తున్నట్టు చెప్పుకునే హెచ్‌హెచ్‌ఆర్‌డీకి అనేక మార్గాల్లో నిధులు అందుతుండేవి. అలాంటి హెచ్‌హెచ్ ఆర్‌డీకి యూఎస్‌ఎయిడ్ నుంచి 1,10,000 డాలర్ల ఆర్థిక సాయం అందింది. అది కూడా ముంబైలో ఉగ్రదాడులు మరికొద్ది సంవత్సరాల్లో జరుగుతాయనగా అందింది. ఇదే కాకుండా జార్జ్ సొరోస్ భారత్, బాంగ్లాదేశ్ దేశాల్లో ప్రభుత్వాలను అస్థిర పరచడానికి యూఎస్‌ఎయిడ్‌ను వాడుకున్నాడనే వార్తలు కూడా వచ్చాయి. సొరెస్, అతడి మనుషులు భారత్‌ను అస్థిర పరచాలని ఎప్పటినుంచో కలల కంటున్నారు. యూఎస్‌ఎయిడ్ ఎల్‌యీటీకి ఆర్థిక విభాగమైన ఎఫ్‌యీఐకి దగ్గర కావడంతో ఈ విషయం ఇప్పుడు వెలుగులోకి వచ్చింది. ఎల్‌యీటీకి మొట్టమొదటి ఆర్థిక విభాగంగా జమాత్-ఉద్-దవా ఉండేది. అయితే అమెరికా దానిపై ఉగ్రవాద సంస్థ అనే ఓ ముద్ర వేయడంతో ఎఫ్‌యీఐ స్వచ్ఛంద సేవా సంస్థ పేరిట కొత్త ముసుగు కప్పుకు వచ్చింది. అయితే ఎఫ్‌యీఐ నేటికి కూడా దాతృత్వం, మాన వ సేవ పేరుతో నిధులు సేకరిస్తునే ఉంది. అలా సేకరించిన నిధుల్లో అధికభాగం లష్కరే తోయిబా జమ్మూ కశ్మీర్‌లో దాడులను కొనసాగించడానికి ఖర్చువు తున్నది. ఇందులో దిగ్భ్రాంతి కలిగించే విషయం ఏమిటంటే అమెరికా ప్రభుత్వం ఎఫ్‌ఈఐ, దాని మాతృసంస్థ లష్కరే తోయిబాపై నిషేధం విధించి నప్పటికీ యూఎస్‌ఎయిడ్ ఎఫ్‌ఈఐకి నిధులు అందిస్తూనే ఉంది. ముందుగా చెప్పుకున్నట్టు మిచిగాన్ కేంద్రంగా పనిచేస్తున్న హెచ్‌హెచ్‌ఆర్‌డీ అనే ముస్లిం దాతృత్వ సంస్థకు దక్షిణాసియాలో జిహాదీ మూకలతో చాలా దగ్గర సంబంధాలున్నాయి. 2019లో ఉగ్రమూకలకు సాయం అందిస్తున్నదనే అభియోగాలు హెచ్‌హెచ్‌ఆర్‌డీపై వచ్చాయి. అయినా కానీ యూఎస్‌ఎయిడ్ నుంచి హెచ్‌హెచ్‌ఆర్‌డీకి 1,10,000 డాలర్లు ముట్టాయి. విదేశీ వ్యవహారాల హౌస్ కమిటీ ఛైర్మన్ టి మెక్ కౌల్ ఇదే విషయాన్ని 2023లో లేవనెత్తారు. యూఎస్‌ఎయిడ్ అడ్మినిస్ట్రేటర్ సమంతా పవర్‌కు ఓ లేఖ రాశారు. “2021, అక్టోబర్‌లో సాగర రవాణా సరుకు సుంకం తిరిగి చెల్లించే కార్యక్రమం కింద యూఎస్‌ఎయిడ్ హెచ్‌హెచ్‌ఆర్‌డీకి 1,10,000 డాలర్లు మంజూరు చేసింది. హెచ్‌హెచ్‌ఆర్‌డీకి చాలా కాలంగా ప్రకటిత ఉగ్రవాద సంస్థలు, ఉగ్రవాదులకు ఆర్థిక సాయం చేసేవారితో, వేర్పాటువాదు మూకలతో సంబంధాలున్నాయంటూ అభియోగాలున్నప్పటికీ ఈ మొత్తాన్ని మంజూరు చేశారు” అని ఆ లేఖలో పేర్కొన్నారు. ముగ్గురు కాంగ్రెస్ సభ్యులు ఇదే విషయమై దర్యాప్తు చేయాలని స్టేట్ డిపార్ట్‌మెంట్‌కు విజ్ఞప్తి చేశారు. మెక్ కౌల్ అయితే ఈ అభియోగాలపై దర్యాప్తు అయ్యేంతవరకు హెచ్‌హెచ్‌ఆర్‌డీకి నిధులు విడుదల చేయవద్దని కోరారు. యూఎస్‌ఎయిడ్ ఇన్ని అభియోగాల మధ్య జో బైడెన్ హయాంలో 2023లో హెచ్‌హెచ్‌ఆర్‌డీకి 73,000 డాలర్లు విడుదల చేసింది. ఇప్పటి డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం యూఎస్ ఎయిడ్‌కు ఊపిరాడకుండా చేయడంతో హెచ్‌హెచ్‌ఆర్‌డీ లాంటి ఉగ్రమూకలకు ఆర్థిక సాయం అందించే సంస్థలకు ఇకపై అమెరికా నుంచి చిల్లి గవ్వ కూడా రాదు. దానర్థం జిహాదీ అనుకూల సంస్థ మునుపటిలాగా ఎఫ్‌ఈఐకు నిధులు సమకూర్చి పెట్టలేదు.

**ఫ్యాక్ట్‌శాల కాదు ఫేక్‌శాల**

అమెరికాలో ఇంటర్‌న్యూస్ నెట్‌వర్క్ అనే అంతర్జాతీయ మీడియా ఎన్జీవో ఉంది. దీని పనల్లా వేర్వేరు దేశాల్లో మీడియాను తన గుప్పిట్లో పెట్టుకోవడం, తనకు నచ్చని సమాచారానికి తప్పుడు సమాచారం అని ముద్ర వేసి ఆ తర్వాత అలాంటి సమాచారాన్ని అడ్డుకోవడానికి తన కత్తెరకు పని చెప్పడం. ఇంటర్‌న్యూస్ 2023లో 9,000 మందికి పైగా పాత్రికేయులకు తన ధోరణికి తగ్గట్టుగా శిక్షణ ఇచ్చింది. అదే సమయంలో సోషల్ మీడియాలో సెన్సార్ షిప్‌కు కూడా మద్దతు ఇచ్చింది. ఒక డేటా ప్రకారం ఇంటర్‌న్యూస్ 17 ఏళ్లలో అందుకున్న ఆర్థిక సాయంలో 87 శాతాన్ని అంటే దాదాపు 415 మిలియన్ డాలర్లను యూఎస్‌ఎయిడ్ సమకూర్చింది. ఇలాంటి ఇంటర్‌న్యూస్‌కు భారత్‌లో ఫ్యాక్ట్‌శాల పేరిట పాత్రికేయులకు శిక్షణను ఇచ్చే కార్యక్రమంతో సంబంధం ఉంది. పాత్రికేయుడు సయీద్ నజాకత్ స్థాపించిన డేటాలీడ్స్ ఫ్యాక్ట్‌శాలను నడుపుతోంది. ఫ్యాక్ట్‌శాల ద్వారా 75,000 మంది మీడియా వ్యక్తులకు శిక్షణ ఇచ్చినట్టు డేటాలీడ్స్ చెప్పుకుంది. తప్పుడు సమాచారానికి వ్యతిరేకంగా గూగుల్ న్యూస్

## ఒత్తిడిలో వాట్సప్..

**యూ**ఎస్‌ఎయిడ్ మతోన్మాద ఉగ్రవాద మూకలకు మాత్రమే అన్ని రకాలుగా సాయ పడటంతో సరిపుచ్చుకోలేదు. అది 2019లో భారత్‌లో లోక్‌సభకు ఎన్నికలు జరిగినప్పుడు కూడా తలదూర్చింది. మోదీకి అనుకూలంగా వచ్చే సమాచారంపై వేటు వేయాలని ఫేస్‌బుక్, యూట్యూబ్, వాట్సప్, ట్విటర్ (ప్రస్తుతం ఎక్స్) లాంటి సోషల్ మీడియా వేదికలపై విపరీతమైన ఒత్తిడి తీసుకొచ్చింది. అయినా కానీ బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి ఆ ఎన్నికల్లో ఘన విజయం సాధించింది. అప్పట్లో యూఎస్‌ఎయిడ్ ఒత్తిడి వాట్సప్‌పై బాగా పనిచేసింది. భారత్‌లో రాజకీయ పార్టీలు ప్రచారం చేసుకోవడానికి ఓ అనువైన సోషల్ మీడియా వేదికగా వాట్సప్‌కు ఎంతో పేరుంది. అంతకుమునుపు వాట్సప్ వినియోగదారులకు ఒక మెస్సేజ్‌ను ఎంతమందికైనా ఫార్వార్డ్ చేసుకునే వెసులుబాటు ఉండేది. కానీ వాట్సప్ సరిగ్గా లోక్‌సభకు ఎన్నికలు జరగడానికి కొద్ది నెలల

## ఆజాద్ కశ్మీర్‌కు నిధులు



**పా**కిస్తాన్ ఆక్రమిత కశ్మీర్ – పీవోకే అనేది ఓ వివాదాస్పద ప్రాంతమనే సంగతి యావత్ ప్రపంచానికీ తెలిసిందే. అమెరికా భారత్ అభ్యంతరాలు చెబుతున్నప్పటికీ అదే పనిగా కశ్మీర్ విషయంలో తలదూరుస్తునే ఉంటుంది. పీవోకే పట్ల దాని వైఖరి విడ్డూరంగా ఉంటుంది. ఆజాద్ కశ్మీర్ అంటూ పాకిస్తాన్ పాడుతున్న పాటకు అమెరికా వంత పాడుతోంది. దీనికి అద్దం పడుతున్నట్టుగా యుఎస్‌ఎయిడ్ ‘ఆజాద్ జమ్మూ కశ్మీర్‌లో 150 మంది టీచర్లకు అమెరికా శిక్షణ’ పేరుతో ఓ పత్రికా ప్రకటన జారీ చేసింది. అందులో ఆజాద్ జమ్మూ కశ్మీర్‌లో విద్యా మంత్రిగా అబ్దుల్ వహీద్‌ను ప్రస్తావించింది. వేలాదిగా పాకిస్తానీయుల విద్యా ప్రమాణాలను మెరుగుపరిచే దిశగా చేపట్టిన ఉపకార వేతన కార్యక్రమానికి వనరులు సమకూర్చిన అమెరికా ప్రజలకు వహీద్ ధన్యవాదాలు తెలిపారని పేర్కొంది. భారత ప్రభుత్వం పాక్ ఆక్రమిత జమ్మూ కశ్మీర్–పీవోజేకే భారత్ అంతర్భాగమని పదే పదే చెబుతున్నప్పటికీ నిధుల ప్రవాహానికి అడ్డుకట్ట పడలేదు.

ఇదే విషయమై విదేశీ వ్యవహారాల మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ పార్లమెంట్‌లో మాట్లాడుతూ “భారత ప్రభుత్వం ఓ సమష్టి వైఖరికి కట్టుబడి ఉంది. దేశంలో ప్రతీ ఒక్క రాజకీయ పార్టీ కూడా ఆ వైఖరికి మద్దతుగా నిలిచాయి. పీవోజేకే భారత్‌లో భాగం కాదనే మాటను మేం ఒక్కనాటికీ ఒప్పుకునేది లేదు. ఇది ఓ సమష్టి వైఖరి. ఇది మా అందరి వైఖరిగా కలకాలం నిలిచి ఉంటుంది ” అని అన్నారు.

# మోదీ ప్రచారానికి మోకాలడ్డు!




ముందు అంటే 2019, జనవరిలో ఫార్వర్డ్ మెస్సేజ్‌ల సంఖ్యపై పరిమితులు విధించింది. ఇది సోషల్ మీడియాలో ఎక్కువ మంది ఓటర్లను చేరుకోవడంలో బీజేపీ సామర్థ్యాన్ని తక్కువ చేయడానికి పన్నిన ఓ కపటోపాయం తప్ప మరొకటి కాదు. బీజేపీ మద్దతుదారులు జనసమీకరణ కోసమని ఈ సోషల్ మీడియా వేదికను ఎంతగానో నమ్ముకున్నారు. కానీ మెస్సేజ్ ఫార్వార్డింగ్‌పై పరిమితులతో వారు ఎన్నో ఆంక్షలకు లోనయ్యారు. ఇదే విషయమై అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ మాజీ అధికారి మైక్ బెంజ్ మాట్లాడుతూ ఈ విషయంలో యూఎస్‌ఎయిడ్ ప్రమేయం ఉందని చెప్పడానికి తన వద్ద ఆధారాలు ఉన్నాయని తెలిపారు. 2019లో లోక్‌సభకు ఎన్నికలు మరికొద్ది నెలల్లో ముంచుకొస్తాయనగా యుఎస్ ఎయిడ్ ప్రముఖ టెక్నాలజీ కంపెనీతో జట్టు కట్టింది. భారత్ రాజకీయాలపై వక్రభాష్యాలు వినిపించడం మొదలుపెట్టింది. ఎన్నికలకంటూ ఓ ప్రత్యేక కథనాన్ని వండి వార్చి మరీ వడ్డించింది. నరేంద్రమోదీపై దుష్ప్రచారానికి పూనుకుంది. మోదీ ప్రజల మెదళ్లలోకి తప్పుడు సమాచారాన్ని చొప్పించిన కారణంగానే రాజకీయ విజేతగా నిలిచారంటూ సోషల్ మీడియాలో విపరీతంగా ప్రచారం చేసింది. ఇదొక పక్షపాత ధోరణిని సృష్టించింది. సోషల్ మీడియాలో సమాచారానికి పెద్ద ఎత్తున కత్తెర వేయడానికి దారి తీసింది. యూఎస్ ఎయిడ్, దాని తోక సంస్థలు అక్కడితో ఆగిపోలేదు. మోదీ మద్దతుదారులు ఆన్‌లైన్‌లో నకిలీ వార్తలను వ్యాపింపజేస్తున్న కారణంగానే భారత్ సోషల్ మీడియాలోకి తాను తలదూర్చాల్సి వచ్చిందంటూ యూఎస్‌ఎయిడ్ తన చర్యను సమర్థించుకుంది. అది ఎయిర్ ఇంటర్నేషనల్ మీడియా, డిజిటల్ ఫోరెన్సిక్ గ్రూప్‌లతో లోపాయికారిగా ఓ ఒప్పందం కుదుర్చుకుంది. ఇంద్రజాలికుడు ఖాళీ టోపీలో నుంచి ఓ కుందేలును చెవులు పట్టి మరీ బైటకు తీసుకొచ్చిన చందంగా భారత్ ఓ తీవ్రమైన తప్పుడు సమాచారపు సంక్షోభంలో చిక్కుకున్నదనే నివేదికను యూఎస్ ఎయిడ్ సృష్టించిందని మైక్ బెంజ్ వెల్లడించారు. దీంతో సోషల్ మీడియా వేదికలపై మోదీ అనుకూల సమాచారాన్ని అణగదొక్కడానికి ఆ నివేదిక ఓ ఆయుధంగా మారింది. ఆ కారణంగా మోదీ అనుకూల సమాచారాన్ని తొలగించాలంటూ ఇతర ప్రధానమైన సోషల్ మీడియా వేదికలపైన కూడా ఒత్తిడి పెరిగిందని, దానికి అవి తలొగ్గక తప్పలేదని బెంజ్ చెప్పారు. యూఎస్ ఎయిడ్ రాజకీయ వక్రభాష్యం చెప్పడానికని అనేక సంస్థలకు ఆర్థిక సాయం చేసింది. వాటి పనల్లా 2019 ఎన్నికలకు ముందు సోషల్ మీడియాలో బీజేపీ హవాకు అడ్డుకట్ట వేయడమే.

ఇనీషియేటివ్ కార్యక్రమం ఫ్యాక్ట్‌న్యూస్‌కు వెన్ను దన్నుగా ఉంది. అయితే అమెరికా నుంచి భారత్‌కు విస్తరించిన ఈ మొత్తం వ్యవహారానికి సంబంధించిన ప్రధాన లంకె ఇంటర్‌న్యూస్‌తో ముడిపడి ఉంది. ఇంటర్‌న్యూస్‌కు అండగా యూఎస్‌ఎయిడ్ ఉంది. ఇదంతా చూస్తుంటే యూఎస్‌ఎయిడ్ పరోక్షంగా భారత్‌లో పాత్రికేయ విద్యకు తనదైన రూపకల్పన చేస్తోందని స్పష్టమౌతోంది. ఫ్యాక్ట్‌న్యూస్ వెనకాల ది ప్రింట్‌కు చెందిన శేఖర్ గుప్తా, బీట్‌రూట్ న్యూస్‌కు చెందిన ఫయే డిసౌజా, ది క్వింట్‌కు చెందిన రీతూ కపూర్ ఉన్నారు. తప్పుడు సమాచారం వ్యాప్తిని నెమ్మదింపజేసే లక్ష్యంతో తాము పనిచేస్తున్నట్టు ఫ్యాక్ట్‌శాల వర్గాలు నమ్మబలకవచ్చు. అయితే అది ఓ భావజాలంతో అంటకాగుతున్న కారణంగా మీడియా వ్యక్తులకు అది నిర్వహించే శిక్షణా కార్యక్రమాలు తటస్థంగా ఉంటాయని చెప్పలేము. మరీ ముఖ్యంగా నక్సల్ సానుభూతిపరులుగా ముద్ర వేయించుకున్న హర్ష మందేర్, కవితా కృష్ణన్, సోరి సోరి చెప్పుచేతుల్లో ఈ శిక్షణ సాగుతున్నది.

## యూఎస్‌ఎయిడ్‌కు తెర వెనుక పాత్రికేయులు

కేరళకు చెందిన ఆధిరా పరించేరి అనే పర్యావరణ పాత్రికేయురాలు ది హిందూ, ది వైర్, మొంగబే–ఇండియా అనే పేరున్న మీడియా సంస్థలకు కథనాలు రాస్తుంటుంది. ఆమె ప్రధానంగా వన్యప్రాణి సంరక్షణ, పర్యావరణం మీద దృష్టి పెట్టి రాస్తుంటుంది. అయితే యూఎస్‌ఎయిడ్‌తో సంబంధమున్న సంస్థల నుంచి ఆమెకు నిధులు వస్తుండటం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఆమె పర్యావరణ రాతల వెనుక ఇంకేదైనా విస్తృతమైన రాజకీయ అజెండా ఉందా అనే సందేహానికి దారి తీస్తోంది. లక్నోకు చెందిన పాత్రికేయురాలు ఐశ్వర్యా త్రిపాఠి 2021లో నేషనల్ ఫౌండేషన్ ఫర్ ఇండియా – ఎన్ఎఫ్ఐ నుంచి ఫెలోగా ఎంపికైంది. ఇదే ఎన్ఎఫ్ఐ యూఎస్‌ఎయిడ్ నుంచి నిధులు అందుకుంటోంది. ఎన్ఎఫ్ఐ వామపక్ష భావజాలంతో కూడుకున్న ది వైర్, అల్ జజీరా లాంటి మీడియా సంస్థలకు రాస్తున్న పాత్రికేయులకు మద్దతు నివ్వడంలో కీలక పాత్ర పోషిస్తుంటుంది. జమ్మూ కశ్మీర్‌కు చెందిన వాహిద్ భట్ అనే పర్యావరణ పాత్రికేయుడు యుఎస్‌ఎయిడ్‌తో అంటకాగుతున్న ఎన్ఎఫ్ఐ, థామ్సన్ రాయిటర్స్ ఫౌండేషన్ లాంటి సంస్థల నుంచి అవార్డులు అందుకున్నాడు. అతడు పర్యావరణంపై జాతీయ, అంతర్జాతీయ మీడియా సంస్థలకు రాసే కథనాలన్నీ కూడా విదేశీ ప్రయోజనా లకు పనికొచ్చే రాజకీయ వ్యాఖ్యానాలతో రంగరించి ఉంటాయి. స్వతంత్ర పాత్రికేయుడైన సిబి అరసు భారత్‌లో హిందుత్వకు, ప్రస్తుత ప్రభుత్వానికి వ్యతి రేకంగా బలమైన అభిప్రాయాలను వెలిబుచ్చాడు. అతడు నేషనల్ జాగ్రఫిక్, బీబీసీ, ది న్యూ ఇంటర్నేషన లిస్ట్, ది వైర్, మొంగాబే లాంటి అనేక అంతర్జాతీయ, జాతీయ మీడియా సంస్థలకు కథనాలు రాస్తుంటాడు.




– జాగృతి డెస్క్



# సేద్యాన్ని ప్రోత్సహించిన బడ్జెట్

**ఆహార అవసరాలు తీరడానికీ, గ్రామ వికాసానికీ, గ్రామీణ యువత ఉపాధికి, దేశ ఆర్థికాభివృద్ధికీ మూలం వ్యవసాయరంగమే. కాబట్టే ఆ రంగానికి 2025-26 బడ్జెట్‌లో కేంద్రం విశేష ప్రాధాన్యం ఇవ్వడం ముదావహం. ఈ మద్దతు రైతుల ఆర్థిక పరిపుష్టికి, వ్యవసాయోత్పత్తుల పెంపునకు, వాణిజ్యపరంగా ఉత్పత్తులు పెంచడానికి, ఇతర దేశాల ఆహార అవసరాలను తీర్చేందుకు కూడా దోహదం చేస్తుంది. ఎక్కువకాలం సూర్యరశ్మి, ఇతర వాతావరణ పరిస్థితులతో రకరకాల పంటలు పండించేందుకు అనుకూలమైన దేశం మన భారత్. ఇన్ని వనరులు ఉన్నందునే కరోనా కాలంలోనూ మన ఆహార అవసరాలు తీర్చడమే కాక, ఇతర దేశాల అవసరాలను కూడా సాయపడింది. వ్యవసాయాభివృద్ధి కారణంగానే మన ఆర్థిక ప్రగతి కుంటుపడకుండా గినంత జరిగింది.**

ఈ బడ్జెట్‌లో రూ. 1,29,280 కోట్ల కేటాయింపులతో కార్యశీలత కలిగిన ఆరు పథకాలకు చోటు కల్పించారు. ఇది గత ఏడాది కేటాయింపుల కంటే మిన్నగానే ఉన్నప్పటికీ, 2024-25 రివైజ్డ్ బడ్జెట్‌లో సూచించిన గణాంకాల కన్నా (రూ. 1,31,195.27 కోట్లు) తక్కువే. అంటే రూ. 390.05 కోట్లు తక్కువ. కాబట్టి కొన్ని రంగాలకు కేటాయింపులు తగ్గించినట్టే. ఉదాహరణకి గత ఏడాదితో పోలిస్తే ఈ పథకాలకు (ఫసల్ బీమా యోజన, కేంద్ర పథకాలు, ఎరువుల మీద) కొంత తగ్గింపు ఉన్నప్పటికీ ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించిన ఆరు పథకాలు, వ్యవసాయ పరిశోధనల కోసం పెంచిన కేటాయింపులు కనిపిస్తున్నాయి. ఇదే ప్రభుత్వం ముందు చూపునకు మంచి నిదర్శనం. ఈ కొత్త పథకాలు, గతంలోని ముఖ్యపథకాల గురించి క్లుప్తంగా తెలుసుకోవాలి.

### అధికోత్పత్తికి ధనధాన్య కృషి యోజన

అధికోత్పత్తిని ఇవ్వగలిగి, ఆయా వాతావరణ పరిస్థితులకు అనువైన నూతన వంగడాలు, తగినంత సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్నప్పటికీ ఉత్పాదకత ఇంకా ఆశించిన స్థాయిలో జరగడం లేదు. వరి, గోధుమతో పాటు చిరుధాన్యాలు, అపరాలు, పప్పు ధాన్యాలు ప్రస్తుతం దేశంలోని వంద జిల్లాలలో పండిస్తున్నారు. తగిన వనరులు, సాంకేతిక పరిజ్ఞానం రైతులకు అందుబాటులోకి తెచ్చి ఈ పంటలన్నిటి ఉత్పత్తిని గణనీయంగా పెంచడానికి ప్రయత్నం జరుగుతుందని ఆశించవచ్చు. ఇందుకోసం ప్రదర్శన క్షేత్రాలు, పంటల పర్యవేక్షణ, రైతులతో ముఖాముఖీ కార్యక్రమాలు, ఇతర ప్రచార మాధ్యమాలను ఉపయోగించుకుని ఆయా పంటల విస్తీర్ణం, ఉత్పాదకత పెంచే ప్రయత్నం జరుగుతుంది. రాష్ట్రాల సహకారం కూడా తీసుకుని కేంద్ర నిధులతో పంటల వైవిధ్యాన్ని పెంచి సాధారణ రైతుకు మేలు చేయాలన్న తలంపు కనిపిస్తుంది.



నీటివనరులు ఉన్న జిల్లాలలో పలు పంటలు, ముఖ్యంగా వరి, గోధుమ ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కనీస మద్దతు ధర కొనుగోలు చేసేది. దీనితో రైతులకు నికరంగా కొంత మిగులుతుంది. కాబట్టి అలాంటి పంటల వైపే రైతులు మొగ్గు చూపేవారు. మొక్కజొన్న, చిరుధాన్యలు, పప్పు ధాన్యాలు, అపరాలు అధిక వర్షాలు లేదా వర్షాభావ పరిస్థితుల వల్ల ఉత్పాదకత, ఉత్పత్తి తక్కువ. ఇలా తక్కువ ఉత్పత్తి ఉన్నప్పటికి ప్రభుత్వం నుండి సరైన మద్దతు ధర దక్కడం లేదు. దీనితో పలు సందర్భాలలో వ్యవసాయోత్పత్తులను రైతులు మార్కెట్‌లో తక్కువ ధరకే అమ్ముకోవలసిన పరిస్థితి ఏర్పడుతున్నది. అందుకే ఈ పంటల సాగు పట్ల రైతులు విముఖంగా ఉంటున్నారు. నిజానికి ఈ పంటలు వైవిధ్యం, భూసార పరిరక్షణకు, వాతావరణ సమతుల్యతకు దోహదపడుతు, రైతుకు ఆదాయం కూడా తెచ్చి పెట్టేవే. కానీ ప్రోత్సాహం లేదు. అదే

ఉంటే రైతులు ఈ పంటల వైపు కూడా మొగ్గు చూపుతారు. పరిశోధనలతో ముడిపడి ఉన్న ప్రోత్సాహక పథకాన్ని అమలు చేస్తున్నట్టు కేంద్ర ఆర్థికమంత్రి ప్రకటించారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు తట్టుకునే విధంగా, నూతన వంగడాలను రూపొందించేందుకు, వాటి సాగుకు అనువైన సాంకేతిక పరిజ్ఞానాన్ని రూపొందించేందుకు అవసరమైన పరిశోధనల విషయంలో ప్రకృతి వ్యవసాయానికి పెంచిన స్థాయిలో పెంచలేదు. గతంలో కన్నా తక్కువే కూడా. అయినా అధిక పోషక, చీడపీడలను తట్టుకునే నూతన వంగడాల రూపకల్పనకు శాస్త్రవేత్తలు ఇతోధికంగా కృషి చేయాలి. ఇప్పటికే సిద్ధమైన (వంద ఆవిష్కరణలు) వంగడాల సాగును ప్రోత్సహించాలి. ఈ పంటల విస్తీర్ణం పెంచేందుకు శ్రమించాలి. స్థానిక, ఇతర ప్రాంత అవసరాలకు తగినట్టు సాగు చేసే విధంగా చూడాలి. ప్రభుత్వం కూడా ఈ పంటలను గిట్టుబాటు ధరతో కొనుగోలు చేస్తే ఆశించిన ఫలితాలు ఉంటాయని గట్టిగా చెప్పవచ్చు.

**పప్పుధాన్యాల ఉత్పత్తికి ఆత్మనిర్భరత మిషన్**

పప్పుధాన్యాలు, అపరాల ఉత్పత్తి కొంతవరకు పెరిగింది. అయినా మన ప్రజల అవసరాల మేరకు స్వయం సమృద్ధిని సాధించవలసిన అవసరం మాత్రం ఉంది. ఈ లోటును భర్తీ చేయడానికే ఆత్మనిర్భరత మిషన్ కింద ప్రత్యేకంగా రూ.1000 కోట్లు కేటాయించారు. ఈ పథకం కింద మినుము, పెసర వంటి పప్పుధాన్యాలను సాగును ఇతోధికంగా ప్రోత్సహించి, ప్రాసెసింగ్ ద్వారా గ్రామీణ రైతులకు, మహిళా రైతులకు, సన్న, చిన్నకారు రైతులకు ఉపాధి కల్పించాలన్న ఆశయం ఉంది. ఇందులో భాగంగానే నాలుగేళ్ల నాఫెడ్ ద్వారా పప్పుధాన్యాలను కొనుగోలు చేస్తారు. గ్రామాల నుంచి వలసలను నిరోధించడం, గ్రామీణ యువతకు ఆదాయ మార్గాలు చూపడం కూడా ఈ పథకం ఆశయం. పప్పుధాన్యాలతో పాటు నూనెగింజలలో కూడా ఆత్మనిర్భరత స్ఫూర్తితో స్వయం సమృద్ధిని కనుక సాధించగలిగితే రూ.60 వేల నుంచి 80 వేల కోట్ల వరకు విదేశీమారక ద్రవ్యాన్ని ఆదా చేయగలం. రూపాయి విలువ కూడా సుస్థిరంగా ఉండడమే కాక, పెరుగుతుందని కూడా చెప్పవచ్చు.

**అధికోత్పత్తి వంగడాలకు జాతీయ మిషన్**

అధికోత్పత్తి సాధించాలంటే పరిస్థితులకు అనువైన పంటలు, అందుకు అవసరమైన రకాలు అవసరం. ఈ రకాల సాగుకు మేలైన సాంకేతిక పద్ధతులను ఉపయోగించాలి. ఆ ఉద్దేశంతోనే 2024 నుంచి మేలైన అధికోత్పత్తిని ఇచ్చే రకాలు, పోషక విలువలు కలిగిన, చీడపీడలను తట్టుకునే 100కు పైగా రకాలను ప్రధాని ద్వారా పొలాలకు అందించారు. వీటి నుంచి ఆశించిన ఫలితాలను రాబట్టేందుకు, తద్వారా విత్తనాలను ఇతోధికంగా వృద్ధి చేసి రైతులకు అందించేందుకే ఈ పథకాన్ని ఉద్దేశించారు. ఈ స్ఫూర్తితోనే జాతుల మిషన్‌ను ఏర్పాటు చేశారు. మారుతున్న వాతావరణ పరిస్థితులను, నీటి ఎద్దడిని, చీడపీడలకు తట్టుకుని మంచి పోషణ కల పంట రకాలను రూపకల్పన చేయడం కూడా ఈ పథకం ఉద్దేశం. ఇందుకు రూ.100 కోట్లతో నిధి ఏర్పాటు చేశారు. వంగడాలను వృద్ధి చేసి రైతులకు అందుబాటులోకి తేవడం ఇందులో ప్రధాన ఉద్దేశం.

**ప్రత్తి కోసం ప్రత్యేక పథకం**

ప్రత్తి సాగు దేశంలో అధికోత్పత్తి రకాలతోనే సాగుతున్నది. అయినప్పటికి ఇతర దేశాలతో పోలిస్తే మన దిగుబడి తక్కువే. మనం సాగు చేస్తున్న ప్రత్తిలో పింజె నిడివి తక్కువ. అయితే పింజె నిడివి ఎక్కువ ఉన్న రకాలకే మార్కెట్‌లో గిరాకీ ఉంటుంది. మంచి పింజె, నిడివి ఎక్కువ ఉన్న పింజెతో దిగుబడి సాధించేందుకు, చీడపీడలను తట్టుకు నిలబడే, వాతావరణ పరిస్థితులను తట్టుకునే ప్రత్తి వంగడాల నిర్మాణానికి రూ. 500 కోట్లతో నిధి ఏర్పాటయింది. ఈ నిధితో అనుకున్న విధంగా మంచి పొడవైన పోగు/



దారం ఇవ్వగల, హెచ్చు దిగుబడి సాధ్యమయ్యే ఉత్పత్తిని సాధించేందుకు కృషి జరుగుతుంది. నూలు మిల్లుల సెక్టర్‌లో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ 5ఎఫ్ విజన్‌కు కూడా ఈ ప్రత్తి ప్రత్యేక పథకం ఉపకరిస్తుందని బడ్జెట్‌లో హామీ ఇచ్చారు.

**కూరగాయలు, పండ్ల సాగుకు నూతన పథకం**

ఉద్యానవన విభాగ అభివృద్ధికి తోడుగా పండ్లు, కూరగాయల సాగుకు నూతనంగా ప్రవేశ పెట్టిన పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. దీనిని రూ. 500 కోట్లతో అమలు చేస్తున్నారు. రైతుల ఉత్పత్తి సంస్థలు, సహకార సంఘాలు, రాష్ట్ర ఉద్యానవన విభాగాల సమన్వయంతో వీటి సాగును ప్రోత్సహిస్తే ఉత్పత్తి గణనీయంగా ఉంటుంది.

వంటనూనెలలో స్వయంసమృద్ధి కోసం ఎడిబుల్ ఆయిల్ సీడ్ జాతీయ మిషన్ పథకం అమలు చేయనున్నట్టు ఆర్థికమంత్రి వెల్లడించడం ప్రత్యేక ప్రాధాన్యం కలిగిన అంశంగా భావించాలి. ఏటా మనం దేశ అవసరాల కోసం వంటనూనెల దిగుమతులకు భారీగా విదేశీ మారక ద్రవ్యాన్ని ఖర్చు చేస్తున్నాం. ఈ నేపథ్యంలో ఈ పరిస్థితి నుంచి బయటపడడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయడం ముదావహం. ఇది రైతుల ఆర్థిక పరిస్థితిని కూడా ఇతోధికంగా




మెరుగు పరుస్తుంది.

- మఖన్ అభివృద్ధికి కొత్తగా మఖన్ బోర్డును రూ. 100 కోట్లతో బిహార్‌లో ఏర్పాటు చేయడం వల్ల ఆ రైతులకు మంచి భవిష్యత్తును ఇస్తుంది.
- పశుపోషణ, డెయిరీ సెక్టర్‌లో 2024–25 కన్నా, 2025–26 బడ్జెట్‌లో రూ.319 కోట్లు అదనంగా కేటాయించారు. ఈ ప్రోత్సాహం వల్ల ఆ సెక్టర్ ప్రగతిపథంలో దూసుకు వెళ్లే అవకాశం ఎంతో ఉంది.
- బడ్జెట్‌లో చేసిన ప్రతిపాదనలు, వాటి కేటాయింపులు సక్రమంగా అమలు జరగాలంటే, ఉత్పత్తులు పెరగాలంటే రైతు పెట్టే పెట్టుబడి కూడా కీలకమే.ప్రత్తి రైతులకు సకాలంలో రుణాలు దొరకక, పురుగుమందులు, ఎరువులు వేయకపోవడం వల్ల దిగుబడులు తగ్గుతున్నాయి. రైతులు నష్టపోతున్నారు. ఈ విషయంలో మన ప్రధాని నరేంద్ర మోదీ చొరవతో కిసాన్ క్రెడిట్ కార్డు పరిమితిని రూ. 3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచారు. ఇది వ్యవసాయోత్పత్తులు పెరగడానికే కాదు, రైతు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ఉపకరిస్తుంది.
- పంటల ఉత్పత్తులు గణనీయంగా పెరగడంలో కీలకమైన ఎరువు యూరియా. ఇది తగినంతగా అందుబాటులో ఉండేందుకు అస్సాంలో ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం మంచి నిర్ణయం. ఈ ప్లాంట్ సామర్థ్యం 12.7 లక్షల మెట్రిక్ టన్నులు. దీనితో యూరియా కొరత తీరిపోతుంది.

కొత్త పథకాలు, కేటాయింపులతో ఈ బడ్జెట్ వ్యవసాయరంగానికి ఆశావహంగా కనిపిస్తున్నది.




**ప్రొ. పి. రాఘవరెడ్డి**
మాజీ వీసీ, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం

**జాగృతి ఆధ్వర్యంలో ఏపీయూఎస్ వ్యవస్థాపక కార్యదర్శి**

## స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక

'నవలల పోటీ- 2025'కి రచయితలను ఆహ్వానిస్తున్నాం..



1936-2022

**ప్రథమ బహుమతి రూ. 25,000**

**ద్వితీయ బహుమతి రూ. 20,000**

**సూచనలు :**

➜ ఇతివృత్తం భారతీయ జీవన విధానానికి, విలువలకు అద్దం పట్టేదిగా ఉండాలి. సామాజిక, చారిత్రక, పౌరాణిక అంశాలను స్వీకరించవచ్చు. వ్యావహారిక భాషలోనే ఉండాలి. ➜ నవల 125-150 (ఎ4, 15 పాయింట్) పేజీలకు మించరాదు. ➜ సాధ్యమైనంతవరకు డీటీపీ చేయించిన రచనలనే, పోస్ట్ ద్వారా మాత్రమే పంపాలి. వ్రాతప్రతులైతే చక్కని దస్తూరితో, ఒక్క కొట్టివేత కూడా ఉండరాదు. ➜ నవల మీద రచయిత పేరు ఉండరాదు. విడిగా హామీపత్రంలో పూర్తి చిరునామా మొబైల్ నంబర్‌తో సహా రాయాలి. రచన తమ సొంతమని, అనువాదం, అనుసరణ కాదని, ఎక్కడా ప్రచురితం, ప్రసారం కాలేదని హామీ ఇవ్వాలి. ➜ ఎంపిక విషయంలో తుది నిర్ణయం న్యాయనిర్ణేతలదే. ఉత్తర, ప్రత్యుత్తరాలకు తావు లేదు.

➜ నవలలు పంపవలసిన చిరునామా : **3-4-228/4/1**, జాగృతిభవన్, లింగంపల్లి, కాచిగూడ, హైదరాబాద్- **500027.**

**నవలలు మాకు చేరవలసిన ఆఖరి తేదీ : 08 ఏప్రిల్, 2025**

---

**జాగృతి**

# కార్టూన్‌ల పోటీ



**జొన్నలగడ్డ లక్ష్మీనారాయణ ఆర్థిక సహకారంతో**

**జాగృతి తెలుగు వారపత్రిక 'కార్టూన్‌ల పోటీ-2025' నిర్వహిస్తున్నది.**

**యువ, కొత్త, సమర్థులైన కార్టూనిస్టులను;**

**సమాజంలో ఆరోగ్యకరమైన హాస్యాన్ని పెంపొందించే కార్టూన్‌లను ప్రోత్సహించడమే ఈ పోటీ ముఖ్య ఉద్దేశం.**

**ప్రథమ బహుమతి : రూ.5000/-**

**ద్వితీయ బహుమతి : రూ.3000/-**

**తృతీయ బహుమతి : రూ.2000/-**

**రూ.500 చొప్పున పది ప్రోత్సాహక బహుమతులు**

- కార్టూన్‌లు ఎవరినీ, ఏ వర్గాన్నీ, భారతీయ కుటుంబ విలువలు, మహిళ, సంస్కృతీ సంప్రదాయాలను కించపరచేలా ఉండరాదు.
- అందరికీ చక్కని హాస్యాన్ని పంచేవిగా ఉండాలి.
- ఒక కార్టూనిస్టు ఐదు కార్టూన్‌లకు మించి పంపరాదు.
- కార్టూన్‌లు 8(H) × 10(W) సైజులోనే వేసి పంపగలరు.
- కార్టూన్‌లను స్కాన్ చేసి jagriticompetition@gmail.com కు మెయిల్ చేయాలి. లేదా **కార్టూన్‌ల పోటీ, జాగృతి తెలుగు వారపత్రిక, 3-4-228/4/1**, కాచిగూడ, హైదరాబాద్-**500027**కు పోస్టు చేయాలి.

**కార్టూన్‌లు చేరవలసిన చివరి తేదీ : మార్చి 3, 2025.**



**Dr. G. Suryanarayana Raju**
**M.S. Mch, FRCS, FUICC**
Chief of Surgical Oncology
40+ Years of Experience



**Dr. D. Raghunadharao**
**MD, DM, FRCP (London), FACP**
Chief of Medical Oncology
40+ Years of Experience

మహా శివరాత్రి శుభాకాంక్షలు

## 40+ Years of Oncology Expertise

## Asvins Cancer Care in Hyderabad

**99% Success Rate Over 1,78,000 Cancer Patients**
**Treated 63,000 Success Surgeries**

ASVINS
Specialty Hospitals
Care•Cure•Comfort

### Sugical Oncology Services

- Diagnostic Procedures
- Cancer Resection
- Sentinel Node Biopsy
- Oncoplastic Surgery
- Minimally Invasive Surgery
- Endocrine Surgery
- Gastrontestinal Surgery
- Head and Neck Surgery
- Skin Cancer Surgery
- Palliative Surgery
- Supportive and Reconstructive Surgery
- Surgical Management of Metastasis
- Multidisciplinary Team Care

### Medical Oncology Services

- Chemotherapy
- Targeted Therapy
- Hormone Therapy
- Immunotherapy
- Biologic Therapy
- Cancer Genetics and Genomics
- Palliative Care
- Radiation Oncology Coordination
- Survivorship Care
- Multidisciplinary Team Care

**We do All types of Radical as Well as Organ Sparing Surgeries**

SCAN ME

**Book Your Consultation Now +91 9440445775**

**6-3-903/A&B, Raj Bhavan Road, Somajiguda, Hyderabad, Telangana 500082.**

**We Expertise in Treating All Cancers Expert Treatment At Affordable Prices**

## అశ్విన్స్ స్పెషలిటీ హాస్పిటల్స్

6-3-903/A&B, రాజ్ భవన్ రోడ్, సోమాజిగూడ, హైదరాబాద్, తెలంగాణ 500082.
www.asvinshospitals.com +91 94404 45775

అశ్విన్స్
స్పెషాలిటీ హాస్పిటల్స్



ప్రముఖ సర్జికల్ ఆంకాలజిస్ట్
**డా॥ జి సూర్యనారాయణ రాజు**
M.S. MCh,FRCS,FUICC సర్జికల్ ఆంకాలజీ అధినేత
వ్యవస్థాపక డైరెక్టర్, అశ్విన్స్ స్పెషలిటీ హాస్పిటల్స్
మాజీ సభ్యుడు, MARB, NMC, న్యూఢిల్లీ
మాజీ సహచరుడు. రీసెర్చ్ & ప్రాజెక్ట్స్ డీన్, రిజిస్ట్రార్, ప్రొఫెసర్
మరియు సర్జికల్ ఆంకాలజీ వ్యవస్థాపక అధిపతి, నిమ్స్



ప్రముఖ గైనో ఆంకాలజిస్ట్
**డా॥ రమణి GSV**
MS, OBG
కన్సల్టెంట్ గైనకాలజీ, గైనక్ ఆంకాలజీ &
ప్రివెంటివ్ ఆంకాలజీ

ప్రతి నెల మొదటి ఆదివారం



ప్రముఖ హేమాటో ఆంకాలజిస్ట్
**డా॥ గెంటే. విక్రమ్ కుమార్**
MBBS, MD ఇమ్యునో-హెమటాలజీ మరియు రక్త మార్పిడి (JIPMER),
పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ ఇన్ క్లినికల్ హెమటాలజీ (CMC వెల్లూర్)
కన్సల్టెంట్ హెమటాలజీ మరియు
హెమటో- ఆంకాలజీ

ప్రతి నెల రెండవ ఆదివారం

**ఈ దిగువ లక్షణాలు కలవారు డాక్టర్ గారిని సంప్రదించగలరు.**

తెల్ల బట్ట, అధిక నెలసరి, PCOS లక్షణాలు, గర్భసంచి కాన్సర్, అండాశయ కాన్సర్, అండాశయపు గడ్డలు & నీటి గడ్డలు, గర్భ సంచి కణితులు, గర్భాశయ క్యాన్సర్ వ్యాక్సిన్ (HPV), రుతువిరతి తర్వాత సమస్యలు, దీర్ఘకాలిక దగ్గు, దగ్గేటప్పుడు రక్తం పడటం, మూత్రంలో రక్తం, ఆహారం మింగలేకపోవడం, నోటి పూతల, మెడలో గడ్డలు, రొమ్ము లో గడ్డలు, వాంతులు, రక్తపు వాంతులు, కామెర్లు, దీర్ఘకాలిక అతిసారం, మలబద్ధకం, రక్తస్రావం, తెల్లబట్ట

**అభినవ్ డయగ్నోస్టిక్స్ జెపి రోడ్, ఆనంద బ్లడ్ బ్యాంకు బ్యాంకు దగ్గర, భీమవరం**
**08816 224338**

ఉదయం గం॥ 10:30 ల నుండి గం॥ 2:00 ల వరకు

బ్లడ్ కాన్సర్, అధిక రక్తస్రావం (Bleeding Problem), రక్తహీనత (Anaemia), ప్లేటిలెట్స్ కణాలు తగ్గడం, రక్త కణాలు సమస్య, రక్తం అధికంగా గడ్డకట్టడం, పసికలు (Jaundice), ప్లీహం పెద్దగా అవడం (Splenomegaly), బోన్ మ్యారో మార్పిడి

**లోటస్ డయగ్నోస్టిక్స్ జెపి రోడ్, ఆనంద బ్లడ్ బ్యాంకు బ్యాంకు దగ్గర, భీమవరం**
**08816 230555**

గమనిక పేషెంట్స్ తమ పాత రిపోర్టులతో సంప్రదించండి | అన్ని రకాల క్యాన్సర్ల కు చికిత్స మరియు సలహాలు ఇవ్వబడును.

అపాయింట్మెంట్ కొరకు

**Satyanarayana: +91 75698 11119**

**సీత: +91 9618161032**

రాష్ట్రంలో విచిత్ర పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం సజావుగా సాగడానికి రైలు పట్టాల్లా సమాంతరంగా వెళ్లాల్సిన రెండు ముఖ్యమైన విభాగాలు తలోదారిలో పయనిస్తున్నాయి. దీంతో, ప్రభుత్వ పాలన గాడి తప్పే పరిస్థితులు పొంచి ఉన్నాయి. ప్రభుత్వ పెద్దలు వర్సెస్ అధికారులు మాదిరిగా పరిస్థితి తయారయ్యింది. వాస్తవానికి ప్రజాస్వామ్యంలోని మూలస్తంభాల్లో ప్రధానమైన రెండు రాజ్యాంగ బద్ధమైన సర్వీసుల్లో ఉన్నవాళ్ల మధ్య సమన్వయం కుదరడం లేదట. చట్టాలు చేయాల్సిన, ప్రభుత్వ పాలన సాగించాల్సిన శాసనవ్యవస్థ,దానికి అవసరమైన వివరాలు అందిస్తూ.. ప్రభుత్వ నిర్ణయాలను అమలు చేయాల్సిన అధికార వ్యవస్థ మధ్య అంతరం నెలకొంది. సాక్షాత్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే ఈ విషయం బాహాటంగా చెప్పడం అందరినీ విస్మయ పరచింది. ప్రభుత్వంలో అసలు ఏం జరుగుతోందన్న చర్చను లేవనెత్తింది.




# సమన్వయ లోపంతో పాలన

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొద్దిరోజులుగా ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను ఉద్దేశించి చేస్తున్న వ్యాఖ్యలు ఆలోచింపజేస్తున్నాయి. అధికారుల్లో కొందరు సీరియస్‌గా పని చేయడం లేదని, వాళ్ల బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించడం లేదని గత కొంతకాలంగా ఆయన బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. వాళ్లసలు మాటే వినడం లేదని ప్రకటిస్తున్నారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలే అధికారులను ఓ సమీక్షలో సుతిమెత్తగా మందలించిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు మరోసారి బహిరంగ వేదికపై నుంచి తన అసహనాన్ని వ్యక్తం చేశారు. మరోసారి అధికారుల పనితీరుపై బహిరంగంగా కామెంట్స్ చేశారు. ఇటీవల జరిగిన జిల్లా కలెక్టర్ల సమావేశంలో, ఆ తర్వాత ఓ సీనియర్ ఐఏఎస్ అధికారి రచించిన పుస్తకావిష్కరణ సభలోనూ సీఎం రేవంత్ రెడ్డి హాట్ కామెంట్స్ చేశారు. అయితే, సాక్షాత్తూ ముఖ్యమంత్రి స్వయంగా చెప్పినా.. బహిరంగంగా వెళ్లగక్కినా అధికారులు మాత్రం స్పందించడం లేదట. ఇక్కడా, అక్కడా అని కాదు.. రాష్ట్ర సచివాలయంలోని చీఫ్ సెక్రటరీ నుంచి మొదలుకొని కలెక్టర్ల దాకా కమ్యూనికేషన్ గ్యాప్ ఏర్పడిందంటున్నారు. మరోవైపు.. రాష్ట్రంలో ప్రభుత్వం మారినప్పటికీ.. అధికారులు మారడం లేదని మంత్రులు కూడా తలలు పట్టుకుంటున్న పరిస్థితి నెలకొంది.

సాధారణంగా ఏ రాష్ట్రంలో అయినా ముఖ్యమంత్రి ఒక మాట చెప్పారంటే.. లేదంటే ఏదైనా ఆదేశించారంటే.. ఆ అంశాన్ని వెంటనే అమలు చేయాల్సిన బాధ్యత సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులపై ఉంటుంది. అయితే, కొన్ని సందర్భాల్లో సాక్షాత్తూ ముఖ్యమంత్రి చెప్పిన పనులను సైతం అధికారులు చేయడం లేదని మంత్రులు కూడా అంగీకరిస్తున్న పరిస్థితి ప్రస్తుతం నెలకొంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత.. గత బీఆర్ఎస్ సర్కారుకు భిన్నంగా కార్యాచరణ అమలు చేస్తోంది. ఇందులో భాగంగానే.. రాష్ట్రంలోని హాస్టళ్లలో మెస్ ఛార్జీలు భారీగా పెంచారు. అయితే, ఈ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలంటే కాస్త ప్రచారం కూడా అవసరం. అందుకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. హాస్టళ్లలో పనితీరుపై సమీక్ష చేసిన సమయంలో కలెక్టర్లు, ఎస్పీలకు పలు సూచనలు చేశారు. అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు హాస్టళ్లలో రాత్రిపూట నిద్ర చేయాలని, అక్కడి పరిస్థితులను స్వయంగా తెలుసుకోవాలని.. ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. కానీ, ఆయన సూచనలను దాదాపు ఎవరూ పాటించలేదు. ఒకరిద్దరు మినహా అసలెవరూ ఈ ఆదేశాలను సీరియస్‌గా తీసుకోలేదు. గాలికొదిలేశారు. కలెక్టర్లతో జరిగిన సమావేశంలో ఈ అంశాన్ని సీఎం ప్రత్యేకంగా ప్రస్తావించారు. కానీ, వాళ్ల నుంచి ఏ మాత్రం ప్రతిస్పందన లేదని ప్రభుత్వ వర్గాలు అంటున్నాయి.

ఈ క్రమంలోనే, మాజీ ఐఏఎస్ అధికారి గోపాలకృష్ణ రచించిన 'కర్మయోగి' పుస్తకాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరిస్తూ, అధికారుల పనితీరును మరోసారి తప్పుపట్టారు. ప్రభుత్వ అధికారుల వ్యవహార శైలిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. అధికారులు మంచీ చెడులపై సలహాలు ఇచ్చే విధంగా ఉండాలని, రాజకీయ నేతలు ఇస్తున్న ఆదేశాల్లో తప్పొప్పులను ఎత్తి చూపాలని అన్నారు. కానీ, నేటి అధికారుల్లో ఈ వైఖరి కరువైందని, ఒక తప్పు చేయమంటే.. మూడు తప్పులు చేద్దామనే అధికారులను చూస్తున్నానని వ్యాఖ్యానించారు. సమాజానికి ఇది మంచిది కాదన్నారు.

'ప్రస్తుత అధికారుల వ్యవహారశైలి పట్ల నేను ఏమాత్రం సంతోషంగా లేను. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఏసీ గదుల నుంచి బయటకు రావడం మానేశారు. ఏసీ అనేది జబ్బేమోననిపిస్తోంది. అధికారులు ప్రజల వద్దకు వెళ్లినప్పుడే ప్రజా సమస్యలు అర్థమవుతాయి. ఆఫీసుల్లో కూర్చుంటే ప్రయోజనం ఉండదు' అని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. మహబూబ్‌నగర్ జిల్లా నుంచి ప్రారంభమైన తన రాజకీయ పయనంలో చాలావరకు ప్రతిపక్షంలోనే ఉన్నానని, అప్పట్లో జిల్లా కలెక్టర్లు మారుమూల ప్రాంతాల్లో పర్యటించి ఆయా గ్రామాల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేవారని తెలిపారు. ఇప్పటికీ తాను ఆయా గ్రామాలకు వెళ్లినప్పుడు.. ఎప్పుడో 20 ఏళ్ల క్రితం తమ గ్రామానికి వచ్చిన కలెక్టర్ గురించి అక్కడి ప్రజలు గుర్తు చేస్తుంటారని చెప్పారు.



# అస్తవ్యస్తం

దీనినిబట్టి నాటి అధికారులు ప్రజలతో ఎలా ఉన్నారో, ఎలాంటి ముద్ర వేసుకున్నారో నేటి అధికారులు తెలుసుకోవాలని సూచించారు.

గతంలో అధికారులు. రాజకీయ నాయకులు ఏదైనా విషయాన్ని ప్రస్తావించినప్పుడు అందులోని లోటుపాట్లను, దాని వల్ల వచ్చే నష్టాన్ని చెప్పేవారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. చట్టవిరుద్ధంగా వెళితే భవిష్యత్తులో తలెత్తే సమస్యను వివరించేవారని, నాయకులను అప్రమత్తం చేస్తూ.. జరగబోయే పరిణామాలను గుర్తుచేసే వారని అన్నారు. కానీ, ఈ రోజుల్లో అలా చెప్పడం తగ్గిపోయిందన్నారు. దీనికి కారణమేంటో తనకు తెలియదని, కానీ, పొలిటికల్ ఎగ్జిక్యూటివ్‌ను సంతోష పెట్టాలనో లేక తనకు తాను సంతోషపడాలనో.. రాజకీయ నాయకులు తీసుకుంటున్న ప్రతి నిర్ణయాన్నీ అమలు చేస్తున్నట్లు అనుకుంటున్నానని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

ముఖ్యమంత్రిగానీ, మంత్రులుగానీ, వారి చదువు, అనుభవం వేర్వేరు కావచ్చునని, ఏమీ చదువుకోని వారికి విద్యాశాఖను కూడా ఇవ్వవచ్చని, పొలిటికల్ ఎగ్జిక్యూటివ్ జాబ్‌కు, వారి చదువుకు ఏమాత్రం సంబంధం ఉండదని పేర్కొన్నారు. అందుకే తమకు అవగాహన కల్పించడానికి సెక్రటేరియట్ బిజినెస్ రూల్స్ ప్రకారం అధికారులు అవసరమవుతారని తెలిపారు. వారు ఏ ఫైలు వచ్చినా.. అందులోని తప్పొప్పులను తమకు వివరిం చాలని అన్నారు. నిబద్ధత కలిగిన అధికారులకు తప్పకుండా గుర్తింపు ఉంటుందని అంటూ, తాము అధికారంలోకి వచ్చాక అలాంటి అధికారులను వెతికి పట్టుకొని మరీ పోస్టింగ్‌లు ఇస్తున్నామని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులుగా తాము విధానపరమైన నిర్ణయాలు మాత్రమే తీసుకుంటామని కానీ, వాటిని అమలు చేసి విజయవంతం చేసే బాధ్యత అధికారులపైనే ఉంటుందన్నారు.

అధికారుల వైఖరిలో కూడా మార్పు రావాలని, ప్రతిది వ్యతిరేక కోణంలో కాకుండా, సానుకూల దృష్టితో నిర్ణయాలు తీసుకోవాలని హితవు పలికారు. నేటితరం అధికారులకు సీనియర్ ఐఏఎస్‌ల ద్వారా వారి అనుభవాలను, వాళ్లు ఎదుర్కొన్న సమస్యలపై శిక్షణ కార్యక్రమం ఇప్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఈ వేదిక నుంచి ఆదేశిస్తున్నానని రేవంత్ రెడ్డి తెలిపారు.

పేదలకు సాయం చేయాలన్న ఆలోచన అధికారులకు ఉండాలని, అలాంటివారే ప్రజల మనసులో నిలిచిపోతారని చెప్పారు. ఆ దిశగా రాష్ట్రంలోని అధికారులు దృష్టి సారించాలని తాను కోరుకుంటున్నానని ముఖ్యమంత్రి చెప్పారు. కలెక్టర్లు, ఎస్పీలను తరచూ మాజీ అధికారులతో సదస్సుల ద్వారా కలుసుకునే అవకాశం కల్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి సూచించారు. గోపాల కృష్ణనాయుడు తన ఆరు దశాబ్దాల అనుభవాన్ని గ్రంథ రూపంలో నిక్షిప్తం చేయడం పెద్ద టాస్క్ అనిసివిల్ సర్వెంట్లందరికీ ఈ పుస్తకం దిక్సూచిగా ఉంటుందని భావిస్తున్నట్లు రేవంత్‌రెడ్డి అన్నారు. దేన్నయినా కొనవచ్చునని, అనుభవాన్ని మాత్రం కొనలేమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శంకరన్, మన్మోహన్ సింగ్, శేషన్‌లను గుర్తుకుతెచ్చుకోవాలని సీఎం సూచించారు. నిబద్ధతతో పనిచేసిన గొప్ప అధికారి శంకరన్ కాగా, పారదర్శక ఎన్నికల నిర్వహణకు కృషి చేసిన వ్యక్తి శేషన్ అని అన్నారు. దేశాన్ని ఆర్థికంగా అభివృద్ధి పథంలో నడిపిన వ్యక్తి మన్మోహన్‌సింగ్ అని కొనియాడారు. అలాంటి సివిల్ సర్వెంట్ల అనుభవాల నుంచి ఎంతో నేర్చుకోవాల్సి ఉంటుందన్నారు రేవంత్ రెడ్డి.

కొంతమంది సివిల్ సర్వెంట్స్ శిక్షణలో ఉన్నప్పుడే స్టేషన్‌లలో డ్రెస్‌తో కూర్చొని సివిల్ పంచాయతీలు నిర్వహిస్తున్నారని ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు ఎప్పుడైనా నాయకులకంటే అధికారులనే ఎక్కువగా నమ్ముతారని పేర్కొన్నారు. నాయకులు ఇప్పుడు ఉంటారు, పోతారు, కానీ, అధికారులు మాత్రం ప్రభుత్వాలు మారినా వారే ఉంటారనీ, అందుకే వారిపై ఎక్కువ నమ్మకం కలుగుతుందని, ఆ నమ్మకాన్ని వమ్ము చేయవద్దని సూచించారు.

అసలు రేవంత్ రెడ్డి ఈ స్థాయిలో అధికారులకు క్లాస్ తీసుకోవలసిన అవసరం రావడమంటేనే బాధాకరమంటున్నారు విశ్లేషకులు. అధికారులు కూడా ప్రభుత్వ పెద్దలకు సహకరించాల్సి ఉంటుందంటున్నారు. రాష్ట్రంలో తాము ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తర్వాత అధికారులు ఆశించిన స్థాయిలో పనిచేయడం లేదని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. ఎక్కడో కొంత గ్యాప్ ఉందన్నది వాళ్ల అభిప్రాయం. ప్రధాన కార్యదర్శి నుంచి కార్యదర్శులు, కలెక్టర్లుకు కొంత గ్యాప్ ఉందని ప్రభుత్వ వర్గాలు సైతం అంగీకరిస్తున్నాయి. మరోవైపు.. సివిల్ సర్వెంట్లు ఫీల్డ్‌లో ఉండకుండా కేవలం ఆఫీసులకే పరిమితం అవుతున్నారన్న విమర్శలు రోజురోజుకీ పెరుగుతున్నాయి.

గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో పనిచేసిన పద్ధతిలోనే ఇప్పటికీ కొంతమంది అధికారులు కొత్త ప్రభుత్వం వచ్చి 14 నెలలు కావస్తున్నా అదే పద్ధతిలో పనిచేస్తున్నారని విమర్శలు కూడా ఉన్నాయి. తమ శాఖకు సంబంధించిన సెక్రటరీలు కూడా వెంటనే స్పందించడం లేదని ఇద్దరు ముగ్గురు మంత్రులు కూడా ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేశారు. పాలన పరంగా ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్న దానిని అమలు చేయాల్సిన బాధ్యత మాత్రం అధికారుల పైనే ఉంటుంది. ప్రభుత్వానికి మంచి పేరు వచ్చినా, చెడ్డ పేరు వచ్చినా దాంట్లో అధికారుల పాత్ర కూడా కీలకంగా ఉంటుంది. ఈ నేపథ్యంలోనే తమ ప్రభుత్వంలో కొందరు ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల పనితీరు ఏ మాత్రం బాగోలేదని విషయాన్ని ప్రజలకు తెలిసే విధంగానే రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు చేస్తున్నారు.

అయితే, ఇక్కడే మరో విషయం కూడా సెక్రెటేరియట్‌లో చక్కర్లు కొడుతోంది. ప్రభుత్వం మారినప్పటి నుంచీ అధికారులను ప్రభుత్వ పెద్దలు అంతగా నమ్మడం లేదన్న విషయం చర్చనీయాంశమవుతోంది. తమకు నచ్చిన వాళ్లకు ఆయా విభాగాలకు బదిలీలు చేసి పనులు చేయించుకోవడం, తమ విధాన నిర్ణయాలు సక్రమంగా అమలు చేయించడం వంటివి చేయాల్సి ఉండగా.. అధికారుల సలహాలు ఏ మాత్రం వినడం లేదని, వాళ్లతో ప్రభుత్వ నిర్ణయాలపై స్వేచ్ఛగా మాట్లాడటం లేదని, చర్చించడం లేదని అంటున్నారు. అధికారుల మీద ప్రభుత్వ పెద్దలకే నమ్మకం లేకపోతే.. వ్యవస్థ ఎలా నడుస్తుందని ప్రశ్నిస్తున్నారు. అంతేకాదు.. సామర్థ్యం ఉన్న అధికారులకు అప్రాధాన్య పోస్టులు ఇస్తూ.. అంచనాలు మరోలా ఉండాలంటే ఎలా సాధ్యమవుతుందని కూడా చర్చించుకుంటున్నారు. మరి రాష్ట్రంలో శాసన, అధికార వ్యవస్థల మధ్య నెలకొన్న అగాధాన్ని ఎలా అధిగమిస్తారో చూడాలి.


**సుజాత గోపగోని,**
సీనియర్ జర్నలిస్ట్, 6302164068

ఇస్రో మహాద్భుత విజయాన్ని అందుకుంది. ఈ ఏడాది ఇస్రో చేపట్టిన తొలి ప్రయోగం.. షార్‌లో వందో మిషన్ విజయవంతమైంది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రంలోని రెండో ప్రయోగ వేదికపై నుంచి జనవరి 29 వ తేదీ ఉదయం 6:23 గంటలకు ఇస్రో చేపట్టిన జీఎస్ఎల్వీ-ఎఫ్15 రాకెట్ ప్రయోగం ఘన విజయం సాధించింది. 27 గంటల 30నిమిషాల కౌంట్‌డౌన్ ముగియగానే రెండోతరం నావిగేషన్ ఉపగ్రహం ఎన్వీఎస్-02 (నావిక్-02)ను తీసుకుని నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి ఎగిరిన రాకెట్.. మూడు దశలను నిరాటంకంగా పూర్తిచేసుకుని 19.12 నిమిషాల్లోనే దానిని నిర్దేశిత కక్ష్యలో ప్రవేశపెట్టింది. మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి రాకెట్ గమనాన్ని పర్యవేక్షిస్తున్న ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్.. జీఎస్ఎల్వీ-ఎఫ్15 రాకెట్ ప్రయోగం విజయవంతమైందని ప్రకటించారు. ఇస్రో అధిపతిగా బాధ్యతలు చేపట్టిన ఆయనకు ఇదే మొదటి ప్రయోగం. శాస్త్రవేత్తలు ఉపగ్రహంలో ఉన్న 1,250 కిలోల ఇంధనాన్ని దశలవారీగా మండిస్తూ, భూమికి 36 వేల కిలోమీటర్ల ఎత్తులోని భూస్థిర కక్ష్యలోకి దాన్ని ప్రవేశపెడుతారు.



# ఇస్రో 100 మిషన్ ప్ర

ఎన్వీఎస్-02.. ఇస్రో శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన స్వదేశీ నావిగేషన్ ఉపగ్రహ వ్యవస్థ. ఇది కొత్తతరం నావిగేషన్ ఉపగ్రహాల్లో రెండోది. దీని బరువు 2250 కిలోలు. 10 ఏళ్ల పాటు పనిచేసేలా ఈ ఉప గ్రహాన్ని ఇస్రో రూపొందించింది. భౌగోళిక, వైమానిక, సముద్ర నేవిగేషన్, సేవలు, వ్యవసాయంలో సాంకేతికత, మొబైల్ లోకేషన్ ఆధారిత సేవలకు ఉపయోగపడుతుంది. దేశీయ నావిగేషన్ వ్యవస్థ ఐఆర్ఎన్ఎస్ఎస్ ఇప్పటికే అందుబాటులో ఉండగా... దీన్ని మరింత బలోపేతం చేసేందుకు నావిక్ సిరీస్ కొత్త ఉపగ్రహాలు దోహదపడతాయి. గతంలో పంపిన ఉపగ్రహాల్లో ఎస్-బ్యాండ్, కె-బ్యాండ్, కేయూ-బ్యాండ్ లాంటి ఉపకరణాలను అమర్చారు. రెండోతరం నావిగేషన్ సిరీస్ ఉపగ్రహాలైన నావిక్-01, నావిక్-02లో ఎల్-1, ఎల్-5, ఎస్-బ్యాండ్ సిగ్నల్ వ్యవస్థను అమర్చారు. ఎల్-1లో ప్రజలకు ఉపయోపడే సివిలియన్ ఫ్రీక్వెన్సీ బ్యాండ్ ఉంటుంది. భూ, జల, వాయుమార్గాల్లో పొజిషన్‌ను 20 మీటర్ల అత్యంత కచ్చితత్వంతో, 50 నానో సెకన్ల రియల్ టైమ్‌తో చూపించడం ఈ కొత్తతరం ఉపగ్రహాల ప్రత్యేకత. భారతదేశ సరిహద్దుల ఆవల 1,500 కిలోమీటర్ల పరిధి వరకూ ఈ వ్యవస్థ పనిచేస్తుంది. ఇక సమయం, స్థానాన్ని అత్యంత కచ్చితంగా తెలిపే రుబీడియం అణు గడియారాన్ని నావిక్-02లో అమర్చారు.



ఇస్రో చైర్మన్ నారాయణన్

**నాలుగు విఫలం.. 13 సఫలం**

జీఎస్ఎల్వీ సిరీస్‌లో ఇస్రో ఇప్పటి వరకు 17 ప్రయోగాలు చేసింది. అందులో 13 విజయవంతం కాగా, కేవలం నాలుగు ప్రయోగాలు మాత్రమే విఫలమయ్యాయి. 2025 జనవరి 29న నిర్వహించిన జీఎస్ఎల్వీ ఎఫ్15 ఈ సిరీస్‌లో 17వ ప్రయోగం. ఇది వందో ప్రయోగం కావడంతో శాస్త్రవేత్తలు కొంత ఒత్తిడికిలోనయ్యారు. ఎందుకంటే 2010 ఏప్రిల్ 15న స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో క్రయోజనిక్ దశతో చేసిన జీఎస్ఎల్వీ 23 ప్రయోగం విఫలమైంది. అదే సంవత్సరం డిసెంబర్ 25న జీఎస్ఎల్వీ ఎఫ్-6 ప్రయోగంలో రష్యన్ క్రయోజనిక్ దశతో చేసినా విఫలమైంది. ఈ రాకెట్ నింగివైపునకు వెళ్లేటప్పుడు క్రయోజనిక్ దశ కింది భాగంలో ఉన్న స్ట్రిడ్ విరిగిపోవడంతో మిషన్ కంట్రోల్ రూమ్ నుంచే బ్లాస్ట్ చేశారు. తర్వాత 2014 వరకూ జీఎస్ఎల్వీ ప్రయోగాల జోలికి ఇస్రో వెళ్లలేదు. క్రయోజనిక్ ఇంధనం లిక్విడ్ ఆక్సిడైజర్, లిక్విడ్ హైడ్రోజన్ కలిపి మైనస్ 220 డిగ్రీల ఉష్ణోగ్రతలో తయారు చేయాల్సి ఉంటుంది. అందుకే సంక్లిష్టమైన క్రయోజనిక్

## ముఖ్యమైన ప్రయోగాలు

2014 నుండి నుంచి తాజా ప్రయోగం (2025) వరకు ఇస్రో అనేక ముఖ్యమైన విజయాలను సాధించింది.

**2014 మంగళయాన్ :** 2014లో, ఇస్రో మంగళయాన్‌ను విజయవంతంగా అంగారక గ్రహ కక్ష్యలో ప్రవేశపెట్టింది, దీని ద్వారా భారత్ అంగారక గ్రహాన్ని చేరిన తొలి ఆసియా దేశంగా నిలిచింది.

**2017 పీఎస్ఎల్- సి37 ద్వారా 104 ఉపగ్రహాల ప్రయోగం:** 2017 ఫిబ్రవరిలో, ఇస్రో ఒకే రాకెట్ ద్వారా 104 ఉపగ్రహాలను విజయవంతంగా ప్రయోగించింది, ఇది ప్రపంచ రికార్డు.

**2019 చంద్రయాన్-2:** 2019లో, ఇస్రో చంద్రయాన్-2 మిషన్‌ను ప్రారంభించింది, ఇది చంద్రుని దక్షిణ ధ్రువంపై ల్యాండర్, రోవర్‌ను పంపే ప్రయత్నం. ల్యాండర్ సాఫల్యం పొందకపోయినా, ఆర్బిటర్ విజయవంతంగా పనిచేస్తోంది.

**2020 - నూతన అంతరిక్ష విధానం:** 2020లో,



# యోగం విజయవంతం

టెక్నాలజీని అందుకోవడానికి తొలి నాళ్లలో కాస్త ఒడిదుడుకులు ఎదుర్కొన్నా నేడు సగర్వంగా నిలబడింది.

**2 నెలల్లో నిసార్ ప్రయోగం**

నావిక్-02 ప్రయోగం విజయానంతరం షార్‌లోని మీడియా సెంటర్‌లో సహచర శాస్త్రవేత్తలతో కలిసి నారాయణన్ మీడియాతో మాట్లాడుతూ,నావిక్-02 పదేళ్లపాటు సేవలంది స్తుందని వివరించారు. ఇస్రో, నాసా సంయుక్తంగా చేపట్టిన నిసార్ ఉపగ్రహాన్ని మరో రెండు నెలల్లో జీఎస్ఎల్వీ-ఎఫ్16 రాకెట్ ద్వారా ప్రయోగిస్తామని నారాయణన్ వెల్లడించారు. కాగా, శ్రీహరికోట నుంచి వందో ప్రయోగాన్ని చేపట్టిన ఇస్రోకు అభినందనలు వెల్లువెత్తాయి.

**100 ప్రయోగాల పరిణామక్రమం**

వంద మిషన్ల మైలురాయిని చేరుకోవడానికి ఇస్రోకు దాదాపు ఐదు దశాబ్దాలు (46 ఏళ్లు) పట్టింది. 1979లో షార్‌లో తొలి ప్రయోగాన్ని చేపట్టి నప్పుడు ఇస్రో వద్ద ఇప్పుడు ఉన్నంత టెక్నాలజీ లేదు. రాకెట్ టెక్నాలజీ కోసం రష్యా వంటి దేశాలపై ఆధారపడాల్సి వచ్చేది. మెల్లగా ఒక్కో మెట్టు ఎక్కుతూ వచ్చిన ఇస్రో వంద మిషన్లు పూర్తిచేసుకుంది. ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారాయి. అత్యాధునిక టెక్నాలజీని ఇస్రో అందిపుచ్చుకుంది. సొంతంగా రాకెట్లు, ఇంజన్లు నిర్మించుకుంటోంది. ఈ క్రమంలో భారతీయజనతాపార్టీ అధ్వర్యంలో ఎన్డీఏ కూటమి అధికారానికి వచ్చినప్పటి (2014) నుంచి సాంకేతిక అభివృద్ధికి ప్రాధాన్యతను పెంచింది. ఇస్రోకు ఏటా బడ్జెట్‌ను పెంచింది. దీంతో అప్పటి నుంచి ఇస్రో దూకుడు పెంచింది. కేవలం బడ్జెట్ పెంచుకోవడం వరకే పరిమితం కాకుండా, అతి తక్కువ ఖర్చుతో, స్వదేశీ పరిజ్ఞానంతో శాటిలైట్లు, రాకెట్ల తయారీ చేపట్టింది. ఒకప్పుడు క్రయోజనిక్ ఇంజిన్లను రష్యా నుంచి దిగుమతి చేసుకునే ఇస్రో, ఇప్పుడు వాటిని స్వయంగా తయారుచేసుకుంది. ఇలా ఖర్చులు తగ్గించుకుని, ఎక్కువ సక్సెస్ రేటు సాధించడం వల్ల స్పేస్ మార్కెట్లో చిన్న చిన్న దేశాలకు ఆశాదీపంలా కనిపిస్తోంది.

అమెరికా, రష్యా వంటి పెద్ద దేశాల కన్నా తక్కువ ధరకే విదేశీ శాటిలైట్లను అంతరిక్షంలోకి పంపుతోంది. అంతరిక్ష రంగంలో నిపుణులైన మానవ వనరుల లభ్యత కూడా ఇస్రో విజయపరంపరకు దోహదం చేస్తోంది.


ఇస్రో సాధిస్తున్న ఒక్కో విజయం మరో భారీ విజయానికి బాటలు వేస్తోంది. చంద్రయాన్, మంగళయాన్, ఆదిత్య-ఎల్1 వంటి మిషన్లు విజయవంతం కావడంతో అదే స్ఫూర్తితో వీనస్ ఆర్బిట్ మిషన్, గగనయాన్, భారత అంతరిక్ష స్టేషన్, చంద్రుడి మీదకు మనుషుల్ని పంపడం వంటి లక్ష్యాలు సాధించేందుకు వడివడిగా అడుగులేస్తోంది.

ఇదే జోరు కొనసాగిస్తే వచ్చే ఐదేళ్లలో మరో వంద ప్రయోగాలు నిర్వహించి 200 మార్కు అందుకోగలమని ఇస్రో ఛైర్మన్ నారాయణన్ విశ్వాసం వ్యక్తం చేశారు. సైకిల్, ఎడ్లబండిపై రాకెట్ విడి భాగాలను తరలించిన కాలం నుంచి.. అంతరిక్షంలో రెండు ఉపగ్రహాలను డాకింగ్ చేసే స్థాయికి ఇస్రో ఎదిగిందన్నారు. చంద్రుడి దక్షిణ ధ్రువంపై ల్యాండర్, రోవర్‌ను దింపి చరిత్ర సృష్టించిన ఇస్రో.. సూర్యుడి గుట్టు విప్పేందుకు ఆదిత్య-ఎల్1 మిషన్‌ను కూడా చేపట్టింది. త్వరలోనే చంద్రుడిపైకి మన వ్యోమగామిని పంపే ప్రయత్నాలు చేస్తోంది.

**షార్‌లో మూడో లాంచింగ్ ప్యాడ్**

శ్రీహరికోటను రాకెట్ కేంద్రంగా గుర్తించిన మొదటి రోజుల్లో ఇక్కడ సౌండింగ్ రాకెట్లు ప్రయోగించేవారు. ఆ తర్వాత చిన్నపాటి ఎల్ఎల్వీ, ఎస్ఎల్వీ రాకెట్లు ప్రయోగించారు. షార్‌లో ఫస్ట్ లాంచ్ ప్యాడ్ నిర్మించిన తర్వాత 1995 నుంచి 2005 వరకూ ఎన్నో ప్రయోగాలు చేశారు.ఆ తర్వాత బరువైన ఉపగ్రహాలను ప్రయోగించేందుకు రెండో లాంచ్ ప్యాడ్ తయారు ఏర్పాటు చేశారు. ఇక్కడే మూడో లాంచ్ ప్యాడ్ ఏర్పాటుకి ఇటీవలే కేంద్ర ప్రభుత్వం సుమారు నాలుగు వేల కోట్ల రూపాయలు మంజూరు చేసింది. ఇక్కడి నుంచి న్యూ జనరేషన్ లాంచింగ్ వెహికల్స్‌ను ప్రయోగించాలని యోచిస్తున్నారు.

భవిష్యత్తులో ఇస్రో చేపట్టనున్న గగనయాన్, భారత్ అంతరిక్ష కేంద్రం వంటి ప్రయోగాలకు ఇదే కీలకం కానుంది. ఈ న్యూ జనరేషన్ లాంచింగ్ వెహికిల్‌తో 20 నుంచి 25 టన్నుల బరువైన ఉపగ్రహాలను ప్రయోగించవచ్చు. షార్‌తో పాటుగా తమిళనాడులోని కులశేఖర పట్నంలో కూడా మరో రాకెట్ లాంచింగ్ ప్యాడ్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఇస్రో షార్‌లో చేపట్టిన ఈ వందో ప్రయోగం విజయవంతమైతే.. తదుపరి ప్రయోగాలకు ఇది మరింత ఉపయోగకారిగా ఉంటుంది. అంటే, మానవ సహిత గ్రహాంతర ప్రయోగాల వంటి కొత్త శకానికి ఇస్రో ఈ వందో ప్రయోగంతో తొలి అడుగు వేసినట్లు అవుతుంది.



**తురగా నాగభూషణం**
సీనియర్ జర్నలిస్ట్

భారత ప్రభుత్వం ప్రైవేట్ రంగానికి అంతరిక్ష కార్యకలాపాల్లో పాల్గొనే అవకాశం కల్పించింది, ఇది ఇస్రోకు ప్రైవేట్ సంస్థలతో సహకరించేందుకు దారితీసింది.


**2023 - చంద్రయాన్-3:** 2023లో, ఇస్రో చంద్రయాన్-3 మిషన్‌ను విజయవంతంగా ప్రారంభించింది, ఇది చంద్రుని ఉపరితలంపై సాఫ్ట్ ల్యాండింగ్ సాధించింది.

**ఆదిత్య-ఎల్ 1:** 2023లో, ఇస్రో సూర్యుని అధ్యయనం కోసం ఆదిత్య-1 మిషన్‌ను ప్రారం భించింది, ఇది సూర్యుని బయటి వలయాలను పరిశీలించేందుకు రూపొందించారు.

**2025 గగనయాన్:** 2025లో, ఇస్రో గగనయాన్ మిషన్‌ను ప్రారంభిం చేందుకు సిద్ధమవుతోంది, ఇది భారతదేశపు తొలి మానవ సహిత అంతరిక్ష ప్రయోగం. ఈ విజయాలు, ఇస్రో సాంకేతిక నైపుణ్యాన్ని, భారత ప్రభుత్వ సంకల్పాన్ని ప్రతిబిం బిస్తున్నాయి.

56

# రాధాతత్త్వం – పరిశీలన-2




కూరిమి పెరిగిన వారివురి (రాధ,మాధవుడు) వివాహానికి ఎలాంటి అభ్యంతరాలు లేవు. కాని రాధ మాధవుని నాథునిగ కోరి తృప్తి చెందలేదు. అధినాథునిగ కోరినది. అందుకోసం రుణవిమోచన తీర్థమున తపం సాగించినది. ఈమె తపము, కాళిదాసుని పార్వతి తపము ఒక్క విధంగానే సాగాయి. ఇద్దరూ ప్రకృతే. ఆమె పరమేశ్వరుని కోరినది. ఈమె పరమపురుషుని కోరినది. ఒక్క పార్వతి తపం చేసినా లేదా ఒక్క రాధ తపం చేసినా సర్వ ప్రకృతి తపమాచరించినట్లే. అందువలననే కాళిదాస రామకృష్ణులు పార్వతీ రాధల తపములను వర్ణింప మొదలిడి ప్రకృతి వర్ణన చేశారు.'తపము నెవమున రుతువర్ణన మనెడి ప్రబంధ లక్షణమును ప్రవేశపెట్ట సమకట్టినార'ని కొందరి అభిప్రాయము, సూక్ష్మముగ పరిశీలిస్తే కవి హృదయం అది కాదని తెలుస్తుంది. రాధ తపము ప్రారంభించగా, ప్రకృతి తపమూ ప్రారంభమైంది. పరిపూర్ణతను సాధించడం తపస్సు ఉద్దేశ్యము. ప్రకృతి పరిపూర్ణతను ప్రయత్నించుటను వర్ణించడం రాధ తపో సాధనా క్రమంగా పరిగణించాలి. రాధ తన తపమును హేమంతంలో ప్రారంభించింది. మంచుతో నిండిన కమలవనం హరిధ్యాన నిమీలిత లోచనయౌ రాధావధూటిక కనుకమలమైనది. వసంత రుతువు రాగా వనమంతా నీలాంజను గోరి తపస్సు చేసే రాధలా ఉంది. ఆ రాధ వేసవి యండెండనోర్చి తపము చేసినది. వర్షర్తువును తసమోవి చెలునవంబున గౌదంగి పూవు రేకు సోయగము చూపు కన్నుల సొబగున చికుర బర్హి బర్హ ప్రభ వలన ప్రతిఘటించింది. ఈ తపోవర్ణనము ప్రారంభం నుంచీ పార్వతీ తపో వర్ణనమును బోలి ఉంది.

'ప్రతి క్షణం సాకృతరోమ విక్రయాం....
విస్పష్టరాగా దధరార్తి వన్నితః....
మహార్హశయ్యా పరివర్తనచ్యుతైః... అను వర్ణనను మనస్సులో ఉంచుకొనే కాబోలు 'నవల క్రొందొడిమయొత్తిన గంటగిలు మస్తకం బెటులోర్చేనో కఱకు జడలు" అని వర్ణించారు..

రాధాదేవి ఎంతగ ప్రకృతిలో లీనమైన తపస్సు చేసిందో కానీ వర్షరుతువు విలాసమును చూచి కృష్ణుని రూపం అనుకొన్నది. ఇక్కడ కృష్ణుడే వర్షర్తు విలాసమనే భ్రమ కలిగినది. అంటే... ప్రకృతిలో దేనిని చూచినా రాధకు కృష్ణ విలాసమే. కృష్ణ విలాసము ప్రకృతే! ఈ ఏకత్వ సాధనకే రాధ చేసిన తపము. అది సిద్ధించగనే కృష్ణ సాక్షాత్కారమైంది. అదీ శరత్కాలంలో.

'ఇంద్రచాపంబుగాదది మౌళితలంబున
సవిరించు బర్హి చాపంబుగాని
భిదుర ఘోషంబుగాదిది పాంచజన్య సం
జాత గంభీర ఘోషంబు గాని
యాశ్రయించిన బలాకావళి గాదిది
హారిముక్తాహార యుష్టి గాని
ఇది కోలమెఱుగుగా, దుదిరిబంగారపు
బసిమి గ్రమ్మెడు పచ్చపట్టు గాని
వృష్టిగాదిది కరుణాంబు వృష్టిగాని
నీలమేఘంబుగాదిది నీలవర్ణు
డౌరా! నా మోల ప్రత్యక్షమయ్యెననుచు
హర్షపులకింత తనువయ్యెనవ్వధూటి'

ఇట్లు అనవరతం ధ్యానధారా ప్రవాహమగ్న హృదయంలో, నిఖిల జగాలు విష్ణుమయంగా తోచింది. ఆమె 'విశ్వం విష్ణువు' అనే మంత్రార్థాన్ని దర్శించినది. కనుకనే, సర్వ ప్రకృతి ఆమెకు కృష్ణుడిగా తోచినది. అంత భక్తవత్సలుడగు శ్రీవత్సక్షుడు....

'అర చంద్రులోని చిహ్నం శకుయను బోలె
నుదుట కస్తూరి బొట్టు పదను కొనగ'
హృత్ఖేదము మానిపించి తన కేలను గేల్
దెమరించి నిర్భ రాహ్లాద మెలర్ప
నయ్యావతి నర్ధశరీరము నట్లు ప్రోచె నద్రిజ
నేలినశూలి పోలికన్' అంటూ, రామకృష్ణ కవి, శ్రీకృష్ణుడు రాధను, అద్రిజను ఏలిన శూలివలె అర్ధశరీరం ఇచ్చి బ్రోచెనని వ్యాఖ్యానించాడు.


నీలాంజనుడు రాధా లీలావతి వేళ శరద్రుతువు విజృంభించెనట. రాధ ముఖమువలె శరచ్చంద్రు ఉన్నాడట. రాధకు ఇంపు కలిగేలా త్రిభువన మోహనంగా ఆది నారాయణుడు మురళి మోయించెనట. రాధ భువన మోహినిగాన, ఆమెకు ఇంపు గూడిన త్రిభువనాలు సమ్మోహం చెందడం సహజం.

**– అనంతలక్ష్మి, జాగృతి 11 ఆగస్టు 1978**




మన రుషులు

# శ్రద్ధాసక్తులకు నమూనా నచికేతుడు



శ్రద్ధకు నిలువెత్తు నిదర్శనం నచికేతుడు. జిజ్ఞాసపరునిగా, తేజస్విగా అందరి మన్ననలు అందుకున్నాడు. ఆరుణి, విశ్వవార దంపతుల ప్రథమ పుత్రుడు. తండ్రి మేలు కోరి సలహా ఇవ్వబోయి, తానే శాపం బారినపడ్డాడు. ఆ శాపమే ఆతనికి ఆత్మజ్ఞాన సముపార్జనకు, లోకానికి దివ్యసందేశం ఇవ్వడానికి కారకమైంది. శ్రద్ధ, పట్టుదల ఉంటే సాధించలేనిది లేదని నిరూపించాడు. తండ్రి ఆరుణి (వాజ శ్రవసుడు, ఉద్దాలకుడు...అనీ అంటారు) విశ్వజిత్ యాగం నిర్వహించాడు. యాగ పరిసమాప్తిలో సర్వస్వం (సర్వ సంపద) దానం చేయాలనే నియమం ప్రకారం, గో సంపదను దానంచేయసాగాడు. కానీ వాటిలో కొన్ని వయసు మళ్లినవి, నిరుపయోగమైనవి ఉండడం గమనించిన నచికేతుడు, 'నిస్సారమైన గోదానం వల్ల తండ్రికి దుర్గతి కలుగుతుంది. జన్మాంతంలో సుఖం లేని లోకాలు ప్రాప్తిస్తాయి' అని భావించాడు. దీనిని నుంచి తండ్రిని కాపాడి మేలు చేయదలచి, 'యాగం సందర్భంగా సర్వం దానం చేయాలి కదా? నేను అందులో భాగమే కనుక నన్నెవరికి దాన మిస్తావు' అని ప్రశ్నించాడు. కుమారుడి మాటలను బాల్యచేష్టగా పరిగణించి మిన్నకుండిపోయాడు ఆరుణి. పుత్రుడు పదేపదే అడగడంతో సహనం కోల్పోయి 'యమునికి దానం ఇస్తాను' అనేశాడు. ఆవేశంలో నోరు జారినందుకు పశ్చాత్తాప పడ్డాడు. నచికేతుడు తండ్రిని ఓదార్చి యమపురికి చేరాడు. ఆ సమయంలో బ్రహ్మ దర్శనానికి వెళ్లిన యమునికోసం మూడురోజల పాటు

# అల్పభక్తిపరులపైన అనన్య కరుణపైన

56




శివుని గురించి పార్వతి చేపట్టిన ఘోరతపస్సు నుంచి మనసు మరల్చేందుకు ఆమె తల్లిదండ్రులు, రుషులు,మునులు విఫలయత్నం చేశారు. పార్వతీ పంతం విడలేదు. పరమేశ్వరుడు సాక్షాత్కరించి ఆమెను అనేక విధాల ప్రశ్నించి ప్రసన్నుడయ్యాడు. 'నీ నిశ్చల తపో భక్తులకు సంతుష్టుడయ్యాను. అభీష్ట వరం కోరుకో' అనడంతో గిరిరాజకిశోరి కోరిక నెరవేరింది. ఆమె సాక్షాత్తూ శంకరునే భర్తగా కోరింది. అచిరకాలంలోనే ఆ సనాతన దంపతుల పరిణయం జరిగింది. సదాశివ పరమాత్మను సగుణ–నిర్గుణ నిరా కారునిగా భావించి ఆయన సగుణ సాకార దివ్య మూర్తిని ఉపాసించే వాని ఉపాసనయే సత్యమై సర్వాంగ సంపూర్ణమైనది. ఈ సమగ్రత్వంలో ఏ అంశం లోపించినా అతని ఉపాసనలోని సర్వాంగ పూర్ణత్వంలో లోపం కలుగుతుంది. అతడు అంత మాత్రమే శివతత్త్వాన్ని అర్థం చేసుకో గలిగాడనాలి.

ఆశుతోషుని లీలలు ఆయన కరుణగల వాడే గుర్తించగలుగుతాడు. ఆ విశ్వనాథుని దయలేకపోతే ఆయన విచిత్ర లీలలను కనివిని దేవీదేవతలూ, మునులూ కూడా భ్రమవశులవుతూంటే సామాన్యుల విషయం ఏమని చెప్పాలి! కాని శివదేవుడు ఆశు తోషుడవడం వల్ల అతి శీఘ్రంగానే ప్రసన్నుడవు తాడు. ఈ రహస్యాన్ని గుర్తించి,నిష్కామ ప్రేమ భావంతో పూజించే వారి పట్ల దయ చూపుతా డనడంలో ఆశ్చర్యమేముంది? సకామభావంతో తమ కార్యసాధనకై అజ్ఞాన పూర్వకంగా ఉపాసించేవారిని కూడా ఆ మహాత్ముడు కరుణిస్తాడు. అడిగిన వరాలు ఇవ్వడానికి ఆ భోళానాథుడు వెనుక ముందులు చూడడు. అల్పభక్తి కలవారి మీదనే ఆయన హృదయ సాగరం ఉప్పొంగుతూంటుంది. భోళానాథుడైన శంకరుని సేవించనివారు నిజానికి ఆయన తత్త్వాన్నే గుర్తించలేదన్న మాట. అలాంటి వారి జన్మే వృథా కదా! కనుక భక్త జనులు ఈ కింది సాధనలను గుర్తించి తమ తమ శక్త్యానుసారం ఆచరణలోకి తీసుకు రావడానికి ప్రయత్నించాలి.

1. శంకరభగవానుని రహస్య గుణ,ప్రేమ, ప్రభావాల అమృతమయ గాథలనూ, తత్త్వాన్నీ తెలిసిన భక్తుల ద్వారా విని మననం చెయ్యాలి. స్వయంగా సచ్ఛాస్త్రాలను పఠించి భద్ర రహస్యాన్ని అర్థం చేసు కోవాలి. 2. శ్రద్ధా, భక్తి ప్రేమలతో నిత్యం శివదేవుని శాంతమూర్తిని పూజించి వందనం ఆచరిం చాలి. 3.ఆ దేవదేవుని పట్ల అనన్య ప్రేమ కలగడానికి వినయ భావంతో ఆర్తత్వాన్ని వ్యక్తీకరిస్తూ గద్గద కంఠంతో స్తోత్రం చెయ్యాలి. 4. "ఓం నమశ్శివాయ" మంత్రాన్ని మనసా ప్రేమ భావంతో గుప్తంగా జపిం చాలి. 5. ఉపర్యుక్త రహస్యాన్ని గుర్తించి శివ స్వరూ పాన్ని శ్రద్ధాభక్తులతో నిష్కామభావంతో ధ్యానించాలి.

వ్యావహారిక జీవితంలో..... 1. నిస్వార్థంతో, ప్రేమతో అందరి పట్ల సద్వ్యవహారం కలిగి ఉండాలి. 2. శివుని పట్ల ప్రేమ కలగడానికి ఆయన ఆదేశానుసారం ఫలాసక్తిని విడిచి శాస్త్రానుకూలంగా శక్త్యానుసారం యజ్ఞం, దాన, తపో, సేవలు చేస్తూ వర్ణాశ్రమ ధర్మానుసారం జీవితయాత్ర సాగించాలి. 3. సుఖదుఃఖాలూ, హానిలాభాలూ సర్వస్వం శంకరేచ్ఛగా లభ్యమైనవని తలచి అడుగడుక్కీ సదాశివుని దయనే దర్శించగలగాలి. 4. రహస్య ప్రభావాలను గ్రహించి నిష్కామ, శ్రద్ధా, భక్తి, ప్రేమ భావాలతో అభిరుచి ననుసరించి శివస్వరూపాన్ని నిరంతరం ధ్యానించడంవల్ల నడుస్తూ, తిరుగుతూ, లేస్తూ, కూర్చుంటూ సర్వకాల సర్వావస్థలలో శివనామాన్ని జపించే అభ్యాసం సర్వదా చెయ్యాలి. 5. దుర్గుణ దురాచారాలను విడిచి సద్గుణ సదా చారాలను పొందడానికై అనుక్షణం ప్రయత్నం చెయ్యాలి. ఈ సాధనల ప్రకారం మానవుడు చరిస్తూంటే అతని అంతఃకరణపవిత్రత, ప్రభావ రహస్యానుభవాలూ, శ్రద్ధాభక్తి– విశ్వాస– ప్రేమలూ క్రమక్రమంగా వర్ధిల్లుతూంటాయి. కనుక ఉపర్యుక్త విషయాలను గుర్తించి అనుష్ఠించాలి. ఈ సాధన లన్నింటిలో సదాశివుని ప్రేమ పూర్వకంగా నిరంతరం ధ్యానించడం సర్వోత్కృష్టమైన విషయం.

నానాప్రకార కర్మబాహుళ్యం కారణంగా మహాదేవుని చింతనలో క్షణ కాలమైన ఆటంకం కలుగరాదు. విశేష సావధానులై ఉండాలి. అనన్య ప్రేమలో శాస్త్రానుకూల కర్మాచరణలో లోపం ఏర్పడితే బాధలేదు కానీ ప్రేమభావంలో మాత్రం ఆటంకం కలుగరాదు. అనన్య ప్రేమలో భగవత్ చింతన అనుక్షణం జరుగుతూంటుంది.ఆ ధ్యాన ప్రభావం వల్ల మానవుడు శివతత్త్వాన్ని యథార్థంగా గుర్తించి కృతకృత్యుడు కాగలడు. అంటే పరమ పదాన్ని పొందగలుగుతాడు. కనుక భగవానుని ప్రేమ ప్రభావాలను గుర్తించి ఆ స్వరూపాన్ని నిష్కామ ప్రేమభావంతో నిరంతరం ధ్యానించడానికి ప్రాణా వసాన సమయం వరకూ ప్రయత్నించాలి.

– రాధాకృష్ణమూర్తి,జాగృతి, 30.6.1961

నిరాహారంగా నిరీక్షించాడు. తన కారణంగా బాలుడు మూడునాళ్లు పస్తుండడాన్ని గ్రహించిన యముడు ప్రతిగా మూడువరాలు అనుగ్రహించాడు. ఇంటికి తిరిగి వెళ్లిన తరువాత తండ్రి తనను సంతోషంగా చేరదీయాలని, స్వర్గప్రాప్తికి సంబంధించిన అగ్నివిద్య బోధించాలని, ఆత్మతత్త్వాన్ని తెలిపే బ్రహ్మవిద్యను ఉ పదేశించాలని అర్థించాడు. ఈ మూడింటిలో రెండవది, దానికంటే మూడవది ఉత్కృష్టమైనది. పునర్జన్మరహిత అగ్నివిద్యను యముడు ఉపదేశించగా, నచికేతుడు దానిని యథాతథంగా, నిర్దుష్టంగా అప్పగించాడు. ఆతని ఏకసంథా గ్రాహ్యత, ధారణా శక్తికి అబ్బురపడి యముడు 'ఈ అగ్ని నీ పేరుతో 'నచికేతాగ్ని' అని లోకప్రసిద్ధి పొందుతుందని దీవించాడు. మూడవ వరం పరంగా, యోగ్యులకే ఆత్మవిద్య గురించి చెప్పాలని, అందుకు నచికేతుడు అర్హుడా? కాడా? అని యముడు పరీక్షించ దలచాడు. ఈ కోరికను ఉప సంహ రించుకుంటే.. అనంత భోగభాగ్యాలు ప్రసాదిస్తానన్న యమ ప్రలోభానికి నచికేతుడు ఆశపడలేదు, లొంగలేదు. అశాశ్వతమైన భోగాలు కంటే మిన్న అయిన నిగూఢమైన ఆత్మజ్ఞానం గురించి ఉపదేశించాలని విన్నవించాడు. ఆతని శ్రద్ధ, పట్టుదలను మెచ్చిన యమధర్మరాజు దానిని ఉపదేశిస్తూ, 'మానవులందరికి ఒక లక్ష్యం ఉండాలి. దాని సాధనకు అలుపెరుగని ప్రయత్నం చేయాలి. అంతరాత్మను దర్శించేందుకు ఇంద్రియాలను నియంత్రించి, అంతర్ముఖం చేయాలి. ఇది సాధనవల్లనే సాధ్యం తప్ప గ్రంథ పఠనం వల్లనో, తర్కంతోనో సాధ్యం కాదు. శ్రేష్ఠమైన గురువుల సహాయంతో లక్ష్యం సిద్ధించేవరకు సాగిపో' అని ప్రబోధించాడు. నైతిక విలువలు, మనోబుద్ధి అహంకారాలు, ఇతర అనేక లౌకిక, మౌలిక అంశాలపై సాగిన ఈ సంభాషణమే 'కఠోపనిషత్తు' గా ప్రసిద్ధి పొందింది.


– రామచంద్ర రామానుజ

## వివేకానంద సూక్తిశతి



**Whatever others think or do, lover not your standard of purity, morality and love for God**

ఏమి తలచి ఇతరులేమి చేసినగాని
నీవు విడువబోకు నీతి పథము
దైవభక్తి ఎపుడు ధర నీకు రక్షరా
వినుడి స్వామి సద్వివేక వాణి!!



బండిరాజుల శంకర్
9948050608,ఆలేరు




"నేను ఇండియా వెళ్లగానే వాళ్ల అమ్మ నాన్నలను కలిసి ఓ మంచి లాయర్ తో మాట్లాడి ఆ కేసుని పరిష్కరించే ప్రయత్నం చేస్తాను. ఇంక వాడికి విడాకులు తప్ప మరో మార్గం లేదు. మనిషికి ముప్పై ఏళ్లు వచ్చేసరికి ఉద్యోగం, పెళ్లి, విడాకులు లాంటి సమస్యలొస్తే ఆరోగ్యం పాడయ్యే ప్రమాదం ఉంది... అమెరికా ఒక విధంగా మంచి చేస్తుంటే ఇంకొక విధంగా చెడు చేస్తోందనిపిస్తోంది.. అమెరికా కల్చర్ మనకు నప్పదు. మనకు ఇక్కడి చదువు, ఉద్యోగాలు బాగుంటాయి కానీ మిగతా విషయాలు మనకు నప్పవు. మన ఆంత్రోపోలజీ వేరు, వాళ్లది వేరు... మనకి కావలసినదే తీసుకోవాలి. మనవాళ్లు మొత్తం అమెరికా కల్చర్నే ఎడాప్ట్ చేసుకుంటూ సమస్యలు కొని తెచ్చుకుంటునారు. అయినా నాణేనికి ఎప్పుడూ రెండవ వైపు ఉంటుంది. మంచి ఒక వైపుంటే చెడు ఇంకొక పక్క ఉండక తప్పదు". అన్నాను...

"మరి మధుని కలుస్తావా?" అనీ అడిగింది సమీర..

"రేపు వెళ్లి కలుద్దామనీ అనుకుంటున్నాను"

"నువ్వు ఎప్పుడు ఇండియాకి వెళుతునావు?"

"ఎల్లుండి! నేను తిన్నగా ఇంటికి వెళ్లకుండా హైదరాబాద్లో దిగి శ్రీరామ్ వాళ్ల అమ్మ నాన్నల్ని కలిసి వాళ్ల మీద పెట్టిన గృహ హింస కేసు గురించి మాట్లాడతాను." అనీ చెప్పాను.

"వంశీ! నువ్వు వెళ్లిన తరువాత ఎంత త్వరగా వాడి వివరాలు పంపిస్తే ఆ తరువాత నేను ఒక నిర్ణయం తీసుకొని నాన్నకు నా నిర్ణయం చెప్పి ఇండియా వచ్చేస్తాను" అనీ చెప్పింది సమీర.

"తప్పకుండా! నే వెళ్లగానే ఆ పని మీదే ఉంటాను. మరి నేను బయలు దేరతాను" అంటూ లేచాను...

"అదేమిటి? అమెరికా వచ్చి నన్ను కలిసి రెండు గంటల్లో మళ్లీ తిరిగి వెళ్లి పోతావా? లంచ్ చేసి వెళ్లు" అనీ చెప్పింది.

ఆ తరువాత నాకు సిలికాన్ వేలీ అంతా తిప్పి పెద్ద పెద్ద సాఫ్టవేర్ కంపెనీల ముఖ్య కార్యాలయాలన్ని చూపించింది.. ఇద్దరం అక్కడ ఉన్న సౌత్ ఇండియన్ రెస్టారెంట్లో లంచ్ చేసి ఆమె ఆఫీసుకి వచ్చాము...


"వంశీ! ఎందుకో నువ్వు వెళ్లిపోతూ ఉంటే బాధ వేస్తోంది. నువ్విక్కడ ఉంటే నాకెంతో ధైర్యంగా ఉంది... నువ్వెళ్లిపోతే మళ్లీ ఒంటరితనం ఆవహిస్తుంది" అంది చెమర్చిన కళ్లను తుడుచుకుంటూ...


"చాలా మంది అమెరికా వచ్చిన వాళ్లు ఈ దేశానికి ఎడిక్ట్ అయి మనదేశాన్ని తిట్టుకుంటూ ఇక్కడ ఆనందంగా గడిపేస్తుండటం నేను చాలా మందిలో చూసాను. నిన్ను చూస్తుంటే ఇక్కడి వాతావరణానికి ఎడ్జస్ట్ అయినట్లు లేదు.. నువ్వు ఇక్కడ ఉండలేవు అనిపిస్తోంది"... అనీ చెప్పాను. ఆ తరువాత సమీరకు వీడుకోలు చెప్పి మధు దగ్గరకు బయలు దేరాను;

* * *

మధు ఎయిర్ పోర్టు కొచ్చి నన్ను రిసీవ్ చేసుకున్నాడు... న్యూయార్క్ నగరం చాలా సుంద రంగా ఉంది... ఎక్కడ చూసినా ఆకాశ హర్మ్యాలు తమ గొప్పతనాన్ని

**'జాగృతి' నిర్వహించిన స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక నవలల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన రచన**





ప్రదర్శిస్తున్నాయి. న్యూయార్క్ నగరం అమెరికాకు మణిహారమే కాక మనీ హారం కూడా.అంటే ఆర్థిక రాజధాని. మన దేశానికి ముంబాయి లాగ అన్నమాట. పేరుకే వాష్టింగన్ డీసీ రాజధాని కానీ అక్కడ అధ్యక్ష భవనం, మరికొన్ని ప్రభుత్వ కార్యాలయాలు తప్ప ఆ నగరానికి పెద్దగా ప్రాధాన్యం ఉండదు. కానీ అమెరికాని శాసిస్తున్నది మాత్రం న్యూయార్క్ మహానగరం. రెండున్నర కోట్ల జనాభాతో ఎప్పుడూ చాలా రద్దీగా, మనుషులంతా బిజీగా ఉంటారు. దానికి ఎంత ప్రాధాన్యత లేకపోతే బిన్ లాడెన్ ఈ నగరంలోని ట్విన్ టవర్స్ని కూల్చడానికి ఎన్నుకున్నాడు!? ఆ నగర శివార్లలో కొత్తగా కట్టిన సొసైటీలో మధు ఉంటునాడు. అతను పనిచేసే సాఫ్ట్‌వేర్ కార్యాలయం అక్కడికి దగ్గర్లోనే ఉందట. ఆ సొసైటీని చూస్తుంటే నాకు మనరాష్ట్రంలో ప్రతీ పట్నంలో ఊరికి దూరంగా కట్టే హౌసింగ్ బోర్డు కోలనీలు గుర్తుకువచ్చాయి.చుట్టూ కనుచూపు మేర అంతా నిర్జన ప్రదేశం.ఎదురుగా పచ్చటి కొండలు. అప్పుడప్పుడూ రహదారి మీద కనిపిస్తున్న కార్లు. అక్కడ ఎవ్వరూ పెద్దగా బయటకు రావటం లేదు. ఆన్‌లైన్ వ్యాపారాలు, కంప్యూటర్లు, సెల్ ఫోన్‌లు, టీవీలు మనుషుల్ని సమాజా నికి దూరం చేస్తున్నాయని పించింది.

నేను ఎనిమిదవ తరగతి చదువుతున్నపుడు సాంఘిక శాస్త్రంలోని 'మాన వుడు సంఘ జీవి' అన్న వాక్యం నన్ను బాగా ఆకర్షించేది. కానీ ఇప్పుడది తప్పనిపిస్తోంది. మాన వుడు తన స్వార్థంతో సంఘానికి దూరం అవుతూ ఒంటరి వాడవు తునాడు.

ఇంకో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే ఆ కోలనీలోని ఇళ్ల నిర్మాణం మనదేశంలోలాగ కాంక్రీటు స్లాబులు కనిపించటం లేదు.అన్నీ పర్యావర ణానికి మేలు చేసే మట్టి పెంకులు, రేకులతోనూ నిర్మించిన ఇళ్లు. గోడలన్నీ కలపతో నిర్మించారు. కేవలం పునాదుల వరకే కాంక్రీటు. మిగతాదంతా ప్రకృతి ప్రసాదించిన వెదురు, పెంకులు. ఈ విషయంలో అమెరికాని చూసి చాలా నేర్చుకోవాలి.

మధు ఇల్లు చాలా సింపుల్గా ఉంది. లోపల నుంచి మెట్లు. పై అంతస్తులో ఒక బెడ్ రూము, హాలు, డూప్లెక్స్ నిర్మాణం. అంటే లోనుంచి మెట్లు.

స్నానం చేసిన తరువాత మధు ఉప్మా చేసాడు.

అమెరికాలో తెలుగు ఉప్మాని చూసి నాకు చాలా ఆశ్చర్యం, ఆనందం కలిగింది. చాలా రోజుల నుంచి తెలుగు వంటకాలకి దూరం కావడంతో ఈ రోజు ఉప్మా వేడిగా రుచిగా నోటికి తగిలింది. దానికి తోడు ఇంటి నుంచి పంపించిన ఆవకాయ. ఆ రెండింటి కాంబినేషన్ అద్భుతంగా ఉంది.

తిన్న తరువాత వేడి టీ మరింత రుచి అనిపిం చింది. తాగుతూ తన వివరాలు చెప్పాడు మధు.

"చదువుకునేటప్పుడు ఫీజు కోసం చాలా ఇబ్బందులు పడ్డాను. సాయంత్రం పూట లైబ్రరీలో, మరికొన్నాళ్లు పెట్రోల్ బంకులో పనిచేసాను. చదువు పూర్తైన వెంటనే ఈ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. అప్పుడే పరిచయం అయింది నీహారిక. ఆమె కూడా నాలాగే ఇక్కడికి ఎమ్మెస్ చేయడానికి వచ్చి సాఫ్ట్‌వేర్ కంపెనీలో చేరింది.తానా సభలప్పుడు ఆమె నాకు పరిచయమై, కొన్నాళ్లకు స్నేహంగా మారింది. నీహారిక ఆఫీసు మా ఆఫీసుకి దగ్గర్లోనే ఉండటం వల్ల తరచు మా ఆఫీసుకొచ్చి కలుస్తుండేది. ఇద్దరం సినిమాలకు, పార్కులకు వెళ్లేవాళ్లం. మొదట్లో ఎవరైనా ఏమైనా అనుకుంటారేమోనని భయపడ్డా ఇది అమెరికా కాబట్టి ధైర్యంగా ముందుకెళ్లాను...

ఆ పరిచయంలో ఆమె గురించిన కొన్ని ఆసక్తికర మైన విషయాలు తెలిసాయి.


"నీహారిక ఎనిమిది చదువుతున్నప్పుడు ఆమె తల్లితండ్రులు విడాకులు తీసుకున్నారట. అప్పట్నుంచీ ప్రభుత్వోద్యోగం చేస్తున్న ఆమె తల్లే పెంచి, చదివిం చింది.అందుకే ఆమె పెద్దగా హైదరాబాదు వెళ్లదు. నా కన్నా ఆమె ఒక సంవత్సరం సీనియర్. ఎమ్మెస్ చదువుతున్నప్పుడు ఆమెకు ఒక అమెరికన్ ఇండియన్ ఛార్లెస్ పరిచయమయ్యాడు. కొన్నాళ్ల పాటు అతనితో సహజీవనం అంటే లివ్ ఇన్‌రిలేషన్ షిప్పు చేసిందట. రెండేళ్ల తరువాత ఇద్దరూ పరస్పర అంగీకారంతో విడిపోయారట.ఆ తరువాత నాతో పరిచయాన్ని కొనసాగిం చింది"...

"లివ్ ఇన్ రిలేషన్ షిప్పు అంటే సహజీవనంలో రిస్కు ఉంది కదా... దాన్ని ఎందుకు ఎంచుకున్నావు" అనీ ఆమెనడిగాను... దానికి ఆమె" పెళ్లి కాకుండానే ఆడమగ పరస్పర అంగీకారంతో ఇద్దరూ కలిసి ఉండటాన్ని సహజీవనం అంటారు. సహజీవనంలో ఇద్దరికీ స్వేచ్ఛ ఉంటుంది. కాబట్టి ప్రేమ ఎక్కువ ఉండే అవకాశం ఉంది. బంధుత్వాలు, కట్టుబాట్లు అడ్డురావు కాబట్టి ఇద్దరూ తమ కిష్టమైన రీతిలో ఉండొచ్చు. అందుకే దీన్ని ఎంచుకున్నాను" అనీ చెప్పింది...

"మరి మీ ఇద్దరూ ఎందుకు విడిపోయారు" అని అడిగాను.

"రెండు సంవత్సరాల సహజీవనంలో అతని మనస్తత్వం నాకు సరిపోదనిపించింది... అందుకే విడిపోయాము... సహజీవనంలో అదే లాభం. అదే మేమిద్దరం పెళ్లి చేసుకుంటే విడిపోవడం కష్టం అయ్యేది. విడాకుల ప్రహసనం నడిచేది. కానీ మేము ఒక్కరోజులో నిర్ణయానికొచ్చి విడిపోయాము. ఇప్పుడు మేమిద్దరం స్నేహితులం" అని చెప్పింది నీహారిక.

**(సశేషం)**



గన్నవరపు నరసింహమూర్తి


# భారత్‌కు రెండో టైమ్

**దేశమంతా ఇక ఒకే ప్రామాణిక సమయాన్ని నిర్దేశిస్తూ కేంద్రం తాజాగా నిబంధనలు విడుదల చేసింది. ప్రస్తుతం దేశంలో ఒకే సమయాన్ని పాటిస్తున్నా ఆచరణలో ఇబ్బందులు ఉన్నాయి. ఈశాన్య రాష్ట్రాల్లో ముందుగానే సూర్యోదయం, ఆలస్యంగా సూర్యాస్తమయం ఉండటంతోనే ఆ సమస్యలు వస్తున్నాయి. దేశంలోని తూర్పు, పశ్చిమ ప్రాంతాల మధ్య దాదాపు గంట తేడా ఉంది. అమెరికాకు ఆరు టైమ్ జోన్స్ ఉన్నప్పుడు మన దేశానికి రెండు టైమ్స్ జోన్స్ ఎందుకు ఉండరాదనే చర్చ మరోసారి మొదలైంది. ఒకటికన్నా ఎక్కువ టైమ్ జోన్స్ ఉంటే లాభనష్టాలపై ఇప్పటికే అనేక అధ్యయనాలు జరిగాయి.**

వన్ నేషన్.. ఈ మధ్య ఎక్కువగా వినిపిస్తున్న నినాదం. వన్ ఎలక్షన్ పేరుతో లోక్‌సభకు, అసెంబ్లీలకు, స్థానిక సంస్థలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. మతాలతో సంబంధం లేకుండా ఉమ్మడి పౌరస్మృతిని తీసుకొచ్చే దిశగా చర్చ మొదలు పెట్టింది.. ఇదే సమయంలో ఒకే దేశం ఒకే సమయం పేరుతో అన్ని రంగాల్లో భారత ప్రామాణిక సమయం (ఐఎస్‌టీ) వినియోగాన్ని తప్పనిసరి చేస్తూ కేంద్రం ముసాయిదా నిబంధనలు రూపొందించింది. దీనిపై ప్రజలు తమ అభిప్రాయాలు చెప్పడానికి విధించిన గడువు ఫిబ్రవరి 14 కూడా ముగిసింది. ఇందుకు నిబంధనలు, 2024 లోనే చట్టపరమైన విధివిధానాలు ఏర్పాటు చేశారు. ఇవి అమల్లోకి వస్తే.. చట్ట, పాలన, వాణిజ్య, ఆర్థిక రంగాలతో పాటు అధికారిక పత్రాల్లోనూ ఇక ఐఎస్‌టీ తప్పనిసరి. ఐఎస్‌టీ కాకుండా ఇతర టైమ్ జోన్లను ప్రస్తావించడం నిషేధం. అయితే అంతరిక్షం, సముద్రయానం, శాస్త్రీయ పరిశోధన రంగాలకు మినహాయింపునిచ్చింది కేంద్రం.

ఒకే దేశం ఒకే సమయం అనే నిబంధన వినడానికి బాగానే ఉంది. జాతీయ ఐక్యతా స్ఫూర్తి ప్రతిబింబిస్తుంది... కానీ ఆచరణలో సమస్యలు చాలా ఉన్నాయనేది వాస్తవం.. విశాలమైన భారతదేశంలో రాష్ట్రాలు, ప్రాంతాల మధ్య భౌగోళికంగా చాలా దూరాలు ఉన్నాయి.. దేశమంతా ఒకే సమయాన్ని అనుసరించడంతో కొన్ని ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోక తప్పడం లేదు.. ఇది ఎలాగో కాస్త లోతుల్లోకి వెళ్లి పరిశీలిద్దాం..

హైదరాబాద్‌లో సూర్యోదయం ఉదయం 5.45 నుంచి 6 గంటల ప్రాంతంలో జరగుతుంది. అదే విశాఖలో ఉదయం 5.15 నుంచి ఐదున్నర గంటల మధ్య అవుతుంది. దాదాపు రెండు నగరాల మధ్య దాదాపు పావుగంట తేడా ఉంటుంది. ఎండాకాలం, శీతాకాలంలో సూర్యోదయ, సూర్యాస్తమయ వేళలు మారినా రెండు ప్రాంతాల మధ్య పావు గంట తేడా మాత్రం అలాగే కొనసాగుతుంది. ఇక ఈశాన్య రాష్ట్రాల పరిస్థితి ఎలా ఉందో చూడండి.. ఇక తూర్పు, పశ్చిమ రాష్ట్రాల మధ్య సమయంలో చాలా తేడా వచ్చేస్తోంది. భారతదేశంలో తొలి సూర్యోదయం అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రంలోని అంజా జిల్లాలో సముద్ర మట్టానికి 1,240 మీటర్ల ఎత్తులో ఉన్న డోంగ్ గ్రామంలో అవుతుంది. అక్కడ వేసవిలో ఇక్కడ వేసవిలో ఉదయం 4 గంటలకే సూర్యుడు కనిపిస్తాడు. సాయంత్రం 4.30కే సూర్యాస్తమయం అవుతుంది. శీతాకాలంలో నాలుగింటికే చీకటి పడటంతో కార్యాలయాలు, విద్యాసంస్థల్లో లైట్లు వెలిగించి పనులు చేసుకుంటారు.. ఈశాన్య రాష్ట్రాలు అన్నింటిలో దాదాపు ఇదే పరిస్థితిని గమనించవచ్చు..




**ఈశాన్య భారతంలో సమస్యలు**

మన దేశంలోని తూర్పు నుంచి పడమర ప్రాంతాల మధ్య అంటే.. గుజరాత్‌లో $68^{0}$7'E నుండి అరుణాచల్‌లో $97^{0}$25'E వరకు 2933 వేల కిలో మీటర్లు దూరం ఉంటుంది. పశ్చిమాన రాన్ ఆఫ్ కచ్‌తో పోలిస్తే సూర్యుడు తూర్పు సరిహద్దులో దాదాపు రెండు గంటల ముందుగా ఉదయిస్తాడు. అహ్మదాబాద్‌లో ఉదయం 6 గంటలు అయితే ఈటానగర్ వాసులకు అది 8 గంటలకు సమానం. దేశ రాజధాని వాసులకు 7 గంటలతో సమానం.

దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఈశాన్య రాష్ట్రాల్లో సూర్యోదయం, అస్తమయాలు కాస్త ముందుగానే పూర్తయినా వారు ప్రామాణిక భారత సమయం ఇండియన్ స్టాండర్డ్ టైమ్ IST ప్రకారం తమ దైనందిన కార్యకలాపాలు కొనసాగించక తప్పడంలేదు. దీని ప్రభావం జీవక్రియలపై పడుతోంది. వారు దేశంలోని ఇతర ప్రాంతాలకన్నా ముందే లేచినా IST ప్రకారం ఆలస్యంగా విధులకు హాజరవుతూ, ఆలస్యంగా నిద్ర పోతున్నారు. అక్కడ పిల్లలకు నిద్ర కరువవుతోంది. సూర్యాస్తమయం ఆలస్యంగా జరిగే ప్రాంతాల్లో పిల్లలు ఆలస్యంగా పడుకుంటారు. కానీ వీరు ఉదయాన్నే త్వరగా నిద్ర లేవాల్సి వస్తుంది. ఈ ప్రభావం వారి చదువులపై కూడా పడుతోందని చెబుతున్నారు. ఈశాన్యంలోని చాలా మంది ప్రజలు దాదాపు భోజన సమయానికి అల్పాహారం తీసుకుంటున్నారు.

అయితే అసోంలోని తేయాకు తోటల్లో ప్రత్యేక సమయాన్ని పాటిస్తున్నారు. దేశమంతా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేస్తే.. తేయాకు తోటల్లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకే పనిచేస్తారు. ఈ విధానాన్ని చైబగన్ టైమ్ (టీ గార్డెన్ టైమ్) అని పిలుస్తుంటారు. తేయాకు ఉత్పత్తిని పెంచడం కోసం బ్రిటిష్ వారు ఈ విధానాన్ని మొదలు పెట్టారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా ఇదే విధానం కొనసాగుతోంది.

ఇండియన్ స్టాండర్డ్ టైమ్ కారణంగా ఏర్పడుతున్న సమస్యలను దృష్టిలో పెట్టుకొని ఈశాన్య రాష్ట్రాలకు వేరే టైమ్ జోన్ ఉండాలనే డిమాండ్ చాలా కాలంగా ఉంది. మూడేళ్ల క్రితం అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ఈ డిమాండ్‌ను పునరుద్ఘాటించారు. ఈశాన్య ప్రాంతాలకు ప్రత్యేక టైమ్ జోన్ అవసరముందని స్పష్టం చేశారు. ఈ టైమ్ జోన్ భారత్ ప్రధాన భూభాగం కంటే రెండు గంటలు ముందుకు ఉంటే.. చాలా విద్యుత్ ఆదా అవుతుందని, పనిచేసే సామర్థ్యం కూడా పెరుగుతుందని హిమంత తెలిపారు. ప్రజల ఆరోగ్యంపై కూడా దీని ప్రభావం సానుకూలంగా ఉంటుందని, జీవ గడియారంతో మనం అనుసరించే టైమ్ కూడా కలుస్తుంది అని వివరించారు. సూర్యరశ్మి అందుబాటులో ఉండే సమయాన్ని కోల్పోవడం, విద్యుత్ వినియోగం పెరగడం లాంటి



# జోన్ అవసరమా?

కారణాలను చూపుతూ హిమంత బిశ్వ శర్మ ప్రత్యేక టైమ్ జోన్ అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకొచ్చారు. IST అరగంట ముందుకు సాగడం వల్ల ప్రతి సంవత్సరం 2.7 బిలియన్ యూనిట్ల విద్యుత్ ఆదా అవుతుందని ఒక అంచనా.

గతంలో అరుణాచల్ ముఖ్యమంత్రి పెమా ఖండూ ఇదే డిమాండ్ వినిపించారు. "మేం ఉదయం నాలుగు గంటలకే నిద్ర లేస్తాం. కానీ మా ఆఫీసులు పది గంటలకు తెరచుకుంటాయి. ఈ మధ్య చాలా సమయం వృథాగా పోతోంది" అని వ్యాఖ్యానించారు. ఈశాన్య భారత రాష్ట్రాలకు +6 UTC ప్రకారం అరగంట ముందు ఉండే టైమ్ జోన్ కావాలని సూచించారు.

దేశంలో రెండు టైమ్ జోన్లు ఉంటే రెండు సమయ మండలాల మధ్య సరిహద్దు రేఖ 89.52°E (అసోం–పశ్చిమ బెంగాల్ మధ్య) ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఉంది. ఈ రేఖకు పశ్చిమాన ఉన్న రాష్ట్రాలు IST-I (UTC+5:30)ని అనుసరిస్తాయి, ఈ రేఖకు తూర్పున ఉన్న రాష్ట్రాలు (అస్సాం, మేఘాలయ, నాగాలాండ్, అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, మిజోరం, త్రిపుర, అండమాన్ – నికోబార్ దీవులు IST-II (UTC+6:00)ని అనుసరిస్తాయి.

**కమిటీల అధ్యయనం**

1980వ దశకపు చివరిలో ఒక పరిశోధకుల బృందం విద్యుచ్ఛక్తిని ఆదాచేయటానికి దేశాన్ని రెండు లేదా మూడు కాలాంశాలుగా విభజించాలని ప్రతిపాదించారు. వీరి ప్రతిపాదనలో బ్రిటిషుపాలన కాలంలో ఉన్న రెండు కాలాంశాల పద్ధతిని తిరిగి ప్రవేశపెట్టడం కూడా ఒకటి. అయితే ఈ ప్రతిపాదనలు అమలుకు నోచలేదు.

2001లో కేంద్ర ప్రభుత్వం శాస్త్ర సాంకేతిక శాఖ ఆధ్వర్యంలో అదనపు టైమ్ జోన్స్ పగలు సమయం ఆదాను అధ్యయనం చేసేందుకు నలుగురు సభ్యుల సంఘాన్ని నియమించింది. ఈ సంఘం చేసిన సూచనలకు కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి కపిల్ సిబాల్ 2004లో భారత పార్లమెంటులో ప్రవేశ పెట్టారు. ఈ కమిటీ ఇప్పుడున్న టైమ్ జోన్‌లో మార్పులు అవసరం లేదని సూచించింది. 2006లో ప్రణాళికా సంఘం దేశాన్ని రెండు సమయ మండలాలుగా విభజించాలని సిఫార్సు చేసింది. 2009లో సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలోని హైలెవల్ కమిటీ కూడా ఈశాన్య ప్రాంతంలోని రాష్ట్రాలకు ఒక గంట ముందుకు ఉంటే మేలని సూచించింది. 2018లో భారత ప్రామాణిక సమయాన్ని నిర్వహించే సీఎస్ఐఆర్–ఎన్ఐపీఎల్ రెండు సమయ మండలాల ఆవశ్యకతను వివరిస్తూ ఒక పరిశోధనా కథనాన్ని ప్రచురించింది. భారత కాలమానం కంటే ఒక గంట ఇది ముందుకు ఉంటే, అక్కడి సూర్యరశ్మిని మెరుగ్గా ఉపయోగించుకోవచ్చని పేర్కొంది. భారత్‌లోనూ రెండు టైమ్ జోన్లు ఏర్పాటు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ కొందరు గువాహటి హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం కూడా దాఖలు చేశారు. అయితే కోర్టు దాన్ని తిరస్కరించింది.

**రెండు టైమ్ జోన్లతో లాభాలేంటి?**

1980 ప్రాంతంలో టైమ్ జోన్స్ మీద ఒక అధ్యయనం జరిగింది.. రెండు టైమ్ జోన్స్ ఏర్పాటు చేస్తే ఈశాన్య ప్రాంతాలను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావచ్చని ఎన్ఐఏఎస్ సూచించింది. ప్రజలు సూర్యకాంతి ఆధారంగా తమ ప్రణాళికను అమలు చేసుకోగలుగు తారు. వారి దేహచక్రం మరింత మెరుగ్గా ఉంటుంది. శ్రామికశక్తి వినియోగం పెరుగుతుంది. ఐఎస్టీని అరగంట ముందుకు తేస్తే ప్రతి సంవత్సరం 2.7 బిలియన్ యూనిట్ల విద్యుత్ ఆదా అవుతుంది. సంవత్సరానికి రూ. 1,000 కోట్లు ఆదా చేయవచ్చు. విద్యుత్ కొరతతో బాధపడుతున్న భారత ఆర్థిక వ్యవస్థకు ఇది చాలా కీలకం.

విద్యుత్తును ఆదా చేయగలిగితే పర్యావరణ సమస్యలు తగ్గుతాయి. కార్బన్ డయాక్సైడ్ కొంత తగ్గుంది. వాతావరణ మార్పులను ఎదుర్కోవాలనే భారత్ సంకల్పం పెరుగుతుంది. రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయి. మహిళల భద్రత పెరుగుతుంది. పగలు సమయం ప్రకారం కార్యాలయాలు నడిస్తే ఉద్యోగుల ఆహారం, నిద్ర, పని వేళలు మెరుగై ఆరోగ్యంగా ఉంటారు. విద్యార్థులు సకాలంలో నిద్రాహారాలను తీసుకోడం ద్వారా మరింత ఆరోగ్యంగా ఉంటారు. వారి చదువులు మెరుగై మంచి ఫలితాలను సాధిస్తారు.


**ప్రతికూల పరిస్థితులు**

ఒకటికన్నా ఎక్కువ టైమ్ జోన్స్ అంటే కొన్ని ప్రతికూల అంశాలు కూడా ఎదురవుతాయి. దేశ వ్యాప్తంగా వేర్వేరు టైమ్ జోన్స్ ఉంటే కార్యాలయాలు, బ్యాంకుల పనిలో గందరగోళం ఏర్పడుతుందనే వాదన ఉంది. రైలు సమయాలను టైమ్ జోన్లకు అనుగుణం నడిపిస్తే సరిగ్గా అర్థం చేసుకోకపోతే చిక్కులు పెరుగుతాయి. రైల్వే ట్రాఫిక్‌లో మార్పులతో ప్రమాదాలు తరచుగా జరిగే అవకాశం ఉంది. ప్రజలు తరచూ గడియారాలు సెట్ చేసుకోవడం కూడా కష్టమే. టైమ్ జోన్లకు అటూ ఇటూ తిరిగేవారు పదే పదే టైమ్ మార్చుకుంటూ ఉండాలి. నిరక్షరాస్యులు మరిన్ని ఇబ్బందులు పడక తప్పదు

మన దేశంలో అనేక ప్రాంతాలు, మతం, కులం, జాతి, భాష ఆధారంగా వేర్పాటువాద సమస్యలు పెరుగుతున్నాయి. రెండు టైమ్ జోన్స్ వస్తే ఈశాన్య రాష్ట్రాల ప్రజలు మిగతా దేశ ప్రజలతో పోల్చుకొని తాము భిన్నమైన వారమని అపార్థం చేసుకునే ప్రమాదం ఉంది. ఇప్పటికే అక్కడి రాష్ట్రాల్లో వేర్పాటువాద శక్తులు దేశ సమైక్యత, సార్వభౌమాధికారాన్ని ధిక్కరిస్తున్నాయి.

మరి దీనికి ప్రత్యామ్నాయం ఏమిటి? ప్రస్తుత భారత ప్రామాణిక సమయాన్ని (ఐఎస్టీ)ని అరగంట ముందుకు మారిస్తే కొన్ని పరిస్థితులు సర్దుకునే అవకాశం ఉందని సూచిస్తున్నారు. చైనా, కిర్గిస్తాన్, మలేషియా, సింగపూర్, దక్షిణ కొరియా దేశాలు తమ గడియారాలను కాస్త ముందుకు జరపడంతో అనేక రకాలుగా లబ్ధిపొందాయి.

**(వచ్చేవారం టైమ్‌జోన్ అంటే ఏమిటి?)**



**క్రాంతిదేవ్ మిత్ర**
సీనియర్ జర్నలిస్ట్

ప్రధాని నరేంద్రమోదీ ఫ్రాన్స్, అమెరికాల్లో తన పర్యటనను విజయవంతంగా ముగించారు. ఈ రెండు దేశాల పర్యటన ఆ రెండు దేశాలతో ద్వైపాక్షిక సంబంధాలను మరింత సుస్థిరం చేసుకోవడంలో ఎంతో దోహదం చేసిందని చెప్పవచ్చు. మోదీ పర్యటన ఫ్రాన్స్‌లో ప్రారంభమైంది. ఫ్రాన్స్ మనకు ఎంతటి ఆప్త దేశమో ఈ పర్యటనతో మరోసారి నిరూపితమైంది. ఆ దేశాధ్యక్షుడు ఇమాన్యుయెల్ మక్రాన్ ఆహ్వానం మేరకు అక్కడకు చేరుకున్న ప్రధాని, కృత్రిమ మేధ (ఎ.ఐ.)పై జరిగిన సదస్సుకు కో-ఛైర్‌పర్సన్‌గా వ్యవహరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెంట్ యాక్షన్ సమ్మిట్ పేరుతో ఫిబ్రవరి 11న ప్యారిస్‌లో జరిగిన సదస్సుకు వివిధ దేశాల అధినేతలు, సంస్థల అధిపతులు, ఎన్.జి.ఒ.లు, కళాకారులు, పౌరసమాజ సభ్యులు, చిన్న, పెద్ద సంస్థలకు చెందిన యజమానులు హాజరయ్యారు. 2023లో జరిగిన ఎ.ఐ. సదస్సులో సాధించిన మైలురాళ్లనదగ్గ అంశాలను మరింత ముందుకు తీసుకెళ్లడంపై ఈ సదస్సులో ప్రధానంగా చర్చించారు. ఇండో-ఫ్రాన్స్ నేతల ఉమ్మడి సదస్సులో, నరేంద్రమోదీ మాట్లాడుతూ, రక్షణ, పౌర అణు, బీమా ఆధునిక తయారీ రంగాల్లో ఫ్రాన్స్ కంపెనీలు నూతన అవకాశాలను అన్వేషించాలని కోరారు. ఏరోస్పేస్, డిఫెన్స్, ఇన్నోవేషన్, ఇంధనం, మౌలిక సదుపాయాలు, ఆగ్రో ప్రాసెసింగ్ (వ్యవసాయ ఉత్పత్తుల శుద్ధి), వినియోగ వస్తువుల ఉత్పత్తులకు సంబంధించిన సి.ఇ.ఒ.లు ఈ సదస్సులో పాల్గొన్నారు.



# మోదీ విదేశీ పర్యట

ఇద్దరు నాయకులు ఫ్రాన్స్ అధ్యక్షుడి విమానంలో కలిసి మార్సెల్లీకి ప్రయాణించారు. ఇరుదేశాల మధ్య సాన్నిహిత్యం, నరేంద్రమోదీ-మక్రాన్‌ల మధ్యగల దృఢమైన స్నేహసంబంధాలకు ఇది ప్రతీకగా నిలిచిందనే చెప్పాలి. ఈ పర్యటనలో భారత్-ఫ్రాన్స్‌ల సంబంధాలు నూతన శిఖరాలకు చేరాయనవచ్చు. మార్సెల్లీకి చేరుకున్న తర్వాత ఇద్దరు నేతలు తమ ప్రతినిధి బృందాలతో కలిసి ద్వైపాక్షిక చర్చల్లో పాల్గొన్నారు మక్రాన్, ప్రధాని నరేంద్రమోదీకి ప్రత్యేక విందును ఏర్పాటుచేశారు. యూరప్, పశ్చిమాసియా, ఇండో-పసిఫిక్ ప్రాంతాల్లో నెలకొన్న పరిణామాలపై ఇరువురు నేతలు చర్చించారు.

**మార్సెల్లీ ఎంతో ముఖ్యం**

ఫిబ్రవరి 12వ తేదీన ప్రధాని నరేంద్రమోదీ పర్యటన మజార్గియస్ వార్ సెమిట్రీ సందర్శనతో ప్రారంభమైంది. మొదటి, రెండో ప్రపంచ యుద్ధాల్లో ప్రాణత్యాగం చేసిన భారతీయ సైనికులకు మోదీ, మక్రాన్ నివాళులు అర్పించారు. 'మార్సెల్లీకి భారతీయుల హృదయాల్లో కీలక స్థానం ఉంది. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు వీర్‌సావర్కర్‌ను బ్రిటిష్ సైనికులు ఓడలో విచారణ నిమిత్తం యు.కె.కు తీసుకెళుతున్నప్పుడు ఆయన సరిగ్గా ఈ మార్సెల్లీ సమీపంలో సముద్రంలో దూకి, ఫ్రాన్స్‌లో తీరానికి చేరుకున్నారు. అయితే బ్రిటిష్ వారు నాటి ఫ్రాన్స్ అధికార్లకు లంచాలిచ్చి సావర్కర్‌ను తమతో తీసుకెళ్లడం చరిత్ర. సావర్కర్‌ను బ్రిటిష్‌వారికి అప్పగించవద్దని ఫ్రాన్స్‌కు చెందిన పౌర సమాజ కార్యకర్తలు డిమాండ్ చేశారు' అని మోదీ తమ ప్రసంగంలో ప్రస్తావించారు. అనంతరం ఇద్దరు నేతలు మార్సెల్లీలో ఇండియన్ కాన్సులేట్‌ను ప్రారంభించారు.

కేడరచ్చేలోని ఇంటర్నేషనల్ థర్మో న్యూక్లియర్ ఎక్స్‌పర్‌మెంటల్ రీడర్ ఫెసిలిటీని (ఐటీఈఆర్) సందర్శించారు. ఇక్కడ పరమాణు సంలీన శాస్త్రంపై జరిగే పరిశోధనల ఫలితంగా అత్యధిక పరిమాణంలో శక్తి విడుదలవుతుంది. దీంతో పెద్ద మొత్తంలో విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చు. భవిష్యత్తులో ప్రపంచంలో నిర్మించబోయే అణురియాక్టర్లు ఈ సంలీన ప్రక్రియకు సంబంధించినవే అయి ఉంటాయంటే అతిశయోక్తి కాదు. ఈ సందర్భంగా భారత్-ఫ్రాన్స్‌లు స్మాల్ మాడ్యులార్ రియాక్టర్లు (ఎస్ఎంఆర్), అడ్వాన్స్ డ్ మాడ్యులార్ రియాక్టర్ల (ఎఎంఆర్) అభివృద్ధిలో, వీటిని కృత్రిమ మేధ సహాయంతో, సురక్షితంగా వినియోగించే విషయంలో పరస్పరం సహకరించుకుంటాయి. రానున్న కాలంలో ప్రపంచ వ్యాప్తంగా అధికంగా విద్యుత్ అవసరమవుతుందని అంతర్జాతీయ ఇంధన సంస్థ డైరెక్టర్ జనరల్ ఫాతిహ్ బిరోల్ పేర్కొన్న నేపథ్యంలో ఈ ఎస్ఎంఆర్, ఎఎంఆర్‌లను కృత్రిమ మేధ సమన్వయంతో ఏర్పాటుకు ప్రాధాన్యత ఏర్పడింది. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో పరస్పరం సమన్వయంతో పని చేసేందుకు ఇరుదేశాధినేతలు అంగీకరించారు. భారత్-ఫ్రాన్స్‌లు మూడో ప్రపంచ దేశాలకు అవసరమైన సహాయాన్ని అందించడంలో సమన్వయంతో కృషిచేయనున్నాయి. కృత్రిమ మేధపై ఇరుదేశాల ద్వైపాక్షిక అంగీకారం ప్రజాస్వామ్య విలువలకు, మానవాభివృద్ధికి కట్టుబడి ముందుకు సాగుతాయి. సురక్షితమైన, భద్రతతో కూడిన కృత్రిమ మేధస్సు వ్యవస్థల వినియోగం ద్వారా 2030 నాటికి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించాలని , ఇందుకోసం అంతర్జాతీయ స్థాయి సహకారాన్ని పొందాలని, కృత్రిమ మేధలో సామర్థ్య నిర్మాణాన్ని సాధించాలని, అంతర్జాతీయ చట్టాలకు కట్టుబడి, మానవహక్కులకు ప్రాధాన్యమిస్తూ ముందు కెళ్లాలని ఉమ్మడి ప్రకటన స్పష్టం చేసింది. స్కార్పియాన్ తరగతికి చెందిన జలాంతర్గాములను భారత్‌లోనే దేశీయంగా తయారు చేయాలని కూడా నిర్ణయించారు. కాగా, ప్రధాని నరేంద్రమోదీ ఎస్తొనియా అధ్యక్షులు అలార్ కరిస్, యు.ఎస్. ఉపాధ్యక్షుడు జె.డి. వాన్స్‌తో కూడా ద్వైపాక్షిక చర్చలు జరిపారు.

**ట్రంప్‌తో ద్వైపాక్షిక చర్చలు**

ఫ్రాన్స్‌లో పర్యటన ముగించుకొని, అమెరికా చేరుకున్న ప్రధాని నరేంద్రమో దీ అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్‌తో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. వాణిజ్యం, దిగుమతి సుంకాలు, 26/11 దాడులకు కారకుడైన తహవూర్ రాణా అప్పగింత, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ఎఫ్-35 యుద్ధ విమానాలను భారత్‌కు అమ్మడం, భారత్-చైనాల మధ్య సరిహద్దు వివాదం వంటి అంశాలు ఈ చర్చల్లో ప్రస్తావనకు వచ్చాయి. తహవూర్ రాణా తర్వాత మరిన్ని అప్పగింతలు ఉంటాయని ట్రంప్ చెప్పారు. అయితే సుంకాల విషయంలో భారత్‌కు మినహాయింపులేవీ ఉండబోవని ట్రంప్ స్పష్టం చేశారు. రెండు దేశాల మధ్య 'ఎం.ఇ.జి.ఎ (మేక్ ఇండియా గ్రేట్ అగైన్) భాగస్వామ్యం' ప్రస్తావన కూడా ఈ చర్చల సందర్భంగా వచ్చింది. ట్రంప్ ఎప్పుడూ ఎం.ఎ.జి.ఎ. (మేక్ అమెరికా గ్రేట్ అగైన్) గురించి మాట్లాడుతుంటారు. 'వికసిత్ భారత్'కు అమెరికన్ నిర్వచనం ఇది. భారత్-అమెరికాల పరస్పర వికాసం కోసం ఎం.ఇ.జి.ఎ. భాగస్వామ్యం అత్యంత కీలకమని ప్రధాని అన్నారు. 2030 నాటికి ఇరుదేశాల మధ్య



# నల్లో మరో మణిపూస

వాణిజ్యం 500 బిలియన్ డాలర్లకు చేరుకోవాలన్న లక్ష్యాన్ని నిర్దేశించారు. 'మిషన్-500' గా దీని పేరు పెట్టారు. ముఖ్యంగా ఉమ్మడి అభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞాన బదలాయింపు, ఉమ్మడి ఉత్పత్తికి ప్రాధాన్యత నిస్తారు. దీనికి సంబంధించిన నియమ నిబంధలను 2025లోగా రూపొందించాలని నిర్ణయించారు. పశ్చిమాసియా-ఐరోపా ఆర్థిక నడవా నిర్మాణంలో పరస్పరం సహకరించుకోవాలని ఇరుదేశాలు నిర్ణయించాయి. సుంకాల తగ్గింపుతో పాటు మార్కెట్ ప్రవేశాన్ని మరింత సులభతరం చేసేలా ద్వైపాక్షిక ఒప్పందాలు కుదుర్చుకోవాలని భారత్-అమెరికాలు నిర్ణయించుకున్నాయి. అదేవిధంగా 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్య సాధనకోసం భారత ప్రజలు వేగంగా అడుగులు ముందుకు వేస్తున్నారని చెప్పారు.

**యు.ఎస్.నుంచి పెద్ద ఎత్తున చమురు కొనుగోలు**

ఈ సందర్భంగా ఎఫ్-35 యుద్ధ విమానాలను భారత్‌కు అమ్మే ప్రతిపాదనను ముందుకు తెచ్చారు. ఇరుపక్షాల మధ్య చర్చల్లో ఇంధన రంగంలో కీలక ముందడుగు పడింది. భవిష్యత్తులో 25 బిలియన్ డాలర్ల విలువైన ఇంధనాన్ని అమెరికా నుంచి భారత్ కొనుగోలు చేసే అవకాశాలున్నాయి. ముఖ్యంగా ఈ కొనుగోలు ద్వారా రెండు దేశాల మధ్య కొనసాగుతున్న వాణిజ్య లోటును చాలావరకు భర్తీ చేయవచ్చు. ఇక భారత్-చైనా వివాదంలో మధ్యవర్తిత్వం వహించేందుకు అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ మరోసారి ముందుకు వచ్చారు. రెండు దేశాల సైన్యాలు వెనక్కి వెళ్లాల్సిన అవసరం ఉందని ఆయన వ్యాఖ్యానించారు. అక్రమ వలసలపై నరేంద్రమోదీ మాట్లాడుతూ, చట్టవిరుద్ధంగా మరోదేశంలో నివసించడం తమకు ఆమోదయోగ్యం కాదన్నారు. ఈ నేపథ్యంలో అమెరికాలో చట్టవిరుద్ధంగా ఉంటున్న భారతీయులను తిరిగి స్వీకరించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని మోదీ స్పష్టం చేశారు.


భారత్ నుంచి దిగుమతి అయ్యే ఉక్కు, అల్యూమినియంపై ట్రంప్ ప్రభుత్వం విధించిన 25% సుంకం ప్రభావం మోదీ పర్యటనపై పెద్దగా ప్రభావం చూపలేదు. టారిఫ్ల విషయంలో ఇరుదేశాలు పరస్పరం ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో వ్యవహరించాలని ట్రంప్ ఈ సందర్భంగా పేర్కొనడం గమనార్హం. అమెరికానుంచి మరింత చమురు, గ్యాస్, సైన్యానికి అవసరమైన పరికరాలు భారత్ కొనుగోలు చేస్తుందని ట్రంప్ ప్రకటించడంతో, ఇరుదేశాల మధ్య వాణిజ్య లోటు కొంతస్థాయిలో తగ్గుతుంది. సుంకాల ప్రభావం మనదేశం ఎగుమతి చేసే ఔషధాలు, రత్నాభరణాలు, ఇనుము-ఉక్కు, వాహన, విద్యుత్ యంత్రాలు, జౌళి, వస్త్రాలు, ఆహారపదార్థాలపై పడుతుంది. అయితే గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ మాత్రం భారత్‌పై సుంకాల ప్రభావం పెద్దగా ఉండబోదని అంటోంది. ఎందుకంటే మనదేశం ఎగుమతి చేసే వస్తువుల్లో 75%కు పైగా వస్తువులపై 5%కంటే తక్కువే దిగుమతి సుంకాలు ఉంటున్నాయి. మనదేశం నుంచి గత ఏడాది 27.8 బిలియన్ డాలర్ల విలువైన ఔషధాలు ఎగుమతి కాగా ఇందులో 31.37% అమెరికానే దిగుమతి చేసుకుంది.

**వాణిజ్య బంధ బలోపేతానికి ప్రతిన**

జాతీయ ప్రయోజనాలు, ఉద్యోగాల సృష్టికి ప్రాధాన్యమిస్తూ వాణిజ్య బంధాన్ని బలోపేతం చేసుకునేందుకు ట్రంప్ ప్రతిన బూనారని సంయుక్త ప్రకటన పేర్కొంది. అమెరికా నుంచి అదనంగా ఆరు పి-8 దీర్ఘశ్రేణి సముద్ర నిఘా విమానాల కొనుగోలు చేయాలనే భారత ప్రతిపాదనకు ఆమోదం లభించింది. బంగ్లాదేశ్‌కు సంబంధించి ట్రంప్ భారత్‌కు పూర్తి స్వేచ్ఛనివ్వడం అత్యంత కీలక పరిణామం. పాకిస్తాన్ తమ భూభాగం నుంచి సీమాంతర ఉగ్రవాదం కొనసాగకుండా అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని మోదీ- ట్రంప్‌లు ఉమ్మడి ప్రెస్‌మీట్‌లో కోరారు. ఉగ్రవాదంపై పోరులో తమదేశం రాజీలేని వైఖరిని అవలంబిస్తుందని ట్రంప్ స్పష్టం చేశారు. మోదీ పర్యటనలో జరిగిన మరో ముఖ్య పరిణామమేంటే, ప్రస్తుతం భారత్‌లో అమల్లో ఉన్న అణుశక్తి చట్టంలో మార్పులు తీసుకువచ్చే అవకాశాలున్నాయి. భారత ప్రభుత్వం ఈ దిశగా నిర్ణయం తీసుకోవాలన్న సంకల్పంతో ఉంది. 2008లో అమెరికాతో కుదిరిన పౌర అణు ఒప్పందం అమలుకు ప్రస్తుతం మనదేశంలోని ఈ చట్టం ప్రతిబంధకంగా మారింది. ఈ చట్టాన్ని ఎత్తేస్తే ప్రైవేటు కంపెనీలు అణు రియాక్టర్లను నెలకొల్పేందుకు వీలవుతుంది. అమెరికాకు చెందిన పలు ప్రైవేటు కంపెనీలు అప్పుడు ఇబ్బడి ముబ్బడిగా మనదేశంలో అణురియాక్టర్లను నెలకొల్పగలుగుతాయి. ఇక రెండు దేశాలు సంక్లిష్టమైన, ఉద్భవిస్తున్న సాంకేతిక పరిజ్ఞానం విషయంలో పరస్పరం సహకరించుకోవాలని నిర్ణయించాయి. ఇందులో భాగంగా ట్రాన్స్‌ఫరింగ్ ది రిలేషన్‌షిప్ యుటిలైజింగ్ టెక్నాలజీ (ట్రస్ట్)ను ప్రకటించారు. దీని కింద కృత్రిమమేధ, సెమికండక్టర్లు, డేటాసెంటర్లు, క్వాంటమ్ కంప్యూటింగ్‌పై ప్రధానంగా దృష్టి కేంద్రీకరిస్తారు.

**వెల్లివిరిసిన స్నేహం**

శ్వేతసౌధంలో మోదీ-ట్రంప్‌ల మధ్య పరస్పర ఆలింగనాలు, షేక్‌హ్యాండ్‌లతో స్నేహపూరిత వాతావరణం వెల్లివిరిసింది. ట్రంప్ స్వయంగా రాసిన 'అవర్ జర్నీ టుగెదర్' పుస్తకాన్ని మోదీకి బహూకరించారు. ట్రంప్ తొలిసారి అమెరికా అధ్యక్షుడు అయినప్పుడు చోటుచేసుకున్న ప్రధాన ఘట్టాలతో కూడిన ఫోటో పుస్తకం ఇది. పుస్తకంపై 'మిస్టర్ ప్రైమ్ మినిస్టర్, యూ ఆర్ గ్రేట్' అని ట్రంప్ సంతకం చేశారు. ఫిబ్రవరి 10-12 తేదీల్లో క్షణం తీరుబడి లేకుండా సాగిన నరేంద్రమోదీ పర్యటన భారత్ పరంగా సత్ఫలితాలనిచ్చిందనే చెప్పాలి.




**జమలాపురపు విఠల్‌రావు**

సీనియర్ జర్నలిస్ట్

# సదాశి...
# సదా స్మ్ర...



తలచినదే తడవుగా వశమయ్యే భక్తసులభుడు సదాశివుడు. సత్య స్వరూపుడు. వినయమూర్తి. 'భక్తుడు శయనించి కీర్తిస్తే కూర్చుని వింటాడు. కూర్చొని ఆలపిస్తే నిలబడి వింటాడు. నిల్చుని గానం చేస్తే ఆనంద తాండవం చేస్తాడు' అని శంకర భగవత్పాదులు శివతత్త్వాన్ని ఆవిష్క రించారు. భగవానుడికి భక్తుల పట్ల అంత వినయ విధేయతలు ఉంటే, ఆయన దయాలబ్ధులు దైవం పట్ల మరెంత వినయశీలురు కావాలో.. అన్నది అంతరార్థంగా చెబుతారు. అచంచల భక్తితో శివనామస్మరణచేస్తే.. భవభయ బాధలన్నీ తొలగిపోతాయని శాస్త్రపురాణవాక్కు.'శివశివ శివ యనరాదా... భవభయ బాధలనణచుకోరాదా' అని త్యాగరాజ స్వామి అన్నారు.

ముక్కోటి దేవతలలో సనాతనుడు. భక్తవ శకరుడు. భోళాశంకరుడు. భవరోగాలు నయం చేసే వైద్యుడు. సమస్త చరాచర జగత్తుకు విశ్వ నాథుడు. 'సర్వం శివమయం జగత్'... అంతా శివస్వరూపమే అన్నారు. శివుడు అందరివాడు. బ్రహ్మ విష్ణు దేవేంద్రాది దేవతలే కాదు... హిరణ్యకశిపు రావణ, బాణాసుర, బ్రహ్మాసుర దానవ శ్రేష్ఠులు, వాలి వంటి వానర ప్రముఖులు, సమస్త రుషులు, ఆదిశంకరాచార్యుల వంటి జగద్గురువులు కన్నప్పలాంటి భక్తులు ఆయనను అర్చించి తరించిన వారే. క్షీరసాగర మథనవేళ లోక సంరక్షణార్థం హాలాహల స్వీకరణతో గరళకంఠుడిగా ప్రశస్తి పొందిన పరమశివుడిని వేదాలు మహాదేవుడు, మహేశుడు, దేవదేవుడు, అశుతోషుడు అని కీర్తించాయి.

పురాణాలే కాదు.. పురాతనమైన వేదాల కంటే ముందునుంచీ భారత ఉపఖండంలో శివారాధన ఉంది. మధ్యప్రదేశ్ లోలని భీమ్ భెట్కా గుహలలోని కుడ్యచిత్రాలను ఆ నాటి శివారాధనకు నిదర్శనంగా చెబుతారు. వేదవాఙ్మయం అయనను రుద్రుడిగా ప్రస్తుతించింది. రుగ్వేదంలో మొదటిసారిగా శివనామం కనిపిస్తుంది. త్రిమూర్తులు సృష్టి స్థితి లయ కారుకులని పురాణాలు చెబుతున్నా, ఆ మూడింటి కారకుడు శివుడేనని శైవ మతం పేర్కొంది.

**'శం నిత్యం సుఖమానందమికారః పురుషః స్మృతః వకారః శక్తిరమృతం మేలనం శివ ఉచ్యతే'**

శకార, ఇకార, వకారాలు కలయిక శివుడు. 'శ' అంటే నిత్యం, సుఖం, ఆనందం. 'ఇ'కారమంటే పరమ పురుషుడు. 'వ'కారమంటే అమృతపరమైన శక్తి అని అర్థం. అమృత సమానమైన పరమానంద సుఖాన్ని, దివ్యశక్తిని ప్రసా దించే పురుషుడిని శివుడు అని వ్యవహరిస్తారు. సంసారమనే రోగానికి శివనామం పరమౌషధం.



శివుడే సత్యం, శివం, సుందరం అని వర్ణించారు జ్ఞానులు. ఆయన సత్య స్వరూపుడు, మంగళకారుడు, సుందరరూపుడు,శుభకరుడు,కల్యాణ కారకుడు. ఆయనకు శంకరుడు, శంభుడు, త్రినేత్రుడు,రుద్రుడు, మహేశ్వరుడు, హరుడు, మహాదేవుడు,నటరాజు లాంటి సహస్రాధిక పేర్లున్నా, 'శివ' (శివయ్య) అనేది మహిమాన్వితం, భక్తకోటికి అత్యంత ప్రియమైనది. 'విద్యలు అన్నిటిలో వేదం గొప్పది. వేదాలన్నిటిలోనూ సంహితకాండలోని నమక చమక మంత్రాలతో కూడిన రుద్రం, అందులోనూ 'ఓం నమః శివాయ' అనే పంచాక్షరీ మిన్న. దానిని పలుకలేకపోతే అందులోని రెండక్షరాలు 'శివ' మరింత గొప్పది' అని శాస్త్ర వచనం. శివం అనే పదానికి మోక్షం, మంగళం, శుభం, శ్రేయస్సు, భద్రం,, కల్యాణం అనే అర్థాలు ఉన్నాయి.


***'మహాపాతక విచ్ఛింత్యై శివ ఇత్యక్షరద్వయం అలం నమస్క్రియా యుక్తోముక్తయే పరికల్పతే'...***

శివ అనే రెండక్షరాలు మహా పాతకాలను నాశనం చేయగల సామర్థం కలిగినవి. శివ శబ్దానికి 'నమః' (నమః అంటే త్యాగం, ప్రణతి, శరణాగతి, సనాతం వంటి అర్థాలు ఉన్నాయి) అని జోడించి ఉచ్చరిస్తే అది మోక్షాన్ని ప్రసాదిస్తుంది. 'నమః శివాయ' ప్రాణ పంచాక్షరీగా రుద్రాధ్యయం అభివర్ణించింది. పంచాక్షరి లోని బీజాక్షరాలను పంచభూతాలకు ప్రతీకలుగా చెబుతారు. మనసు, వాక్కు కర్మ,బుద్ధి, చైతన్యాలకు ఇవి సంకేతాలు. నాదం, మంత్రం, శుభం, వాక్కు యజ్ఞాల మేలుకలయిక శివపంచాక్షరీ వైభవం.

***'మాఘకృష్ణ చతుర్దాశ్యామాదిదేవో మహానిశి శివలింగ త్వయోద్భూతః కోటి సూర్య సమప్రభః తత్కాలవ్యాపినీ గ్రాహ్యా శివరాత్రివ్రతేతిథిః'...***

మాఘ కృష్ణ చతుర్దశి నాటి నిశిరాత్రి సమయంలో ఆదిదేవుడు శివుడు కోటి సూర్యులతో సమానమైన కాంతితో లింగ స్వరూపంగా ఆవిర్భవించాడు. ఆ రాత్రి (మహా శివరాత్రి) పరమశివునికి ఎంతో ప్రధానమైన పర్వదినం. ఈ పర్వదినాన్ని శివపురాణం 'శివధర్మవృద్ధి కాలం' అని అభివర్ణించింది. శివ నామస్మరణ, మంత్ర జపం, అర్చన,అభిషేకం, సంకీర్తన, ధ్యానం, శివలీలా కథా శ్రవణం, భస్మ రుద్రాక్షధారణ 'శివధర్మాలు'గా ప్రతీతి. వీటిలో ఏ ఒక్కటి పాటించినా అత్యధిక ఫలితం ప్రాప్తి స్తుందని పూర్వ గాథలు వెల్లడిస్తున్నాయి.

దక్షిణాన రామేశ్వం నుంచి ఉత్తరాన కేదారేశ్వరం, పంచారామాలు, జ్యోతిర్లింగాలు, ఆసేతు హిమాచలం శైవాలయాలు శిమనామ స్మరణతో మార్మోగుతాయి. ధార్మికజాగరణతో భక్తలోకం పునీతమవుతుంది. ఆనాటి రాత్రి ఉపవసించడవల్ల రజోగుణం, జాగరణ వల్ల తమోగుణం, పూజతో సత్వగుణం పెరుగుతాయి.



# ...శా...!
# ...రాధిష...!!

మహాశివరాత్రి నాడు అహోరాత్రాలు ఉపవాసం ఉండి, ఇంద్రియాలను అదుపులో ఉంచుకొని, పార్వతీపతిని త్రికరణ శుద్ధిగా ఆరాధిస్తే శివలోక ప్రాప్తి తథ్యం అంటారు. 'ఉపవాసం' అంటే నిరాహారం కాదు. 'ఉప' అంటే సమీపం, దగ్గర. 'వాసం' అంటే నివసించడం, ఉండడం. అంటే మన మనసును, బుద్ధిని ఈశ్వరుని సమీపంగా ఉంచడం. ఆయనకు అర్పించడం. భగవంతుడిని నిరంతరం మనసులో నిలుపుకోవడమే 'ఉపవాసం'.

నిత్య, పక్ష, మాస శివరాత్రి అని మూడు పర్వదినాలు ఉన్నా మహాశివరాత్రికి మరింత విశిష్టత ఉందని శాస్త్రాలు చెబుతున్నాయి. 'శివప్రియాతు దుపాసానార్థా రాత్రి శివరాత్రి' (శివునికి ప్రియమైన, శివారాధనకు ఉత్కృష్టమైన రాత్రే శివరాత్రి) అని స్కంద పురాణం పేర్కొంటోంది.

***'శివరాత్రి మహోరాత్రం నిరాహారో జితేంద్రియః***
***అర్చయేద్వా యథాన్యాయం యథాబలమ పంచకః***
***యత్ఫలం మహాపూజయాం వర్షమేక నిరంతరం***
***తత్ఫలం లభతే సద్యః శివరాత్రౌ మదర్చనాత్'...***

ఇంద్రియనిగ్రహాన్ని పాటిస్తూ, శివరాత్రి నాడు ఉపవాదదీక్షతో శివలింగాన్ని పూజిస్తే.. పరమేశ్వరుడిని ఏడాది పాటు పూజించినంత ఫలితం కలుగుతుందని ఆర్యోక్తి.

విష్ణువు అలంకారప్రియుడు కాగా శివుడు అభిషేకప్రియుడు. అభిషేకం అంటే శివలింగంపై పాలు, నీళ్లు పోయడం అని సాధారణ భావన. 'మన మనసును యోగంతో లగ్నం చేయడమే నిజమైన అభిషేకం' అంటారు పెద్దలు. అంటే సర్వ సమర్పణ అని అర్థం. 'నీ దయతో సిద్ధించిన ఈ జన్మను చరితార్థం చేసుకునేందుకు యత్నించే దాసాను దాసుడను' అనే భావనతో తనను తాను అంకితం చేసుకోవడం, శరణాగతి కోరడం. చెంబుడు శుద్ధోదకాన్ని లింగాకృతిపై పోసి, చిడికెడు భస్మాన్ని చల్లే సామాన్యులను, మహన్యాసపూర్వక నమక చమకాదులతో ఏకాదశ రుద్రాభిషేకాలు, పంచామృతాభిషేకాలు నిర్వహించే అసామాన్యులను ఏకరీతిన కరుణిస్తాడని విశ్వాసం. నిజానికి.. జ్ఞానం, విచక్షణతో ఆలోచించడమే 'అభిషేకం' అని చెబుతారు. ఆత్మను పరమాత్మతో అనుసంధానించినపుడు ఆత్మప్రక్షాళన జరుగుతుంది.

భక్తజన సులభుడు శివుడు భక్తుల ఉపాసన సౌలభ్యం నిమిత్తం లింగరూపంలో ఆవిర్భవించాడని, ఆ రూపంలో నిర్గుణ స్వభావాన్ని లోకానికి అందించాడని పురాణవాక్కు. నిరాకారుడైన ఆయన తనకు తాను రూపాన్ని సృష్టించుకొన్నాడు. మరో కథనం ప్రకారం, తమలో ఎవరు అధికులమని బ్రహ్మ,విష్ణువుల మధ్య ఒకసారి వాగ్వాదం చోటుచేసుకొని, వాదన ముదిరి ప్రళయానికి దారితీసింది. ఈశ్వరుడు తేజోమూర్తిగా వారిద్దరి మధ్య ఉద్భవించి జ్ఞానోపదేశం చేశారు.

***'శివేతి చ శివం యస్యవాచిప్రవర్తతే***
***కోటి జన్మార్జితం పాపం తస్యం నశ్యతి నిశ్చితమ్'..***


మంగళప్రదమైన శివనామాన్ని నిత్యం స్మరించే వారి సమస్త పాపాలు హరిస్తాయి. 'శివలింగాన్ని ఒక్కసారైనా పూజించిన వాడు అనేక కల్పాల వరకూ స్వర్గసుఖాలననుభవిస్తాడు. శివలింగార్చన వల్ల మానవులు పుత్ర, మిత్ర, కళత్ర, శ్రేష్ఠత్వ, జ్ఞానముక్తులను పొందగలుగుతారు. శివ నామోచ్చరణతో దేహాన్ని త్యజించేవారు అనేక జన్మల పాపాల నుంచి మోక్షం పొందుతారు' అని శ్రీకృష్ణభగవానుడు శంకరునితో అన్నట్లు బ్రహ్మవైవర్త పురాణం చెబుతోంది.

పరమేశ్వరుడు భక్తుల హృదయ దీపమై వెలిగే పరంజ్యోతి అని జగద్గురువు ఆదిశంకరులు స్తుతించారు. సర్వం దుఃఖమైన భౌతిక ప్రపంచంలో ముక్తి ఒక్కటే శాశ్వత ఆనందమని; భక్తి, ప్రపత్తి, శరణాగతి అనే మూడు మార్గాలను ప్రతిపాదించారు. శివాశ్రయం ద్వారానే ముక్తి సులభ సాధ్యమంటూ, ముక్తి మార్గానికి భక్తికి మించిన సాధనం లేదని విశ్వసించారు.

సామీప్య, సారూప్య, సాయుజ్యంతో శంకర కరుణకు పాత్రులు కావచ్చని 'శివానంద లహరి'లో పేర్కొన్నారు. సకల దేవతా పూజా విధానాలను, స్తోత్రాలను లోకానికి అందించిన శంకరభగవత్పాదులు 'మానస పూజ'కు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. సర్వం శివమయం అనే ఎరుకే 'మానస పూజ'. అంతటా అవరించి ఉన్నపూర్ణత్వానికి శివత్వం అని పేరు. అది అనంతం. శివస్తోత్రం వేదసారం. శివుడి త్రినేత్రాలను సూర్య చంద్రులు, అగ్నిగావర్ణిస్తారు. ప్రకృతి పురుషులు అభేదమని చెప్పేందుకే శివుడు అర్ధనారీశ్వరుడు అయ్యాడు. యోగ విద్యను మొదట పార్వతికి బోధించి స్త్రీలకు బ్రహ్మ విద్యోపదేశానికి మార్గదర్శి అయ్యాడు. యోగ సంప్రదాయంలో ఆయనను దేవుడిగా కంటే ఆదిగురువుగా అర్చిస్తారు.

లోక శ్రేయస్సుకోసం కష్టాలను ఇష్టంగా భరించడం, ఆనందంగా స్వీకరించడం శంకర తత్వం. క్షీరసాగర మథనవేళ ఆవిర్భవించిన హాలాహలాన్ని గరళంలో నిలపడమే అందుకు ప్రథమోదాహరణ.

విషయ వాంఛలను త్యజించి అతి సామాన్య జీవితాన్ని గడిపే మహనీయుడు. ఎంతో శాంతమూర్తో.. అంత ఉగ్రప్రకృతి కలవాడు. ఆయన కోపాగ్ని జ్వాలలు, త్రినేత్ర విశిఖ జ్వాలాల్లో లోకాన్నే దహించే శక్తి ఉంది. అయినా దానిని వృథా చేయని భక్తులపాలిట కొంగు బంగారం... కల్పవృక్షం. వేల సంవత్సరాలుగా శివరాత్రిని జరుపుకుంటూ, ఉపవాసాలు చేస్తూ, జాగరణ ఉంటూనే ఉన్నారు. ఆదిదేవుని అర్చిస్తున్న వారిలో ఆయనలా పరోపకార మనస్తత్వం ఎంత? అన్నది విజ్ఞుల ప్రశ్న. పరమ శివుడిని పూజిస్తేనే చాలదని,ఆయన లక్షణాలు స్ఫూర్తిగా సమాజం శక్తిమంతం కావడానికి పాటు పడాలని ఆచార్యులు సందేశమిస్తున్నారు.




**డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి**
**సీనియర్ జర్నలిస్ట్**

**తరిగొండ వెంగమాంబ, బండారు అచ్చమాంబ; కుప్పాంబిక, రంగాజమ్మ; కోడూరి లీలావతి, సారస్వత, కళారంగాల మహిళామణులు. భాష, సంస్కృతి, సృజన రీతులతో తమదైన ముద్రను కనబరచిన వనితాలోక సుప్రసిద్ధులు. వారి ప్రతిభా వారసత్వాన్ని సొంతం చేసుకున్న ప్రభామూర్తులకు పురస్కార ప్రదానోత్సవం భాగ్యనగరం వేదికగా ఏర్పాటైంది. తెలుగునాట భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో విఖ్యాత సంస్థలు అక్షరయాన్, సీతాన్, అభిజ్ఞ భారత్... ఉమ్మడి నిర్వహణం, జాతీయ సదస్సులో భాగంగా మార్చి తొలివారంలోని ఈ సాహిత్య మహోత్సవ సందర్భం ప్రకాశ వికాసాలమయం. ఇదే నేపథ్యంలో...**



తరిగొండ వెంగమాంబ

# వారసత

తిరుమలేశుని మహాభక్తురాలు తరిగొండ వెంగమాంబ. ఊరిపేరే ఇంటి పేరు. వేంకటాచల మహాత్మ్యం, ద్విపద భాగవతం; వాటితోపాటు అష్టాంగ యోగసారం, రాజయోగామృతసారం, వాశిష్ఠ రామాయణం, రమా పరిణయం, శ్రీకృష్ణ మంజరి, శివలీలా విలాసం, నృసింహ విలాసం, ముక్తికాంతా విలాసం ఇలా అనేకానేక రచనలు.

విలక్షణ రీతిన – జలక్రీడా విలాసం; చెంచు నాటకం, రుక్మిణీ నాటకం, గోపీనాటకం, బాలకృష్ణ నాటకం; విష్ణు పారిజాతం; వీటన్నింటితోపాటు తరిగొండ నృసింహ శతకం. తత్వ కీర్తనలైతే అనేకం.

**ఆచార్యుల చెంత నేను చదవలేదు**
**ఛందస్సులో పద్యములనైన నేర్వలేదు**
**కావ్య నాటకాలంకార శాస్త్రములైన వినగలేదు**
**పూర్వేతిహాసములను శోధించి చూడలేదు**
**అయినా... నారసింహ దేవుడు ఆనతిచ్చిన తీరున**
**నిమిత్త మాత్రమున పలుకుదును** – అన్నప్పటికీ వెంగమాంబాది తళుకులొలుకు పలుకు. అధ్యయన సామర్థ్యం, పద్యగ్రహణ ప్రావీణ్యం, శాస్త్ర సూక్ష్మాదుల పరిశీలనం, అపార పరిశోధక దృక్పథం – ఆమెవి.

తనది బాలభాషగా చెప్పినా ఆబాలగోపాలాన్నీ ఆకట్టుకున్న భాష. ఆమె వినయశీలత అనితర సాధ్యం. పరమ గంభీర అంశాలను సైతం లలిత పదజాలంతో విపులీకరించారు. యోగతత్వ చింతనతో స్ఫూర్తిప్రదాయకురాలయ్యారు. పరిజ్ఞానాత్మక యోగభక్తి తత్పరతకు అసలైన ప్రతీక ఆమే!

ఒక్క సాహిత్యంతోనే కాదు – సంగీత నిపుణతలోనూ మిన్న. ఆరగింపు, సింగారపు, మంగళహారతి గీత రచనల్లో దిట్ట.

వేంకటేశ, కృష్ణతత్వాల సమరస మేళవింపు మరొక ప్రత్యేకత. ఎంతటి విభిన్న రచనాశైలి అంటే....

**'శ్రీ వేంకటేశ! నా చిత్తంబునందు/ నీ పాదయుగళంబు నిల్వవేకృష్ణ/ నన్నేల తరిగొండ నరహరాకృతిని / బ్రత్యక్షమైనను చాలింపు కృష్ణ'** అనేంతగా.

మరింత విశేష అంశం ఏమిటంటే – ఆ మేలిమి కవయిత్రి తల్లిదండ్రుల పేర్లు మంగమాంబ, కృష్ణయామాత్య. గురుదేవులు సుబ్రహ్మణ్య దీక్షితులు.

భర్త పేరు వేంకటాచలప్ప. వెంగమాంబ తిరుమల ప్రాంతంలోని తుంబుర కోన దగ్గర యోగాభ్యాసం నిర్వర్తించారు. భక్తి, వేదాంతాలే శ్వాసగా జీవనయానం సాగించారు.


పురాణ అధ్యయనంలో తనకు తానే సాటి. పద్మావతీ శ్రీనివాసుల కల్యాణ శోభను 'వేంకటాచల మహాత్మ్యం'లో దీటుగా అభివర్ణించారు. ద్విపద రచనలతో అసాధారణ శక్తియుక్తులను ప్రత్యక్షం చేశారు.

ఎన్నెన్నో తేట తెలుగు పదాల గుబాళింపు. పాత్రోచిత భాషను వినియోగించి సహజ సుందరత్వాన్ని చాటి చెప్పారు. ఆమెదంతా మధురభక్తి సంప్రదాయ సమాచరణ. యక్షగానాల నిర్మాణ నిర్వహణల్లో అగ్రస్థాయి. తనదంతా దైవప్రేరణగా ప్రకటించారు.

బ్రహ్మోత్సవాల వేళలో తాను హారతి ఇస్తేనే, గీతాన్ని ఆలాపిస్తేనే సేవ. వాడుక క్రమంలో అది 'ముత్యాల హారతి.' భక్త పారిజాతం అంటే ఆ అతివే!

భండారు అచ్చమాంబ అనగానే పలు కథలు, వ్యాసాలు మన ముందుకొస్తాయి. స్త్రీ విద్య కోసం ఆమె స్థాపించిన బృందావన సమాజం తలపులోకి వస్తుంది. విలక్షణత ఏమిటంటే – ఆమే 'స్త్రీ విద్య' పేరిట రచన చేశారు. వనిత విద్యావంతురాలైతేనే ఇల్లు, కుటుంబం, సమాజం వర్ధిల్లుతాయని విశదపరిచారు. స్త్రీ శక్తిని ఉద్దేశించి – అబలా సచ్చరిత్ర రత్నమాల పుస్తకాన్ని వెలయించారు. ఈ





కుప్పాంబిక          బండారు అచ్చమాంబ

# ్వానికి పురస్కారం

గ్రంథ అంశాలే కందుకూరి వీరేశలింగం పత్రికలో వెలువడ్డాయి. ఆయనకు కృతజ్ఞతా పూర్వక వందనాలందించిన ఆమె **'అల్పబుద్ధి నైన...'** అంటూ తనను తాను అనుకోవడం వినయశీలతకు పతాక. అనల్ప బుద్ధిశాలి అచ్చమాంబ.

ఆ కార్యశీలి స్ఫూర్తితోనే మన దేశంలోని వివిధ రాష్ట్రాల్లో మహిళలే పత్రికలు నడిపారు. తెలుగు నేలన 'మహిళా కళాబోధిని' కావ్యం రచించారు పులుగుర్తి లక్ష్మీనరసమాంబ.

స్త్రీలలోనే అత్యంత ధైర్యవంతులున్నారు. విద్యా ప్రవీణులనేకులు ఉన్నారు . నిర్వహణ దక్షతలోనూ వారే పేరెన్నికగన్నవారు. ఈ వాస్తవాలనే ఎలుగెత్తి చాటిన అచ్చమాంబ ధీశాలి.

**'సహస్రాధిక సంవత్సరాల నుంచీ ఇప్పటిదాకా'** అంటూ ఇతిహాస కాలానికి నిర్వచనం ఇచ్చారామె. ప్రాచీన మొదలు అర్వాచీన దశవరకు పలువురు ఉత్తమ ముదితల జీవిత కథలను చరిత్రగా వెలువరించారు. నాటి పురాణ స్త్రీ పాత్రలను, ఇతర దేశాలలోని మహిళా నేతల చరితలనూ అక్షర రూపానికి తెచ్చారు. తన రచనలెన్నింటినో ముద్రించిన అలనాటి పత్రిక పేరు 'హిందూ సుందరి' సంఘ సంస్కరణ రంగాన ముందు వరసన ఉండేది.

ఆ రోజుల్లోనే భారత స్వాతంత్ర్య ఉద్యమాన కీలకపాత్ర వహించిన ధీరమూర్తులెందరో! వారిలో కోడూరి లీలావతి ఉన్నారు. మహోద్ధృతంగా కొనసాగిన సహాయ నిరాకరణ ఉద్యమాన పాల్గొన్నారు. తండ్రి నుంచి పోరాట పటిమను పుణికి పుచ్చుకున్నారు. సరిసమానంగా కళాభిరుచినీ విస్తరిస్తూ వచ్చారు. కస్తూరిబా జీవిత విశేషాల పుస్తకం 'కుంకుమ రేఖ'కు పురస్కారం సాధించారు. ఆశాకిరణం అంటూ పిల్లల నవలను అప్పట్లోనే రచించారు. తన రచనలకు ప్రభుత్వ పురస్కారాలు అందుకున్నారు. భారత కోకిలగా పేరున్న సరోజినీ నాయుడు జీవిత చరిత్ర గ్రంథం 'ఇంద్ర ధనుస్సు'కు కూడా అవార్డు స్వీకరించారు.

మరింత విలక్షణత – 'జయవిపంచి' పేరుతో లీలావతి రాసిన చారిత్రక నవల. ఉదయరేఖ పత్రికకు సంపాదకురాలిగా ఉండేవారు. కళారంగపరంగా గృహలక్ష్మి బిరుదంతోపాటు స్వర్ణపతకం విజేత. కవయిత్రీమణిగా ఘన సత్కారం పొందారు. వాద్య సంగీత రీత్యా 'వీణా విశారద' అయ్యారు. సాహిత్య అకాడమీ, సంగీత నాటక అకాడమీ, బాలల అకాడమీకి పని చేశారు. రచయిత్రుల సలహామండలి ప్రతినిధిగానూ వ్యవహరించారు.

కవయిత్రిగా ప్రశస్తి సంతరించుకున్న కుప్పాంబిక తన రచనలన్నింటిలోనూ వర్ణనకే అధిక ప్రాధాన్యమిచ్చారు. మొదట్లో తెలుగు రామాయణ కర్తగా ఉన్న కవికి ఆత్మీయ. ఆమె పద్యాలు కొన్ని ఇతరత్రా సంకలన గ్రంథంలో కనిపిస్తున్నాయి. వీరపుత్రిగా, వీరపత్నిగా యశస్సు గడించిన ముదిత. వివరాలను శాసనాలు వెలువరిస్తున్నాయి. రచయిత్రిగా, పాలనారంగ దక్షురాలిగా పటిమను కనబరచిన ధీరోదాత్త.


బుద్ధపురం గ్రామంలో శివాలయాన్ని నిర్మించిన ఘనత కుప్పాంబికకు ఉంది. ఆధ్యాత్మికతకు తోడు సమకాలీన జన జీవన స్థితిగతులను అక్షరీకరించిన జాగృతశీలి. పుట్టినింటికీ మెట్టినింటికీ కీర్తి తెచ్చిన కార్యనిర్వాహకురాలు. సాహిత్య, నిజ జీవితాల్లో సాహసోపేత. మంగమాంబ, వెంకటాద్రి దంపతుల తనయ రంగాజమ్మ. పసుపులేటి నామధేయ. విజయ రాఘవ నాయకుని ఆస్థానాన కవయిత్రి. 'మన్నారు దాసవిలాసము' కావ్యకర్త. అనేక యక్షగానాలను అక్షర రూపానికి తెచ్చిన ప్రయోగశీలి. ఆమె రచనల్లో కొన్నింటిని సాహిత్యపరిషత్తు మునుపే ప్రచురించింది.

రామాయణ, భారత, భాగవత సంగ్రహాల పేరిట కావ్యరచనలు చేసిన రంగాజమ్మ విశిష్ట ఇతివృత్తంతో రూపుదిద్దిన మరొక కావ్యం 'ఉషాపరిణయం'. ఇందులోని కథన చాతురి ఎందరెందరినో ఆకట్టుకుంది.

రచనా వైదుష్యంతో వినుతికెక్కిన ఆమెకు సభాముఖంగా కనకాభిషేకం ఎంతైనా సగర్వ కారకం. అనంతర కాలంలో సైతం రచనలు ఎంత ఘనతర ప్రఖ్యాతి పొందాయో చెప్పనలవి కాదు.

రంగాజమ్మ యక్షగాన రచనలోని భరతవాక్య విన్యాసాన్ని పరిశీలిద్దాం. **'అని ఇవ్విధంబున రాజగోపాల కరుణాకటాక్ష వీక్షణానుక్షణ ప్రవర్ధమాన సార సారసత్వ ధురీణయు, విచిత్రతర పత్రికా శత లిఖిత వాచికార్థావగాహన ప్రవీణీయు, తత్ ప్రతి పత్రికాశత స్వహస్త లేఖన ప్రశః కీర్తియు, రసతరంగిత పద కవిత్వ మహనీయుమతి స్ఫూర్తియు, అతులితాష్ట భాషా కవితా సర్వం కష మనీషా విశేష శారదయును...'** ఈ విధంగా కొనసాగుతుంది ఆ రచనా. చమత్కృతి.

ఇంతటి వైవిధ్యం నిండిన రచనలను, రచయిత్రులను సంభావిస్తూ; ఆ కర్తల సారస్వత వారసత్వాన్ని గుర్తించి గౌరవిస్తూ, సంస్థలు చేపట్టిన పురస్కార పరంపర ఆశాజనక ఫలితాలకు నిండైన ఆసరా. నారీమతల్లుల పాండితీ ప్రకర్షను ఆధునిక తరాల ముందుకు తెస్తూ, వారసత్వ వనితా శక్తిని సత్కరించడమనేది తెలుగు వెలుగులను నలువైపులా ప్రసరింపచేస్తుంది. ప్రధానంగా వందలమంది రచయిత్రులు / కవయిత్రులతో 'అక్షరయాన్'గా రూపొందిన సంస్థ చేపట్టిన ఈ నూతన నిర్వహణ మాలిక నిస్సంశయంగా ఆశాదీపిక, జనప్రయోజక వేదికది!



**జంధ్యాల శరత్‌బాబు**
సీనియర్ జర్నలిస్ట్




పద్మ పురస్కారాలకు సంబంధించి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జనవరి 27న ఒక ప్రకటన చేసి ప్రకంపనలు సృష్టించారు. గణతంత్ర వేడుకలను పురస్కరించుకొని ఏటా కేంద్ర ప్రభుత్వం వివిధ రంగాలలో విశిష్ట సేవలను అందించిన ప్రముఖులకు పద్మ పురస్కారాలు ప్రకటించడం నెహ్రూ కాలం నుండి వస్తున్నది. ఈ సంవత్సరం తెలంగాణకు అన్యాయం జరిగిందని ముఖ్యమంత్రి ఆరోపణ. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉంది. తెలంగాణలో ప్రస్తుతం కాంగ్రెసు ప్రభుత్వం ఉన్నది. రాష్ట్రం సిఫారసు చేసిన గద్దర్, అందెశ్రీ, గోరటి వెంకన్న, చుక్కా రామయ్య, జయధీర్ తిరుమలరావు వంటివారు వామపక్ష భావజాలం కలవారు, కనుకనే వీరికి పురస్కారాలు తిరస్కరించారు అని పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ ఆరోపించారు. 'కరసేవకులను కాల్చి చంపిన ములాయం సింగ్‌కు పద్మ విభూషణ్ ఎలా ఇచ్చారు?' అని కూడా గౌడ్ ప్రశ్నించారు. బీజేపీ నాయకుడు బండి సంజయ్ వీటికి స్పందిస్తూ, 'గద్దర్ అర్బన్ నక్సల్ – బరాబర్ అతనికి అవార్డులు ఇవ్వం. అతని పేరు మీద అవార్డులు పెడితే తీసుకోం' అన్నారు. 'బీజేపీ, ఆర్ఎస్ఎస్ భావజాలం కలిగినవారికే కేంద్ర పురస్కారాలు ఇస్తారా?' అంటూ మహేశ్‌గౌడ్, గద్దర్ కుమార్తె వెన్నెల ప్రశ్నించడంతో ఈ వివాదం కాస్త ముదిరింది.


---


ఇంతకూ వాస్తవాలేమిటి? పద్మ పురస్కారాలు, సంగీత, నాటక, సాహిత్య అకాడమీ పురస్కారాలు గత అరవై సంవత్సరాలు కాంగ్రెసు పాలనలో కమ్యూనిస్టులే స్వాధీనం చేసుకున్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ కన్వీనర్‌గా మంజుశ్రీ ఉన్నప్పుడు కామ్రేడ్ కేతు విశ్వనాథ రెడ్డి, వోల్గా వంటి వారు ఆయనపై చేసిన దాడికి మంజుశ్రీ కంటతడి పెట్టుకున్నాడు. ప్రస్తుతం (2024–25) కేంద్రంలో అధికారంలో బీజేపీయే ఉన్నా పెనుగొండ లక్ష్మీనారాయణ అనే కామ్రేడ్ కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం పొందడం దేనిని సూచిస్తుంది? కాంగ్రెసు అధికారంలో ఉన్నప్పుడు అంబేద్కర్, పీవీల వంటివారికి భారతరత్న పురస్కారాలు రాలేదు. ఎందుకని? అంజలి, జమున, ఎస్.వి. రంగారావు, సావిత్రి, వాణిశ్రీ, సిఎస్ఆర్, జి.వరలక్ష్మి, ఎస్. వరలక్ష్మి, విజయనిర్మల వంటి అగ్రశ్రేణి నటీనటులను నిర్లక్ష్యానికి గురయ్యారు. ఇందిరాగాంధీ వంటివారు అధికారంలో ఉన్నప్పుడు సెల్ఫ్ గోల్ చేసుకొని భారతరత్నాలు పొందారు. నెహ్రూ తనను భారతరత్న అని ప్రకటించుకున్నాడు.

రాజకీయ లబ్ధికోసం ఎంజీఆర్‌కు భారతరత్న ఇచ్చారు. మహారాష్ట్ర మాకియవిల్లీ శరద్ పవార్‌కు బీజేపీ ప్రభుత్వమే పద్మ విభూషణ్ ఇచ్చింది. స్వతంత్ర వీరసావర్కర్ ముఖం కాంగ్రెసు, బీజేపీ కూడా చూడలేదు. టంగుటూరి ప్రకాశం, అల్లూరి సీతారామరాజు, స్వామి దయానంద, నేతాజీ సుభాష్ చంద్రబోస్ వంటి మహనీయులకు ఎవరూ భారతరత్న ఇవ్వలేదు. ఎందుకని? ఇండియాలో ఉన్నవారికి దిక్కులేదు. గద్దర్ మీద కాంగ్రెసుకు ప్రేమ ఉంటే తన పరిపాలనా కాలంలో ఎందుకు పురస్కారం ఇవ్వలేదు? ఇలాంటి యక్షప్రశ్నలు ఎన్నో! కర్ర ఉన్నవాడిదే బర్రె. కేంద్ర రాష్ట్ర పురస్కారాలలో నిజాయతీ ఎంత?

దేశంలో ప్రధానంగా మూడు భావజాలాలు కొనసాగుతున్నాయి. మొదటిది సావర్కర్ ప్రతిపాదించిన హిందూత్వ – రెండవది కమ్యూనిస్టుల రష్యా–చైనా నమూనా, మూడవది అధికారదాహంతో సెమిటిక్ మతాల సంతుష్టీకరణతో సాగే కాంగ్రెసు అవకాశవాద భావజాలం. ప్రస్తుతం కాంగ్రెసు ఉభయ కమ్యూనిస్టు పార్టీలు చతికిలపడ్డాయి. సావర్కర్, వివేకానంద, గోల్వాల్కర్ ప్రతిపాదించిన జాతీయవాదం బలపడింది. అందుకని చైనా తన అనుయాయులను వ్యూహాత్మకంగా అర్బన్ నక్సల్స్‌గా మారండి అని చెప్పింది. భారత హోంమంత్రి అమిత్ షా జంగిల్ టెర్రరిజాన్ని 2026 నాటికి నిర్మూలిస్తామని చెప్పారు. కాని రంగు మార్చుకున్న అర్బన్ టెర్రరిస్టు వ్యూహాన్ని కమలనాథులు పసికట్టలేకపోతున్నారు. పద్మ పురస్కారాల ఎంపిక – వివాదం సందర్భంగా ఈ సిద్ధాంత నేపథ్యాన్ని తప్పనిసరిగా అర్థం చేసుకోవాలి. నీరు లేకుండా చేప జీవించలేదు. అలాగే పురస్కారాలు లేకుండా కమ్యూనిస్టులు బ్రతకలేరు. రాష్ట్ర కేంద్ర పురస్కారాల కోసం వాళ్లు ఎంతకైనా దిగజారుతారు. ఎన్ని పాపాలైనా చేస్తారు. భారతదేశాన్ని సావర్కర్ భావజాలం పాలించాలా? మావో – జిగ్‌పింగ్ భావజాలం పాలించాలా? అనే సమస్య మీద ఈ పద్మపురస్కారాల వివాదం సాగుతున్నది. ప్రచార వ్యూహంలో బీజేపీ కన్నా కమ్యూనిస్టులు చాలా ముందంజలో ఉన్నారు.

నెహ్రూ యుగంలో వి.కె. కృష్ణమీనన్, ఇందిరమ్మ యుగంలో మణిశంకర్ అయ్యర్, సోనియమ్మ కాలంలో పి. చిదంబరం, రాహుల్ గాంధీ యుగంలో కన్హయ్య కుమార్ వంటి అర్బన్ నక్సల్స్ కీలక భూమిక పోషించారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక కమ్యూనిస్టులు తృణమూల్ కాంగ్రెస్ అవతారం ఎత్తారు. తమిళనాడుతో డిఎంకెతో పొత్తు పెట్టుకున్నారు. తెలంగాణలో కేసీఆర్ చంకలో దూరారు. ఇలా ప్రాంతీయ పార్టీలను చైనా తన





## ఎర్రదండు పురస్కారోన్మాదం

పైరవీలు చేసి జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు సంపాదించిన దేశద్రోహులు ఎలాంటి భాష ఉపయోగిస్తారో కొన్ని ఉదాహరణలు చూడండి:

“గద్దరు అవార్డు ఎందుకు? గద్దర్ అనే పేరే ఒక అవార్డు”

–టి.వి.–10 యాంకర్.

“నరేంద్ర మోడీ మూర్ఖుడు”

– అమర్త్యసేన్ – 1999 భారతరత్న, నోబుల్ బహుమతి గ్రహీత,

“మోదీ అధికారంలోకి వస్తే నేను భారతదేశం వదిలిపెట్టి వెళ్తాను” – యు.ఆర్. అనంతమూర్తి (కర్ణాటక) జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత.

“ఇండియా హిందువులకు చెందదు. ఇదొక బహుళజాతి సమ్మేళనం” – వల్లంపాటి వెంకట సుబ్బయ్య, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత.

భారతమాతను బూతులు తిట్టిన దిగంబర కవులకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. భారత జాతీయవాదాన్ని తిరస్కరించిన మహాశ్వేతాదేవి (బెంగాల్)కు జ్ఞానపీఠ పురస్కారం ఇప్పించారు. సుమారు 20 ఏళ్ల నాటి మాట: కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షునిగా ఒక జాతీయవాది నారంగ్ ఎంపిక అయినాడు. అతనిని గద్దె దింపేవరకు రచయిత్రి మహాశ్వేతా నిద్రపోలేదు. ఇలాంటి సంఘటనలు ఎన్నో జరిగాయి.

# ప్రపంచమొక ‘పద్మ’వ్యూహం

జేబులో వేసుకొని ఫెడరలిజం పేరుతో కేంద్రంపై యుద్ధం ప్రకటించింది. ఈ వ్యూహాన్ని సంఘ పరివార్ ఎంత వరకు పసికట్టిందో తెలియదు. మనకు వ్యక్తి నిర్మాణమే ముఖ్యం, ప్రచారాలు, పురస్కారాలు ఎందుకు? అని ఆర్ఎస్ఎస్ తన కార్యకర్తలకు చెబుతున్నది. ఇక్కడే ఒకటి ఆలోచించాలి. మరి జాతీయవాద కవుల కలాలు, గళాలు ఎందుకు మూగపోయాయి? వీరేమో వన భోజనాలకు, కవన భోజనాలకు పరిమితమైనారు. అటు ఉగ్రవాదులు మోహన్ భాగవత్‌ను, సావర్కర్‌ను తిడుతూ ఇవ్వాళ పత్రికా ప్రకటనలు చేశారు.

మొన్న జితేందర్ రెడ్డి అనే సినిమా వచ్చింది. మల్లారెడ్డి గారి కుమారుడు జితేందర్ దేశభక్తుడు. ఉగ్రవాదులు కాల్చి చంపారు. ఈ టెర్రరిస్టులకు స్ఫూర్తి గద్దర్. తన ఆటతో పాటతో అడవి అన్నలను ఉద్రేకపరిచాడు. అలాంటి గద్దర్ పేరు మీద కాంగ్రెసు ప్రభుత్వం అవార్డులు ఇస్తున్నది. ఇందులో ఔచిత్యం ఎంత? అని ఎవరూ ఆలోచించడం లేదు. ఎన్.టి. రామారావుకు భారతరత్న ఎందుకు ఇవ్వలేదు? ఆధ్యాత్మిక రంగంలో సామవేదం షణ్ముఖశర్మ, కమలానంద భారతీ, పరిపూర్ణానంద స్వామిలకు గుర్తింపును కేంద్రం ఎందుకు ఇవ్వలేదు? ఇంగ్లీషు జర్నలిజంలో రిపబ్లిక్ ఛానల్ అర్ణబ్ గోస్వామి, నావికా చేస్తున్న సేవ అనితర సాధ్యం.


కేంద్రం కూడా కొన్ని అంశాలు పరిగణనలోనికి తీసుకోవాలి. మేధావి వర్గానికి చెందిన రాజీవ్ మల్హోత్రా, సుబ్రహ్మణ్యస్వామి, గురుమూర్తి (తమిళనాడు) పద్మశ్రీ పురస్కారానికి అర్హులు కారా? 85 ఏళ్ల వయసులో ఈ వ్యాసకర్త 152 పుస్తకాలు రచించి, ప్రచురించాడు. కాంగ్రెసు, కమ్యూనిస్టులకు నేనంటే కోపం. మరి బీజేపీ వారు ఈ విషయం దృష్టిలో ఉంచుకోవలసి ఉంటుంది కదా! అది జరుగలేదు. ఎందుకని?

స్వాతంత్ర్యం వచ్చినప్పటినుండి వామపక్షీయులు చిత్రరంగాన్ని స్వాధీనం చేసుకొని పురస్కారాలు ఇప్పించుకున్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చినా ఈ ధోరణిని ఆపలేకపోయింది. హైదరాబాదు దీప్తి శ్రీనగర్ జి.సత్యవాణి అనే ఆధ్యాత్మిక సాధ్వి ఉంది. ఆమె చేస్తున్న సేవలను ఇటు రాష్ట్ర ప్రభుత్వమూ, అటు కేంద్రప్రభుత్వమూ గుర్తించలేదు. కోటి దీపోత్సవాన్ని ఒక ఉద్యమంలాగా నిర్వహిస్తున్న భక్తి చానల్ అధిపతి నరేంద్ర చౌదరి పేరు ఎవరూ రికమండ్ చేయలేదా? వరంగల్ చేతనావర్త కవి కోవెల సుప్రసన్నాచార్య పురస్కారానికి యోగ్యుడు కాడా? నేడు అగ్రశ్రేణి ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు పేరు ఢిల్లీకి వెళ్లలేదా? ఎందుకని?

మహాత్మా గాంధీని పంది అని తిట్టిన ఋత్విక్ ఘటక్ అనేవాడికి బెంగాల్లో జ్యోతిబసు పద్మశ్రీ ఇప్పించి సత్కరించడం దుర్మార్గం కాదా? “నేను తెలుగు దేశం పార్టీ సపోర్టర్ను అనే కారణంతో నాకు పద్మశ్రీ ఇవ్వవద్దు అని కాంగ్రెసు వారు అన్నారు” ఇది కైకాల సత్యనారాయణ అనే అగ్రశ్రేణి ఫిలిం నటుడు నా ముందే చేసిన ప్రకటన. ఇదంతా దేనిని తెలియజేస్తున్నది?

కేంద్ర రాష్ట్ర (ఉగాది) పురస్కారాల ఎంపికకు మీ మీ విధివిధానాలు, ప్రమాణాలు ఏమిటో పత్రికాముఖంగా ప్రకటించండి. రాష్ట్ర మంత్రివర్యులు శ్రీధరబాబు తండ్రి మహనీయుడు శ్రీపాదరావును హత్య చేసిన వారు గద్దర్ పాటలు విని స్ఫూర్తి పొందినవారే.

నూరు ఎలుకలు తిన్న పిల్లి హజ్ యాత్ర చేసింది అని ఉర్దూలో ఒక సామెత ఉంది. వందలాది భారత సైనికులను, శ్రీపాదరావు, హయగ్రీవాచారి వంటి కాంగ్రెసు నాయకులను చంపించినవారికి పద్మ పురస్కారాలు ఎందుకు ఇవ్వాలో గౌరవనీయ ముఖ్యమంత్రి గారు వివరణ ఇవ్వాలి. నేడు ఖద్దరు కప్పుకున్న గద్దర్ మీకు బుద్ధునిలా కన్పించడానికి కారణం ఏమిటి? అతని పేరు మీద నంది పురస్కారాలు ఇవ్వడమేమిటి?



**ప్రొ. ముదిగొండ శివప్రసాద్**

విశ్రాంత ఆచార్యుడు

# బాంగ్లాదేశ్‌లో హిందువులే లక్ష్యంగా దాడులు

భారతీయులకు గర్వకారణమైన చాణక్య రాజనీతి సూత్రాలు అన్ని కాలమాన పరిస్థితుల్లో అన్ని రంగాలకూ మార్గదర్శకంగా నిలుస్తాయ నడంలో అతిశయోక్తి లేదు. విదేశాలు, సరిహద్దు దేశాలతో వ్యవహరించా ల్సిన తీరుపై చాణక్య నీతిలో అమూల్యమైన పరిష్కారాలు ఉన్నాయి. శత్రు దేశాలను ఎలా దారిలోకి తెచ్చుకోవాలో సవివరంగా చెప్పారు. విదేశీ వ్యవహారాల్లో సంధి, విగ్రహ, ఆసన, యాన, సంశ్రయ, ద్వైధీభావ మొదలైన ఆరు అమూల్యమైన సూత్రాలను అనుసరించాలని చెప్పారు. ఈ ఆరు విధానాలను స్థూలంగా పరిశీలిస్తే మొదటి సంధి ప్రయత్నంగా సున్నితంగా వ్యవహరించాలి. దారిలోకి రాకపోతే మనకున్న శక్తిని చూపిస్తూ బలగాల వినియోగంతో శత్రుపక్షంలో భయం కల్పించి, వాతావరణాన్ని సానుకూలంగా మల్చుకోవాలి. మన పక్కలో బల్లెంలా తయారైన బాంగ్లాదేశ్ విషయంలో చాణక్యుడి మార్గం మనకు అనుసరణీయం, మార్గదర్శకం.



దశాబ్దాల తర్వాత భారతదేశం అన్ని రంగాల్లో బలపడుతూ అభివృద్ధి పథంలో సాగుతున్న వేళ పొరుగు దేశాలు అసూయతో తోక జాడిస్తున్నాయి. నిత్యం మనల్ని చికాకు పర్చాలని చూసే పాకిస్తాన్, చైనా దేశాలను నరేంద్ర మోదీ నేతృత్వంలోని భారత ప్రభుత్వం కట్టడి చేస్తుంటే, మతపిచ్చి ముదిరిన బాంగ్లాదేశ్ పిల్లిమొగ్గలేస్తోంది. పాకిస్తాన్ చేతిలో బానిసలుగా ఉన్న బాంగ్లాదేశీయులకు మన దేశ సైనికులు పోరాడి స్వరాజ్య భిక్ష పెడితే, ఇప్పుడు ఆ బాంగ్లాదేశ్ రెచ్చిపోతోంది. భారత్ లక్ష్యంగా పావులు కదుపుతోంది. పురోగతి సాధిస్తున్న భారత్‌ను చూసి కుళ్లుకుంటున్న పాకిస్తాన్ చేతిలో పావుగా మారిన ఆ దేశం, వారి దేశంలో మైనార్టీలైన హిందువులపై దాడులు చేస్తూ భారత్‌తో కయ్యానికి కాలుదువ్వుతోంది. అయినప్పటికీ మన దేశం ఎంతో సహనంతో వ్యవహరిస్తోంది. బాంగ్లాదేశ్‌లో 2024లో జరిగిన రాజకీయ ఉద్యమం ముసుగులో వ్యూహాత్మకంగా హిందువులపై, దేవాలయాలపై దాడులు జరిగాయని ఐక్యరాజ్య సమితి (ఐరాస) మానవ హక్కుల సంస్థ ఇటీవల ఒక నివేదికను బహిర్గతం చేసింది.

బాంగ్లాదేశ్‌లో 2024 జులై, ఆగస్టు మాసాల్లో రిజర్వేషన్ల అంశాన్ని ఒక సాకుగా తీసుకొని ఉద్యమం పేరుతో పెద్ద ఎత్తున అల్లర్లు జరిగాయి. దాంతో అప్పటి ప్రధాని షేక్ హసీనా దేశం విడిచివెళ్లాల్సి వచ్చింది. ఆమె భారత దేశానికి శరణార్థిగా వచ్చారు. ఆ దశలో ఉద్యమానికి మతం రంగు పులిమి ప్రధానంగా హిందువులను లక్ష్యంగా చేసుకొని మైనార్టీలపై దాడులు జరిగాయి. నియంతృత్వంగా పాలించిన షేక్ హసీనా పార్టీ అవామీలీగ్ మద్దతుదారులపై దాడులు జరిగాయని అప్పుడు ప్రపంచాన్ని నమ్మించాలని చూసినా, ప్రత్యేకంగా ఒక వర్గంపై దాడులు చేయడం వెనుక మత శక్తుల హస్తం ఉందనేది బహిరంగ రహస్యమే. అవామీలీగ్‌కు వ్యతిరేకంగా ఉద్యమం జరుపుతున్నట్టు రోడ్లపై వచ్చిన వారు ఉన్మాదుల్లా ప్రవర్తిస్తూ హిందువులతో పాటు బౌద్ధులు, క్రిస్టియన్లు, అహ్మదీయ ముస్లింలపై దాడులు చేశారని ఐరాస నివేదిక వెల్లడించింది.

ఐరాసకు చెందిన ఆఫీస్ ఆఫ్ ది హైకమిషనర్ ఫర్ హ్యూమన్ రైట్స్ (ఓహెచ్‌సీహెచ్‌ఆర్) నిజనిర్ధారణ కమిటీ బాంగ్లాదేశ్‌లో పర్యటించింది. ఓహెచ్‌సీ హెచ్‌ఆర్ హింసాత్మక ఘటనలపై వాస్తవాలను తెలుసుకోవడంలో భాగంగా బాంగ్లాదేశ్ తాత్కాలిక సారథి మహ్మద్ యూనస్‌ను సంప్రదించింది. ప్రభుత్వాధికారులు తప్పని పరిస్థితుల్లో కమిటీకి సహకరించారు. కమిటీ భద్రతా దళాలు, పోలీసులు, న్యాయవాదులు, మానవ హక్కుల సంఘాల ప్రతినిధులు, వ్యాపారస్తులు, మత పెద్దలు, బాధితులు ప్రత్యేకించి మహిళలు, పిల్లలతో ప్రత్యక్షంగా మాట్లాడింది. దాడులకు గురైన 34 మంది మైనార్టీ బాధితులను కమిటీ ఇంటర్వ్యూ చేసింది. ఓహెచ్‌సీ హెచ్‌ఆర్ 2025, ఫిబ్రవరి 12న అక్కడి వాస్తవాలను వెలుగులోకి తెచ్చేలా ఒక నివేదికను విడుదల చేసింది. భయంకరమైన వాస్తవాలను బహిర్గతం చేసింది.

ఉద్యమకారులు రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ప్రారంభించిన ఉద్యమంలో వ్యూహాత్మకంగా తొలుత మహిళలను, చిన్నారులను ముందుండి నడిపిం చారు. వారు షేక్ హసీనా పదవి నుండి తప్పుకున్నాక తమ నిజస్వరూపాన్ని బయటపెట్టారు. హసీనా ప్రభుత్వం కూలిపోవడంతో విజయోత్సవం పేరుతో అరాచకాలు సృష్టించారు. ఉద్యమంలో మొదటి నుండి ముందున్న మహిళలను, చిన్నారులను ఇబ్బందులకు గురిచేశారు. వారిని ఒక ప్రణాళికతో తప్పుకునేలా చేశారు. ఆ తర్వాత అల్లర్లు ప్రారంభించారు. అవామీలీగ్ నేతలపై దాడులు చేశారు. వారి ఆస్తులను దోచుకున్నారు. అవామీ లీగ్ సానుభూతి పరులు, మద్దతుదారులనే నెపంతో మైనార్టీలపై దాడులు చేశారు. బాంగ్లాదేశ్ నేషనల్ పార్టీ (బీఎన్‌పీ), జమాతే ఇస్లామీ, విద్యార్థి సంఘాలు, ఇతర గ్రూపులు ఉద్యమం ముసుగులో అల్లర్లు సృష్టించాయని ఓహెచ్‌సీ హెచ్‌ఆర్ విచారణలో వెల్లడైంది. ఈ దాడులు మతాలు, జాతుల పరంగా భిన్న సంస్కృతులతో కూడుకున్న బాంగ్లాదేశ్‌లో మత కలహాలు రేపి, మైనార్టీలను తరిమికొట్టడమే లక్ష్యంగా పాక్ ప్రేరణతో జరిగాయి. భారత్ సరిహద్దులో బెంగాలీ మాట్లాడే హిందువులతో పాటు ముస్లింలను కూడా వదలకుండా భయభ్రాంతులకు గురిచేశారు. 2024 ఆగస్టు 5, 15 తేదీల మధ్య జెస్సోర్, నోకాలి, పాటౌకాలి, నాటోర్, దినజ్‌పూర్, చాంద్‌పూర్, షరియత్‌పూర్, రంగ్‌పూర్, రాజ్‌షాహి, మీర్పూర్, కులానా, బర్గున, బరిసల్, రాజ్‌బరి, ఠాకూర్‌గావ్, ఫరిద్‌పూర్, నేత్రకోమ్ ప్రాంతాల్లో మైనార్టీలు లక్ష్యంగా దాడులు జరిగాయని ఓహెచ్‌సీహెచ్‌ఆర్ బృందానికి నేషనల్ సెక్యూరిటీ ఇంటెలిజెన్స్–ఎన్ఎస్ఐ తెలిపింది. ఈ దాడులలో ఇళ్లను, దుకాణాలను దోచుకున్నారు. వాటిని తగులబెట్టారు. మైనార్టీలపై భౌతిక దాడులకు ఒడిగట్టారు. వారిని బెదిరించి ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు. చిట్‌గావ్ హిల్‌ట్రాక్స్‌లో అహ్మదీయ ముస్లింలు లక్ష్యంగా దాడులు జరిగాయి. వారికి చెందిన 117 ఇళ్లను నాశనం చేశారు. ఈ దాడుల వెనుక బీఎన్‌పీ మద్దతుదారులున్నారని ఎన్ఎస్ఐ నివేదించినప్పటికీ ముష్కరులపై ఎలాంటి చర్యలు

తీసుకోలేదు.

హిందువులు లక్ష్యంగా అల్లరి మూకలు దేవాలయాలపైనే కాకుండా చివరికి హిందూ శ్మశానవాటికలపైన కూడా దాడులు చేశారు. వాటిని ఆక్రమించుకున్నారు. ఆ సమయంలో అక్కడి హిందువులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ కాలం గడిపారు. మతోన్మాదులు దాడులు చేస్తున్నప్పుడు విద్యుత్ సరఫరా ఆపివేశారు. ఘటనా స్థలాలకు రాకుండా పోలీసులను అడ్డుకున్నారు. నగదుతో పాటు నిత్యవసర వస్తువులను అందినకాడికి దోచుకున్నారు. విచక్షణ లేకుండా జరిగిన ఈ దాడులకు భారత సరిహద్దుల గ్రామాల్లోని హిందువులతో పాటు కొందరు బాంగ్లాదేశీయులు




కూడా బెదిరిపోయారు. దాదాపు 3 నుండి 4 వేల మంది శరణార్థులుగా భారత్‌లోకి రావాలని ప్రయత్నించారు. అయితే భారత్ సరిహద్దు బలంగం – బీఎస్ఎఫ్ వారిని అడ్డుకుందని ఓహెచ్‌సీహెచ్‌ఆర్ తన నివేదికలో వెల్లడించింది. బుర్షర్‌ది, హాటీబంధ్, లాల్‌మోనిరత్ ప్రాంతాల్లో ప్రముఖ హిందూ దేవాలయాలపై దాడులు జరిగినట్టు స్థానిక మీడియా నిజనిర్ధాణ కమిటీ దృష్టికి తెచ్చింది. దుండగులు బాంగ్లాదేశ్‌లో హిందువులకు అండదండగా ఉంటున్న ఇస్కాన్ సంస్థ లక్ష్యంగా మీర్పుర్‌లో ఇస్కాన్ దేవాలయంపై, నందిపూర్‌లో కాళీ దేవాలయంపై దాడి చేసి భయానక వాతావరణం సృష్టించారు. బీఎన్‌పీ బరితెగింపుతో హిందువులైన ప్రధానోపాధ్యాయులను, టీచర్లను బెదిరించింది. వారితో బలవంతంగా రాజీనామా చేయించింది. దీంతో మైనార్టీలు తక్కువగా ఉండే ప్రాంతాల్లో విధులు నిర్వహించడానికి హిందువులు భయపడుతు న్నారని ఓహెచ్‌సీహెచ్‌ఆర్ నివేదించింది. బాంగ్లాదేశ్ పోలీసుల 2024, ఆగస్టు 4, 20 తేదీల మధ్య 1,769 దాడులు జరిగాయని పేర్కొంటూ బాంగ్లాదేశ్ హిందు, బౌద్ధ, క్రిస్టియన్ యూనిటీ కౌన్సిల్ నుంచి ఫిర్యాదులు వచ్చాయని 2025, జనవరిలో ఒక నివేదికలో పేర్కొన్నారు. వీటికి సంబంధించి 1,234 ఫిర్యాదులు రాజకీయ నేపథ్యం కలిగినవని, 20 ఫిర్యాదులు మతపరమైనవని, మరో 161 తప్పుడు ఫిర్యాదులని పోలీసుల నివేదికలో ఉన్నట్టు ఓహెచ్‌సీహెచ్‌ఆర్ తెలిపింది. పోలీసులు తెలిపిన వివరాల సంఖ్యే ఇంతుంటే వాస్తవాలు అధికంగా ఉండడం ఖాయం. బాంగ్లాదేశ్‌లో 16 రోజుల వ్యవధిలో హిందువులపై రెండు వేలకుపైగా దాడులు జరిగితే, అందులో 157 కుటుంబాలు, 69కు పైగా దేవాలయాలు ఉన్నాయని ఇతర నివేదికలు గతంలోనే చెప్పాయి. అంటే బాంగ్లాదేశ్ పోలీసుల ఘటనలను తక్కువగా చూపిస్తూ తయారు చేసిన నివేదికలను ఓహెచ్‌సీహెచ్‌ఆర్ ముందుంచిందని తెలుస్తోంది.

బాంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు జరగడం ఇది మొదటిసారి కాదు. భారత పక్షపాతిగా ఉంటారని ప్రచారం జరుగుతున్న షేక్ హసీనా పాలనలో కూడా దాడులు జరుగుతూనే ఉండేవి. అక్కడ పాలకులుగా ఎవరున్నా భారత్‌తో పొందే ప్రయోజనాలపైనే దృష్టి పెడతారు కానీ, హిందువుల రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోరు. బాంగ్లాదేశ్‌లో హిందువులపై, భారత్‌పై అక్కసు కనిపిస్తూనే ఉంటుంది. "మిమ్మల్ని మీరు మైనార్టీలుగా ఎందుకు అనుకుంటారు? ఐనా అసలు మైనార్టీ, మెజార్టీ అంటూ ఏమి ఉండదు. కులం, మతం అనే తేడా లేకుండా అందరినీ సమానంగా చూస్తాం" అని ఒకప్పుడు హసీనా అన్నారు. అదే నిజమైతే 1951లో బాంగ్లాదేశ్‌లో హిందువుల జనాభా 2.2 కోట్లు కాగా ఇప్పుడు అది 1.3 కోట్లకు ఎందుకు పడిపోయిందో అక్కడి పాలకులే చెప్పాలి. గతంలో హసీనా మొసలి కన్నీరు కారుస్తూ చేసిన వ్యాఖ్యలనే మళ్లీ మహ్మద్ యూనస్ కూడా వల్లె వేశారు. దాడి జరిగిన ఢాకేశ్వరీ ఆలయాన్ని సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ "హక్కులు అందరికీ సమానం. మానవులంతా ఒకటే. మన హక్కులు ఒకటే. మన మధ్యభేధాలకు తావు లేదు. దయచేసి ఓపిక పట్టండి. సమస్యల పరిష్కారంలో విఫలమైతే విమర్శించండి. మతమేదైనా ప్రజాస్వామ్యంలో అందరం మనుషులమే" అని ఇక్కడ మన సెక్యులరిస్టులు చెప్పినట్టే అక్కడ ఆయన కూడా గత ఆగస్టు నెలలో సెలవిచ్చారు. ఆయన అలా మాట్లాడి ఆరు నెలలు దాటినా బాంగ్లాదేశ్‌లో హిందువుల్లో అభద్రతాభావం ఇంకా ఎందుకు పోవడం లేదు? ఆయన తాత్కాలిక ప్రభుత్వ పాలనలో దాడులకు పాల్పడిన ఎందరిపై చర్యలు తీసుకున్నారో, బాధితులను ఏ మేరకు ఆదుకున్నారో ఓహెచ్‌సీహెచ్‌ఆర్ నివేదిక చూస్తేనే తెలుస్తోంది. పాకిస్తాన్ చేతిలో కీలుబొమ్మగా మారిన యూనస్ భారత్‌కు, అక్కడున్న హిందువులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారు. ఆగస్టులో నీతి వాక్యాలు పలికిన యూనస్ గత నవంబర్‌లో ఇస్కాన్‌కు చెందిన చిన్మయ్ కృష్ణదాస్‌తో సహా పలువురు ఇస్కాన్ సభ్యులను దేశద్రోహుల కింద తప్పుడు కేసులతో అరెస్టు చేసినా మౌనం దాల్చారు. బాంగ్లాదేశ్ సైన్యం భారత్‌పై కవ్వింపు చర్యలకు పాల్పడటం అక్కడి నేతల ద్వంద్వ నీతికి నిదర్శనం.

బాంగ్లాదేశ్ మనపట్ల ఎంత కర్కశంగా ప్రవర్తిస్తున్నా ఇటీవల మన దేశ బడ్జెట్లో కూడా ఆ దేశానికి రూ.120 కోట్లు కేటాయించడం మన ఉదాసీనతకు నిదర్శనం.మేధావులు కానీ, మమతా బెనర్జీ కానీ ఇప్పుడు ఓహెచ్‌సీహెచ్‌ఆర్ నివేదికపై ఎలా స్పందిస్తారో చూడాలి. లౌకికవాదం ముసుగులో అక్కడి హిందువుల కోసం మాట్లాడితే ఇక్కడ ముస్లింలు ఎక్కడ నొచ్చుకుంటారో అని చూసీచూడనట్టు దాటవేత వైఖరినే ప్రదర్శిస్తారు మన సెక్యులర్ మేధావులు, నేతలు. రాజకీయ కుట్రలో భాగంగా బాంగ్లాదేశ్‌లో చెలరేగిన అల్లర్లలో మైనార్టీలు ప్రధానంగా హిందువులు బలిపశువులుగా మారారనేది వాస్తవం. 17 కోట్లకు పైగా జనాభా ఉన్న బాంగ్లాదేశ్‌లో హిందువులు 8 శాతం. ఈ నేపథ్యంలో ఓహెచ్‌సీ హెచ్‌ఆర్ వంటి నివేదికలపై అంతర్జాతీయ స్థాయిలో విస్తృతంగా చర్చలు జరిగేలా చేసి, బాంగ్లాదేశ్‌పై అంతర్జాతీయంగా ఒత్తిడి తేవాల్సిన ఆవశ్యకత భారత ప్రభుత్వంపై ఉంది.

– శ్రీపాద






## 'విద్యార్థులకు నిజమైన చరిత్ర చెప్పాలి'

**తాడిపత్రి:** విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను, కుటుంబ విలువలను పెంపొందించాలని కడప చిన్మయామిషన్ అధ్యక్షులు శ్రీశ్రీశ్రీ తురీయానంద సరస్వతి అన్నారు. వారు ఫిబ్రవరి 13న తాడిపత్రి పట్టణంలోని నందలపాడులో శ్రీ సరస్వతీ శిశుమందిరం నూతన భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ మనదైన నిజమైన చరిత్రను విద్యార్థులకు బోధించాలని అన్నారు. ప్రధానవక్త ఆర్‌ఎస్‌ఎస్ ఆంధ్రప్రదేశ్ ప్రాంత కార్యవాహ ఏ. వేణుగోపాల్‌నాయుడు ప్రసంగిస్తూ సమాజంలోని ఇతర పాఠశాలలకు, సరస్వతీ శిశుమందిరాలకు విద్యావిధానములో ఉన్న తేడాలను తెలియజేస్తూ ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులకు కూడా ఇక్కడ ప్రశిక్షణ జరుగుతుందని తెలిపారు. విభాగ్ కార్యకారిణి సభ్యులు కత్తి రామచంద్రారెడ్డి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. విద్యాభారతి ఆంధ్రప్రదేశ్ సంఘటన కార్యదర్శి కన్నా భాస్కర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శ్రీ సరస్వతీ విద్యాపీఠం అనంతపురం ప్రాంత కార్యదర్శి పరుచూరి రమేష్, అనంతపురం విభాగ్ కార్యవాహ ఆర్. జగదీష్‌ప్రసాద్, అనంతపురం విభాగ్ ప్రచారక్ లక్ష్మణ్, విద్యార్థుల తల్లిదండ్రులు, పట్టణ ప్రముఖులు, విద్యాభిమానులు కార్యక్రమంలో పాలుపంచుకున్నారు.

శంకర్‌పల్లిలో

## వసంత పంచమి వేడుకలు



**శంకర్‌పల్లి :** శ్రీ సరస్వతీ శిశుమందిర్ శంకర్‌పల్లిలో 'వసంతపంచమి' వేడుకలు ఫిబ్రవరి 17న ఘనంగా జరిగాయి. ఈ వేడుకలలో భాగంగా పాఠశా లలో 3 అడుగుల ఎత్తు, రెండున్నర క్వింటాళ్ల బరువు గల సరస్వతీమాత విగ్రహ ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో 55మంది చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం జరిపించారు. శిశుమందిర్ అధ్యక్షులు డా॥ జయప్రకాశ్, బచ్చు రాంమోహన్, కార్యదర్శులు సి.శ్రీపాల్‌రెడ్డి, ఎన్.గోపాల్, కోశాధికారులు ఎమ్.విశ్వనాథ్, ఎమ్.దిలీప్‌కుమార్, జిల్లా సహకార్యవాహ నర్సింలు, ఖండకార్యవాహ సి.నాగిరెడ్డి, అచ్చిరెడ్డి, కనకయ్య, సామాజిక సమరసత సంయోజకులు దామోదర్‌రెడ్డి శిశుమందిర్ మాతాజీలు, పోషకులు పాల్గొన్నారు.


## 'సైన్సుకు అంతుపట్టనిది, సాధువులకే సొంతమైనది'

**బాపట్ల :** భారత్‌లో ఇప్పటికీ సైన్సుకు అంతుపట్టని అనేక విషయాలను మన రుషులు, మునులు, సాధుసంతులు, యోగులు లక్షల సంవత్సరాల క్రితమే ఒక శాస్త్రీయ వివేకముతో మానవాళికి అందించారని ఫిబ్రవరి 12న హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో బాపట్ల జిల్లా, చీరాల మండలం, వాడరేవు గ్రామంలో జరిగిన సామూహిక సాగర హారతి కార్యక్రమంలో ముఖ్యవక్తగా పాల్గొన్న ఆర్‌ఎస్‌ఎస్ గుంటూరు విభాగ్ ప్రచారప్రముఖ్ అవ్వారు శ్రీనివాసులు తెలిపారు.

కార్యక్రమంలో హిందూ చైతన్య వేదిక జిల్లా సహ సంయోజక్ బందారు జ్వాలా నరసింహం, డాక్టర్ తాడివలస దేవరాజు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.






SURYA
A journey of brilliance completes
50+
Years
SURYA ROSHNI LIM
SINCE 1973
Surya Roshni has been a beacon of excellence,
illuminating lives with innovation and quality.
Here's to 50+ years of brilliance, and to many more years of lighting up the future together!
LIGHTING | FANS | APPLIANCES | WATER PUMPS | STEEL PIPES | PVC PIPES
I am SURYA
50+ YEARS OF TRUST
DURABLE PRODUCTS
ASSURED QUALITY
SURYA ROSHNI LIMITED | www.surya.co.in | surya | surya_roshni | surya.roshni | surya-roshni
Email: info@surya.in Tel.: +91-11-47108000

# నాల్గవ అమృత స్నానానికి 1.90

ప్రయాగరాజ్‌లో శుభప్రదమైన మాఘ పూర్ణిమను పురస్కరించుకొని కోట్లాదిగా భక్తులు త్రివేణి సంగమంలో స్నానం చేశారు. నాల్గవ అమృత స్నానానికి నిర్దేశించిన మాఘ పూర్ణిమ ఫిబ్రవరి 11 సాయంత్రం 6:55 గంటలకు మొదలైంది. మరుసటి రోజు అంటే 12 సాయంత్రం 7:22 గంటలకు సంపూర్ణమైంది. ఈ సందర్భంగా కుంభమేళాలో పాల్గొన్న భక్తులపై హెలికాప్టర్లు పూల వర్షాన్ని కురిపించాయి. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన డేటా ప్రకారం 12వ తేదీ సాయంత్రం ఆరు గంటలయ్యేసరికి మొత్తంగా 1 కోటి 90 లక్షల మంది భక్తులు స్నానం చేశారు. లక్షలాదిగా భక్తులు మాఘ పూర్ణిమ మొదలుకాకమునుపే ఆ శుభ ఘడియల కోసం ఎదురు చూస్తూ రాత్రంతా బారులుదీరారు. మహాకుంభమేళా అధికార యంత్రాంగం భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేని విధంగా విస్తృతమైన ఏర్పాట్లు చేసింది. ఘాట్ల వద్ద ఎక్కువసేపు ఉండవద్దని, స్నానం చేసిన వెంటనే శిబిరాలకు వెళ్లిపోవాలని భక్తులకు మైకుల ద్వారా పదే పదే విజ్ఞప్తి చేసింది. 10 లక్షల మందికిపైగా కల్పవాసీలు వారి నెల రోజుల దీక్షను సంపూర్ణం చేస్తున్నట్టుగా తెల్లవారుజామునే స్నానం చేసి వారి శిబిరాలకు వెళ్లిపోయారు. కల్పవాసీల దీక్ష ఆధ్యాత్మిక సాధన, నిస్వార్థ సేవ, సామరస్యంతో ముడిపడి ఉంటుంది. దీక్ష చేపట్టినవారు కటిక నేల మీద నిద్రించాలి. వణికించే శీతాకాలం, చెమటలు పుట్టించే వేసవి కాలం ఈ రెండింటిని ఒకే విధంగా అనుభవించాల్సి ఉంటుంది. ఎవరైతే కల్పవాస దీక్ష చేపడతారో వారికి జీవితంలో కష్ట నష్టాలను సహనంతో, అంకిత భావంతో ఎదుర్కొనే సామర్థ్యం బలపడుతుంది. జీవితంలో కష్టమొచ్చినా, సుఖమొచ్చినా ఒకే విధంగా వ్యవహరించే స్థితప్రజ్ఞతను అలవరుస్తుంది. కల్పవాస దీక్షా సమయంలో హఠ యోగ సాధనతో దేహం దారిలోకి వస్తుంది. మనస్సు అత్యంత సహజంగా సవాళ్లను ఎదుర్కోవడానికి సిద్ధమైపోతుంది. పుష్య పూర్ణిమ రోజున స్నానంతో మొదలయ్యే కల్పవాస దీక్ష మాఘ పూర్ణిమ రోజున స్నానంతో సంపూర్ణ మౌతుంది. కల్పవాసీలు హోమం, దానంతో పాటుగా పలు రకాల పూజలు చేసిన అనంతరం గంగా మాత ఆశీస్సులను కోరుతూ త్రివేణి సంగమంలో స్నానం చేశారు. తీర్థానికి రాజైన ప్రయాగరాజుకు భావోద్వేగపూరితంగా వీడ్కోలు చెబుతూ స్వస్థలాలకు తిరుగు ముఖం పట్టారు. ఆధ్యాత్మికతకు ఆలవాలమైన భారత్‌లో కుంభమేళా ప్రయాగరాజ్, ఉజ్జయినీ, నాసిక్, హరిద్వార్‌లో వేర్వేరు కాలాల్లో జరుగుతుంది. కానీ కుంభమేళాను పురస్కరించుకొని భక్తులు కల్పవాస దీక్షను చేపట్టే ఏకైక ప్రాంతంగా ప్రయాగరాజ్ వాసికెక్కింది. అలా ఈసారి కల్పవాస దీక్ష చేపట్టినవారిలో ప్రతాప్‌గఢ్ నుంచి వచ్చిన రామ్ అచల్ మిశ్రా ఒకరు. ఆయన ఇప్పటిదాకా 18 సార్లు దీక్ష చేపట్టారు.

అదే విధంగా సాత్నా నుంచి వచ్చిన 76 ఏళ్ల శివనాథ్ గామరి వాతావరణం అనుకూలంగా లేకపోయినప్పటికీ 23వ సారి దీక్ష చేపట్టారు. ఇంటికి తిరిగి వెళుతున్నప్పుడు భావోద్వేగానికి గురయ్యారు. మళ్లీ వస్తానంటూ తీర్థానికి రాజైన ప్రయాగరాజ్‌కు వీడ్కోలు పలికారు.



# సుసంపన్నం శంకరా

కేరళకు చెందిన సాధు ఆనందవనం ప్రస్తుతం జరుగుతున్న కుంభమేళాలో జునా అఖాడా మహామండలేశ్వర్‌గా జనవరి 27న పదోన్నతి పొందారు. తద్వారా ఆయన భక్తుల ఆధ్యాత్మిక యాత్రను ప్రభావితం చేస్తారు. ఆది శంకరాచార్యునికి, జునా అఖాడాకు ఓ అవినాభావ సంబంధం ఉంది. జగద్గురువు సన్యాస క్రమాలను 10 క్రమాలుగా నెలకొల్పడంతో పాటుగా దేశం నలుదిక్కుల నాలుగు మఠాలను ఏర్పాటు చేశారు. అవి దక్షిణాన కర్ణాటకలో శృంగేరి పీఠం, తూర్పున ఒడిశాలో పూరి గోవర్ధన

# కంచాలు, సంచులతో రూ.140 కోట్లు ఆదా!

మహాకుంభమేళాలో పర్యావరణ పరిరక్షణ నిమిత్తం చేపట్టిన కంచాలు, సంచుల సేకరణ కార్యక్రమంలో 14 లక్షల 17 వేల కంచాలు, 13 లక్షల 46 వేల సంచులు, 2 లక్షల 63 వేల లోటాలు పోగయ్యాయి. అలా సేకరించిన వాటిని కుంభ మేళాలో అవసరమైన వారికి పంచిపెట్టారు. ఈ సేకరణ కార్యక్రమం దేశంలో 43 రాష్ట్రాల్లోని 7,258 చోట్ల జరిగింది. 2,241 సంస్థలు ఇందులో పాలు పంచుకున్నాయి. ఇలా సేకరించినవాటిని పంచిపెట్టిన కారణంగా కుంభమేళాలో పర్యావరణానికి చేటు చేసే వాటితో తయారు చేసిన కంచాలు, గిన్నెల వాడకం 80 నుంచి 85 శాతానికి తగ్గిపోయింది. కోట్లాది జనం కారణంగా 40 వేల టన్నుల వ్యర్థాలు పోగుపడతాయని అంచనా వేస్తే ఇప్పటిదాకా చేరిన వ్యర్థాల పరిణామం 11 వేల టన్నులు మాత్రమే ఉంది. దానర్థం 29 వేల టన్నుల వ్యర్థాన్ని నివారించి నట్టు. పారిశుద్ధ్య కార్మికులు, నగర వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలపై భారం తగ్గింది. సంప్రదాయ కంచాలు, లోటాలు, సంచుల పంపిణీ కారణంగా పర్యా వరణానికి చేటు చేసే వాటితో తయారైన వాటి వాడకం పడిపోయింది. దీంతో రోజుకు రూ.3.5 కోట్లు ఆదా అయ్యింది.

ఆ లెక్కన కుంభమేళా జరిగే 40 రోజులకు మొత్తంగా రూ.140 కోట్లు ఆదా అవుతుంది. అదే సమయంలో ఆహార వృథా 70 శాతం తగ్గిపోయింది. సామాజిక వంటశాలలు, భండారాలు, అఖాడాలు లబ్ధి పొందాయి. అవసరమైన వారికి పంచిపెట్టిన




## చార్య సంప్రదాయం

పీఠం, పశ్చిమాన గుజరాత్‌లో ద్వారక, ఉత్తరాన ఉత్తరాఖండ్‌లో జ్యోతిర్‌మఠం. నలుగురు ఆదిశంకరాచార్యులు ఈ మఠాలకు అధిపతులుగా ఉంటారు.

ఆది శంకరాచార్యులు నాలుగు మఠాధిపతుల నుంచి తనను వేరుగా చూడాల్సిందిగా పిలుపునిచ్చారు. ఈ 10 సన్యాస క్రమాలకు చెందిన సన్యాసులను భారతి, సరస్వతి, సాగరం, తీర్థ, పురి, ఆశ్రమం, గిరి, పర్వతం, అరణ్య, వన అని పిలుస్తారు. కనుక దీనిని దశనామి క్రమం అని పిలుస్తారు. అఖాడా అనే వ్యవస్థ వేర్వేరు సంప్రదాయాలు, వ్యవస్థలకు లోబడి ఉన్న సన్యాసులను ఏకం చేసేందుకు ఉద్దేశించింది. మహామండలేశ్వరులు ధర్మం ప్రాతిపదికగా అఖాడాలకు నేతృత్వం వహిస్తారు. అఖాడా అంటే మల్ల యుద్ధం చేయడానికి, సాధన చేయడానికి ఉద్దేశించిన ఓ స్థలం. ఇంకా విడమరిచి చెప్పాలంటే అఖాడాను గోదా లేదా బరి అని కూడా అనొచ్చు.

అఖాడాలు ఎప్పుడూ కూడా జప, తప, సాధనలకు తోడుగా ధర్మ పరిక్షణ కోసం పోరాటం చేయడానికి సిద్ధంగా ఉంటాయి. అఖాడాల్లో గుర్తింపు పొందిన అఖాడాలు 13 ఉన్నాయి. మొదట్లో రాసుకొచ్చిన దశనామి సన్యాస క్రమాలను 7 శైవ అఖాడాలుగా ఏర్పాటు చేశారు. అవి జునా (భైరవ్), నిరంజని, అటల్, ఆవాహన్, ఆనంద్, అగ్ని, మహానిర్వాని, వాటిలో జునా అఖాడా అతి పెద్దది, అత్యంత పురాతనమైంది. జునా అఖాడా కుంభమేళాలో ఓ కీలకమైన పాత్ర పోషిస్తుంది. ఈ అఖాడా ప్రధాన కార్యాలయం వారణాసిలో ఉంది. స్వామి కాశికానంద గిరి మహరాజ్ నిరంజని అఖాడా మహామండలేశ్వర్‌గా ఉన్నారు. శ్రీ నిర్మోహిని అని అఖాడా విష్ణు భక్తులకు చెందినది. గురునానక్ కుమారుడు శ్రీచంద్ బోధనలను శ్రీపంచాయతీ బడా ఉదాసీన్ అఖాడా, శ్రీపంచాయతీ నయా ఉదాసీన అఖాడా, శ్రీ నిర్మల్ పంచాయతీ అఖాడా అనుసరిస్తాయి.

స్టీలు కంచాలను ఏళ్ల తరబడి వాడుకోవచ్చు.

కంచాలు, సంచుల సేకరణ కార్యక్రమం భవిష్యత్తులో పర్యావరణ హితం దిశగా కుంభమేళా తరహా ఆధ్యాత్మిక వేడుకల కోసం కంచాలు, సంచుల, లోటాల నిధులను ఏర్పాటుకు ఊతమివ్వడం ద్వారా సాంస్కృతికంగా ఓ సానుకూల మార్పునకు దారి తీస్తుంది. ఇది ఎలాంటి పిలుపు లేదా ప్రచారంతో పనిలేకుండానే ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పైన పేర్కొన్న వస్తువులను అందించే ఓ సత్ సంప్రదాయానికి చేయూతనిస్తుంది. ఇంతటి గొప్ప పరిణామానికి కారణమైన ఈ కార్యక్రమానికి ఎలాంటి బడ్జెట్ కేటాయించకపోవడం గమనార్హం. అంతే కాకుండా ఈ కార్యక్రమం సాధించిన విజయం స్వచ్ఛమైన, పర్యావరణ హిత భవిష్యత్తు కోసం సామాజిక భాగస్వామ్యం, పర్యావరణం పట్ల బాధ్యత, నిరంతరాయ కార్యాచరణ మధ్య సమన్వయానికి తార్కాణంగా నిలిచింది.





# తొలిసారి నాగ సాధువులుగా దళితులు

ప్రయాగరాజ్‌లో జరుగుతున్న కుంభమేళా సరికొత్త చరిత్ర సృష్టించింది. శతాబ్దాలనాటి కులాల అడ్డుగోడలను తుత్తునియలు చేస్తున్నట్టుగా ఈ సారి కుంభమేళాలో కొత్తగా నాగ సాధువులుగా అవతరించినవారిలో దళితులు, జన్‌జాతి వర్గాలకు చెందినవారు 20 శాతానికి పైగా ఉన్నారు. ఈ రూపాంతరం భారతదేశపు అత్యంత పవిత్రమైన వేడుకలో ఆధ్యాత్మిక ఏకత్వానికి, సమానత్వానికి ఓ సరికొత్త శకానికి సంకేతమైంది. మహిళలు, పురుషులను కలుపుకొని ఈసారి మొత్తంగా 8,715 మంది ప్రాపంచిక విషయాలను త్యజించి సనాతన ధర్మం కోసం నాగ సాధువులు, సాధ్వీలుగా అవతరించారు. వారిలో ఎస్సీ నేపథ్యం కలిగినవారు 1,850 మంది ఉన్నారు. మహిళలు దాదాపు 250 మంది ఉన్నారు. ఆ లెక్కన ఈసారి కుంభమేళాలో సనాతన ధర్మానికి కట్టుబడినవారు నాగ సాధువులు, సాధ్వీలుగా రూపాంతరం చెందే ప్రక్రియ లింగ, కులాల అడ్డుగోడలను పగులగొట్టింది. వీరంతా కూడా చత్తీస్‌గఢ్ చిట్టడవుల నుంచి, బెంగాల్‌లో నదీ తీర గ్రామాల నుంచి, అరుణాచల్ ప్రదేశ్, త్రిపురలో మంచు కప్పుకున్న పర్వత ప్రాంతాల నుంచి, మధ్యప్రదేశ్‌లో కీలకమైన ప్రాంతాల నుంచి వచ్చినవారు. కుటుంబాలను వదిలేశారు. గతకాలపు గుర్తింపులను త్యజించారు. స్వయంగా గుండు చేసుకున్నారు. భౌతిక ప్రపంచానికి స్వస్తి పలుకుతూ స్వయంగా పిండ ప్రదానం చేసుకున్నారు. కులానికి, సామాజిక హోదాకు మంగళం పాడారు. నాగ సాధువులు, స్వాధీల రూపంలో సరికొత్త ఆధ్యాత్మిక ప్రయాణానికి శ్రీకారం చుట్టారు.

అఖాడాలు ఈసారి దళితులు, మహిళలు గణనీయంగా నాగ సాధువులు, స్వాధీలుగా రూపాంతరం చెందడంలో గతకాలపు ఆచార వ్యవహారాలకు భిన్నంగా వ్యవహరించారు. బడుగు, బలహీన వర్గాలకు తలుపులు తెరవడం ప్రారంభించారు.

ఇదే విషయమై అఖిల భారతీయ అఖాడా పరిషత్ అధ్యక్షుడు మహంత్ రవీంద్రపురి మాట్లాడుతూ కొత్తగా నాగ సాధువులు, సాధ్వీలుగా మారినవారిలో ఎక్కువ మంది సామాజిక సమానత్వం, సర్వ సంగపరిత్యాగంపై దృష్టి పెట్టి సనాతన ధర్మానికి తమ జీవితాలను అంకితం చేయడానికి నిశ్చయించుకున్నారని తెలిపారు.

దళితులైన జగద్గురు మహేంద్రానంద్ గిరి, మహామండలేశ్వర్ కైలాసానంద్ గిరి లాంటి వారు అఖాడాల్లో అత్యున్నత స్థానాల్లో చేరుకోవడం నాగా సాధువులుగా మారడంలో దళిత, జన్‌జాతి వర్గాలవారిని ప్రోత్సహించింది. వారికున్న పలుకుబడి కులం, మతం, వర్గం మధ్య అంతరాన్ని తొలగించింది. ఐక్యతా సందేశాన్ని ప్రపంచానికి అందించింది.

జునా అఖాజా అధికార ప్రతినిధి శ్రీమహంత్ నారాయణ్ గిరి మాట్లాడుతూ "మత మార్పిడులను అరికట్టాలంటే కులం, మతం, వర్గం మధ్య అంతరాన్ని తొలగించాల్సిన అవసరం ఉంది" అని అన్నారు. ఈ ధోరణి ఎస్సీలు, గిరిజనులు పెద్ద సంఖ్యలో కుంభమేళా వద్ద సన్యా స్రమం స్వీకరించి ఆధ్యాత్మిక జాగృతి పొందడానికి దారి తీసింది. ★

# ప్రయాగరాజ్‌లో రాష్ట్రపతి



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఫిబ్రవరి 10న, సోమవారం నాడు కుంభమేళాలో పవిత్ర స్నానమాచరించారు. అంతకుముందు ఢిల్లీ నుంచి నేరుగా ప్రత్యేక విమానంలో ప్రయాగ రాజ్‌కు చేరుకున్న రాష్ట్రపతికి ఉత్తరప్రదేశ్ గవర్నర్ ఆనందీబెన్ పటేల్, సీఎం యోగి ఆదిత్యనాథ్ విమానాశ్రయం వద్ద స్వాగతం పలికారు. అనంతరం ద్రౌపది ముర్ము వారి ద్దరితో కలిసి బోట్‌లో త్రివేణి సంగమానికి బయలుదేరారు. దారిలో పక్షులకు ఆహారాన్ని అందించారు. త్రివేణి సంగమం చేరుకున్న తర్వాత పవిత్ర స్నానం చేశారు. కుంభమేళా భారత్ ఘనమైన సాంస్కృతిక వారసత్వానికి నిదర్శనమని ముర్ము అన్నారు. త్రివేణి సంగమంలో స్నానం చేసే భాగ్యం తనకు లభించిందని ఎక్స్ వేదికగా తెలిపారు. ఈ దివ్యమైన ఆధ్యాత్మిక వేడుక మానవాళికి ఐక్యతా సందేశాన్ని ఇస్తోందని చెప్పారు. యావత్ ప్రజానీకం సుఖశాంతులతో జీవించేలా ఆశీస్సులు అందించాలని గంగామాతను తాను ప్రార్థించినట్టు రాష్ట్రపతి తెలిపారు. ★

# 'కుంభమేళా భక్త జన సంగమం'

మహా కుంభమేళా కేవలం పెద్ద సంఖ్యలో ప్రజలు గుమిగూడిన ఓ ప్రాంతం కాదని అది పవిత్రమైన భక్త జన సంగమం అని ఆర్ఎస్ఎస్ సర్‌కార్యవాహ దత్తాత్రేయ హొసబలే అన్నారు. రెండ్రోజుల పర్యటనలో భాగంగా ఫిబ్రవరి 9న ప్రయాగరాజ్‌కు వచ్చిన ఆయన మాట్లాడుతూ మహాకుంభమేళా సనాతన ధర్మానికి ప్రాతినిధ్యం వహించడానికి మాత్రమే పరిమితం కాదని అది ఓ సత్ సంకల్పంతో కూడుకున్న మహత్తరమైన వండుగ అని తెలిపారు.

దత్తాత్రేయ హొసబలె హిందూ ధర్మం, సంస్కృతి, సంప్రదాయాల ప్రాముఖ్యతను ప్రధానంగా ప్రస్తావించారు. వీటిని యువతరానికి చేరువ చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. సమాజంలో ప్రజలు, సాధువులు, ప్రభుత్వం సమష్టి, సమన్వయ శక్తి సామర్థ్యాలతో పనిచేసినప్పుడు మాత్రమే ధర్మం, సంస్కృతి, సమాజ పరిరక్షణ సాధ్యమౌతుందని సర్‌కార్యవాహ తెలిపారు. దత్తాత్రేయ హొసబలే అఖిల భారతీయ వనవాసి కల్యాణ ఆశ్రమ్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 10, సోమవారంనాడు జనజాతి సమాగమం ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ మన వనవాసి సమాజం సనాతన హిందూ సంప్రదాయాన్ని పరిరక్షించడంలో ఓ పెద్ద పాత్రను పోషించిందని అన్నారు. గిరిజన సాధువులు ఈ జ్ఞానంతో కూడుకున్న సాంస్కృతిక సంప్రదాయాన్ని ప్రోత్సహించడానికి మరింత కృషి చేయాలని తెలిపారు. హిందుత్వ,

# సోషల్ మీడియా ఖాతాలపై ఎఫ్ఐఆర్





సీఎం యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం మహా కుంభమేళాపై దుష్ప్రచారం చేస్తూ వదంతులు సృషిస్తున్న సోషల్ మీడియా వేదిక ఎక్స్‌కు చెందిన 14 ఖాతాలపై చర్య తీసుకుంది. ఈ మేరకు ఆ ఖాతాలపై కుంభమేళా పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. యూపీ డీజీపీ ప్రశాంత్ కిషోర్ ఆదేశాలకు లోబడి సోషల్ మీడియా వేదికలపై నిఘా పెట్టిన అధికారులకు నిర్దేశిత ఎక్స్ ఖాతాలు జార్ఖండ్‌లో ధన్‌బాద్‌కు చెందిన ఓ పాత విడియోను ప్రయాగరాజ్‌లో మహాకుంభ మేళాకు ముడిపెడుతూ సర్క్యులేట్ చేస్తున్న వైనం కంటపడింది. ఆ విడియోకు "యోగి ప్రభుత్వ పోలీసులు మహాకుంభమేళాలో తప్పిపోయిన బంధువులను వెదుకుతున్న భక్తులను దారుణంగా చితకబాదారు" అనే క్యాప్షన్ పెట్టారు. ఆ విడియో జార్ఖండ్‌లో ధన్‌బాద్‌కు చెందినదిగా ఫ్యాక్ట్ చెకింగ్‌లో వెల్లడైంది. అది 2025, జనవరి 1న స్థానిక పోలీ సులు లాఠీచార్జీ చేసిన సంఘటనకు సంబంధించింది. కుంభమేళా పోలీసులు తమ అధికారిక ఖాతా ద్వారా ఆ విడియోను తోసిపుచ్చారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని, పోలీసులను అప్రతిష్ట పాల్జేయాలనే దురుద్దేశంతో ఇలాంటి విడియోను వెలుగులోకి తీసుకొచ్చారని అధికారులు ఆరోపించారు. మహాకుంభమేళాపై దుష్ప్రచారం చేసే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ★



భారతీయత, సనాతన సంప్రదాయం ఈ మూడూ కూడా విదేశీ భావజాలం, మతమార్పిడి విధింపు లాంటి సంక్షోభాలను ఎదుర్కొంటున్నాయని చెప్పారు. గిరిజన సాధువులు ఈ సంక్షోభాలకు ఎదురొడ్డుతూనే మారుమూల అటవీ ప్రాంతాల్లో అహర్నిశలు పాటుపడుతున్నారని తెలిపారు. వారి కృషితోనే నేడు హిందూ ధర్మం మనుగడలో ఉందని చెప్పారు. గిరిజన సమాజంలో పర్యావరణం, పరిశోధన, విద్య, సంస్కృతి, ధార్మిక చైతన్యం, సేవ ద్వారా అవగాహన తీసుకొనివచ్చి మన సమాజంలో ఐక్యత, అస్తిత్వం కొనసాగడానికి రానున్న రోజుల్లో మరింత కృషిజరగాలని తెలిపారు.

దేశవ్యాప్తంగా గిరిజన సమాజం నుంచి 77 మంది సాధువులు, మహంత్‌లు కార్యక్రమంలో పాల్గొన్నారు. ★

# నదీజలాల్లో చెత్తకు చెక్

ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ మహాకుంభమేళా జరుగుతున్నన్ని రోజులు గంగ, యమున నదులు పరిశుభ్రంగా ఉండాలనే దృక్పథాన్ని కలిగి ఉన్నారు. ప్రయాగరాజ్ పురపాలక సంఘం సీఎం దృక్పథానికి తగ్గట్టుగా అత్యంత అధునాతమైన ట్రాష్ స్కిమ్మర్ అనే యంత్రాన్ని రంగంలోకి దించింది. అది నదీ జలాల నుంచి రోజుకు 10 నుంచి 15 టన్నుల వ్యర్థాలను తొలగిస్తుంది. త్రివేణి సంగమంలో స్నానం చేయడానికని ఎక్కడెక్కడి నుంచో వచ్చే భక్తులకు పరిశుభ్రమైన నీటిని అందుబాటులో ఉంచడానికి ఈ ట్రాష్ స్కిమ్మర్ యంత్రాన్ని తీసుకొచ్చారు. మొదట్లో అది రోజుకు 50 నుంచి 60 క్వింటాళ్ల వ్యర్థాలను తొలగించేది. ప్రయాగరాజ్ పురపాలక సంఘానికి యంత్రం పనితీరు నచ్చడంతో రెండో యంత్రాన్ని కూడా తెప్పించింది. దీంతో నదీ జలాలను శుభ్రం చేసే పనుల్లో వేగం పెరిగింది.

**పూల నుంచి జంతువుల కళేబరాల దాకా..!**

ట్రాష్ స్కిమ్మర్ యంత్రం నీటి ఉపరితలంపై తేలియాడుతున్న వ్యర్థాలను సేకరిస్తుంది. దీనిని నదులు, ఓడ రేవులు, సముద్రాలను శుభ్రం చేయడానికి వాడతారు. ఈ యంత్రం నీటి ఉపరితలంపై పూలు, పూలదండలు, టెంకాయలు ప్లాస్టిక్ సీసాలు, పూజా సామాన్లు, వస్త్రాలు, లోహపు వస్తువులు, పూజ చేసిన తర్వాత పారేసే వస్తువులు చివరికి జంతువులు లేదా పక్షుల కళేబరాలనూ తొలగిస్తుంది. ఇవే కాకుండా గుర్రపు డెక్క, నాచును సైతం తొలగిస్తుంది.

**యంత్రం పరిధి, పనితీరు**

గంగ, యమున నదులను శుభ్రం చేయడానికి ఉద్దేశించిన ట్రాష్ స్కిమ్మర్ సామర్థ్యం 13 ఘన మీటర్లు. నదిలో నాలుగు కి.మీ.లు మేర చుట్టివస్తుంది. ఆ ప్రకారం సంగమం ప్రాంతం, బోట్ క్లబ్‌తో పాటుగా ఇతర కీలకమైన ప్రాంతాలు ఈ యంత్రం పరిధిలోకి వస్తాయి.

ఇది ఒకదాని తర్వాత ఒకటి అన్నట్టుగా రెండు నదులను చక్కగా శుభ్రం చేస్తుంది. ఈ యంత్రానికి ఇరువైపులా రెండు గేట్లు ఉంటాయి. యంత్రం లోపల ఒక కన్వేయర్ బెల్టు ఉంటుంది. ఈ గేట్లు నీటిలో తేలియాడుతున్న వ్యర్థాలను సేకరించగానే హైడ్రాలిక్‌గా మూసుకు పోతాయి. ఇలా సేకరించిన వ్యర్థాలు కన్వేయర్ బెల్ట్‌ను చేరుకుంటాయి. ఈ వ్యర్థాలను మరో కన్వేయర్ బెల్ట్ ద్వారా వెలుపలకు తరలిస్తారు. ★



## కథ

రఘునాథం ఎనిమిదో క్లాసు చదువుతుండగా, అకస్మాత్తుగా క్లాస్‌మేట్ బాచీ చచ్చిపోయాడు. క్లాస్ టీచర్, కొంతమంది పిల్లలు ఆ చావు దగ్గరికి వెడుతుంటే, తనూ కూడా వెళ్లాడు రఘునాథం.

బాచీ శవాన్ని రోడ్డుమీద ఉంచి నీళ్లు పొయ్యటం, నీళ్లుపోసినా, వాడిలో కదలిక లేకపోవటం, శవాన్ని పాడెకు కట్టటం, ఇవన్నీ చూసి రఘునాథం కంగారు పడ్డాడు.

ఆ కంగారుతోనే "చచ్చిపోవటం అంటే ఏమిటి మాస్టారు?" అని స్కూల్ టీచర్‌ని అడిగాడు రఘునాథం.

"చచ్చిపోటం అంటే ఇదే. ఇప్పుడు శ్మశానానికి తీసికెళ్లి దహనం చేస్తారు. అంటే మంటల్లో కాల్చేస్తారు. ఆ తర్వాత మనకింక వాళ్లు ఎప్పటికీ కనపడరు. ఎవరేనా సరే."

"అంటే అందరూ ఇలాగే చచ్చిపోతారా మాస్టారూ?"

"అందరూ చచ్చిపోతారు. సాధారణంగా పెద్దవాళ్లై ముసలి వయసొచ్చాక పోతారు."

చావంటే ఏమిటో అంతవరకూ తెలియని రఘునాథం పసి ఆలోచనని మాస్టారి మాటలు గట్టిగా పట్టుకున్నాయి. అప్పట్నించీ చావు బెదురు పట్టుకుంది. అది రఘునాథంతోటే ఎదుగుతూ వచ్చింది.

రఘునాథానికి తల్లంటే ప్రాణం. ఆమె చచ్చిపోతే ఎలా అన్న బెంగ. రఘునాథం పెద్దవాడయ్యాడు. పెళ్లయింది. ఇద్దరు మగపిల్లలు పుట్టారు. వాళ్లు బాగా చదువుకుని, విదేశాల్లో పెద్ద ఉద్యోగాల్లో ఉన్నారు.

రఘునాథం పెద్ద స్థాయి ఉద్యోగమే చేశాడు. కేంద్ర ప్రభుత్వంలో మేనేజింగ్ డైరెక్టర్‌గా రిటైర్ అయ్యాడు. పెద్ద మొత్తంలో పెన్షన్ వస్తుంది. సొంత ఇల్లు, సకల వసతులు, ఆస్తులు ఉన్నాయి. పిల్లలూ డబ్బు పంపుతారు. ఆర్థికంగా అదనపు వనరుల సమృద్ధే తప్ప, ఏ లోటూ లేదు.

అయినా రఘునాథం ఏనాడూ తుళ్లుతూ, గెంతుతూ చిలోపాలో అంటూ లేదు. తాపీగా సాగే ప్రవాహంలాగే సాగుతోంది జీవితం.

రఘునాథం తండ్రి రామ్మూర్తిగారు మంచి రచయిత. జీవన రీతి, సహజాతాలు, సుఖదుఃఖాలు, మనోరీతుల గురించి తాత్విక ధోరణిలో, నిత్య జీవితానికి అన్వయించి, మనుషుల్లో ధైర్యాన్ని పెంచే ఎన్నో ఉన్నత రచనలు చేసినాయన.

ఆయన రఘునాథంలోని బెదురుని, చావు భయాన్ని అతని చిన్నతనంలోనే కనిపెట్టారు.

చావు పుట్టుకలు సహజ చర్యలని, అవి ఏ మానవ మాత్రుడి అధీనంలో లేవని, అటువంటి వాటి గురించి విచారించి మనసు పాడు చేసుకోకూడదని తరచుగా చెపుతూ వచ్చారు. దాంతో రఘునాథంలో కొంత మార్పు, ధైర్యం వచ్చాయి. అయినా తల్లి చచ్చిపోతుందన్న బెంగ



# సంరక్షణ



వి. రాజారామమోహనరావు

పూర్తిగా తొలగిపోలేదు. తల్లి చచ్చిపోయినట్టు తరచుగా కలలు వచ్చేవి.

రఘునాథం ఏనాడూ ఊహించనిది జరిగింది. రఘునాథం తల్లి బాగానే ఉంది. కానీ, తండ్రి రామూర్తిగారు పోయారు. చాలా దుఃఖపడ్డాడు రఘునాథం. తండ్రి మరణం తనని అంత కుంగ దీస్తుందని ఏనాడూ అనుకోలేదు. తల్లి మీదే తప్ప, తండ్రి పోతాడేమోనన్న ఊహ ఏనాడూ లేదు. అనుకోని అశనిపాతం తీవ్రత.

రామ్మూర్తిగారి జీవితం ఉదాత్తంగా గడిచింది. ఆయన రచనల్ని ఇష్టపడి, గౌరవించిన వాళ్లు ఎందరెందరో. ఎంతో విద్వత్తు ఉన్నవాళ్లు తరచుగా ఆయన దగ్గరకొచ్చి సాహితీ కాలక్షేపంలో మునిగిపోయేవారు. ఆయన చుట్టూ నిత్య కల్యాణం, పచ్చతోరణంలా ఉండేది. అంతటి ఉదాత్తమూర్తి, ఉన్నత వ్యక్తి వెళ్లిపోయాడు. 'ఇంతేనా... జీవితం ఇదేనా' అన్న ఉదాశీనత, దిగులు కప్పేశాయి రఘునాథాన్ని.

తండ్రి కర్మకాండ శాస్త్రోక్తంగా, పద్ధతిగా చేశాడు. సంవత్సరీకం అయి పోయింది. ఒక్క యేడాదిలోనే మార్పు స్పష్టంగా తెలిసొచ్చింది రఘునాథానికి.

తండ్రి గురించి అంత తరచుగా తమింటికి తిరిగేవాళ్లు మాయం. తండ్రిని అంతగా కీర్తించిన పొగడ్తలు మాయం. అసలు తండ్రి స్మరణే మాయంలా మారిపోయింది.

సంసారం గడవటానికి, ఇల్లు సాగటానికి ఏ రకం ఇబ్బంది లేకపోవటంతో, రఘునాథం ఆలోచనలు అస్తమానం అటే ఉంటున్నాయి.

ఆ తీరులోనే... 'కాలం చాలా క్రూరమైంది. అన్నింటిని, మంచితనాన్ని, ఔన్నత్యాన్ని, ఉదాత్తతని మరపులోకి నెట్టేస్తుంది' అన్న ఆలోచన రఘునాథాన్ని భూతంలా పట్టేసింది.

తండ్రిమీద బెంగ. అంత తొందరగా ఆయన స్మృతి అంతరించి పోకూడదన్న తపన. కనీసం తను ఉన్నంతవరకే నా తండ్రి స్మృతిని సజీవంగా ఉంచాలన్న పట్టుదల కలిగింది.

రామ్మూర్తిగారి రచనలన్నింటినీ ముద్రించే పని మొదలెట్టి, ఆరునెలల్లో పూర్తి చేశాడు. పెద్ద సభగా వాటిని ఆవిష్కరించాడు. రామ్మూర్తిగారి మిత్రుల చిరునామాలు సేకరించి అందరికి పంపాడు.

నిరాశే మిగిలింది. కొద్దిమందే పుస్తకాలు అందాయి అని తెలియచేశారు. ఎవరూ ఒక ఉత్తరం ముక్క రాయలేదు.

రామ్మూర్తి గారి స్మృతిగా కథల పోటీ పెట్టాడు. బహుమతులు ఇచ్చాడు. బహుమతి కథలతో, ఎంపిక చేసిన మరిన్ని కథలు కలిపి సంకలనం అచ్చువేశాడు. నాలుగునాళ్ల హడావిడే తప్ప, దానివల్లా తృప్తి కలగలేదు.

ఏం చేస్తే తండ్రిని పదిమంది గుర్తుంచుకుంటారు అని ఎంతగానో ఆలోచించాడు. ప్రతి సాహిత్య సభకి వెళ్లి రచయితలకి, విమర్శకులకు తండ్రి పుస్తకాలు ఇచ్చి తమ తమ స్పందనను నాలుగు ముక్కలు రాసి పంపమన్నాడు. పుస్తకాలు పుచ్చుకున్నారు గానీ ఎవరూ సరిగా స్పందించలేదు.

చివరికి రామ్మూర్తిగారి దగ్గరి స్నేహితుడు, ఆయన సహ రచయిత రావుగారిని కలిసి తన గోడంతా చెప్పాడు రఘునాథం. "నాన్న అంత గుర్తుంచుకోదగిన వ్యక్తి కాదా? మంచి రచయితేగా?" అనడిగాడు.

అంతా విన్న రావుగారు "రామ్మూర్తి నిస్సందేహంగా గొప్ప రచయిత. ప్రాచుర్యం కోసం, బహుమతుల కోసం వెంపర్లాడని నిఖార్సయిన వ్యక్తి తన స్మృతి పది కాలాలు ఉండాలి. తన రచనలు ప్రజాహితం కూర్చే శాశ్వత విలువలు ఉన్నవి' అన్నారు.

"మరి ఏమిటి చెయ్యటం?" అనడిగాడు రఘునాథం.

"తెలుగునాట సాహిత్య వాతావరణం చాలా నిరుత్సాహంగా ఉంది రఘునాథం! పత్రికలన్నీ మూతపడ్డాయి. నాలుగైదు పత్రికలే అతి కష్టంమీద, అదీ అంకితభావం వల్ల నడుస్తున్నాయి. పుస్తక ప్రచురణా సంస్థలూ అంతే.

పుస్తకాలు చదివేవాళ్లు లేకపోలేదు. చదివి, తమ వరకూ తాము మౌనంగా ఉండిపోతున్నారు. అంత నిశ్శబ్దంగా తయారైంది పరిస్థితి. మేం విరివిగా రాసిన రోజుల్లో ఒక్కో రచన మీద ఎంతో చర్చ ఎన్నాళ్లో జరిగేది. మంచి రచన అంటే అంత ఆసక్తి ఉండేది.

ఈ మారిన పరిస్థితుల్లో ఏం చెయ్యాలో నేనూ ఆలోచిస్తా. తప్పనిసరిగా ఏదోటి చేద్దాం” అన్నారు రావు.

* * *

నాలుగు నెలల తర్వాత, రామ్మూర్తిగారి జయంతి సభ పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు. పేరు పేరునా వెతికి వెతికి ఆహ్వానాలు పంపారు. ప్రముఖుల్ని అతిథులుగా, వక్తలుగా పిలిచారు. సభలో పెద్ద స్థాయి సాహిత్య పోటీ ప్రకటన ఉంటుందని తెలియజేశారు.

అంతేకాదు జనాన్ని ఆకర్షించే అన్ని పద్ధతులూ అవలంబించారు.

సభకి జనం పెద్ద సంఖ్యలో వచ్చారు. రామ్మూర్తిగారి పుస్తకాలన్నీ అమ్మకానికి పెట్టారు. ఊరికే ఇస్తే విలువ ఉండటం లేదని, నామమాత్రంగా ఒక్కో పుస్తకం ఇరవై రూపాయిలన్నారు.

రామ్మూర్తిగారి గురించి, ఆయన రచనల గురించి నలుగురు వక్తలు విపులంగా మాట్లాడాక రావుగారు మైకు ముందుకొచ్చారు.

‘రామ్మూర్తి నాకు దగ్గరి స్నేహితుడు. వాడి గురించి మాట్లాట్టం అంటే నా గురించి నేను మాట్లాడుకున్నట్టే. అందుకని వేరే ఓ ముఖ్యమైన విషయం చెపుతాను. ఈనాడు తెలుగులో సాహిత్య పరిస్థితి చాలా దారుణంగా ఉంది. ఇంచుమించు వార, పక్ష, మాసపత్రికలు మూతపడ్డాయి. పుస్తక ప్రచురణ సంస్థలు అంతే. ఈ దౌర్భాగ్యం పొరుగు రాష్ట్రాలైన తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో లేదు.

‘రామ్మూర్తి నాకు దగ్గరి స్నేహితుడు. వాడి గురించి మాట్లాట్టం అంటే నా గురించి నేను మాట్లాడుకున్నట్టే. అందుకని వేరే ఓ ముఖ్యమైన విషయం చెపుతాను. ఈనాడు తెలుగులో సాహిత్య పరిస్థితి చాలా దారుణంగా ఉంది. ఇంచుమించు వార, పక్ష, మాసపత్రికలు మూతపడ్డాయి. పుస్తక ప్రచురణ సంస్థలు అంతే. ఈ దౌర్భాగ్యం పొరుగు రాష్ట్రాలైన తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో లేదు.



ప్రాథమిక విద్య తెలుగులో తప్పనిసరి కాకపోవటం, భాషాభివృద్ధి విషయంలో శ్రద్ధ లేకపోవటం లాంటి కారణాలు ఉన్నాయి. తెలుగు, తెలుగు సాహిత్యం అంతరించిపోతుందేమో అన్నంత భయం.కానీ ఇద్దరు తెలుగు మాట్లాడేవారు ఉన్నంతవరకూ తెలుగుభాషా, సాహిత్యం బతికే ఉంటాయి అని నా గట్టి నమ్మకం.

ఇంతటి దారుణ స్థితి ఇలాగే ఉండిపోనక్కర్లేదు. మన ప్రభుత్వాలు తలుచుకుంటే, పరిస్థితి పూర్వవైభవ స్థితికి చిటికేసినట్టు మారిపోతుంది. ప్రాథమిక బోధన తెలుగులో చెయ్యటం, వసూలు చేస్తున్న గ్రంథాలయ పన్ను, కోట్ల రూపాయలు గ్రంథాలయాలకే ఖర్చు చెయ్యటం, చేస్తే చాలు.

గ్రంథాలయాలన్నీ బాగుపడితే, తెలుగు సాహిత్య పుస్తకాలు వేలప్రతులు అమ్ముడవుతాయి. రచయితలకి, ప్రచురణ సంస్థలకి కొత్త ఊపిరొస్తుంది.

సరే ఇవన్నీ సామాజిక స్థాయి పనులు. వ్యక్తిగత స్థాయిలో ఇక్కడ ఒక వ్యక్తి నానా హైరానా పడుతున్నాడు. ఆరాడపడుతున్నాడు...అతను రామ్మూర్తి కొడుకు రఘునాథం.

రఘునాథం చెప్పేది వినండి. అతని మమతని, తపనని అర్థం చేసుకోండి. కొంచం సమయం వెచ్చించి మీ చేయూతనివ్వండి అని ముగించారు.చివరగా రఘునాథం మాట్లాడాడు.

‘నేను రచయితని, సాహితీకారుణ్ణి కాదు. ఓ కొడుకుని మాత్రమే మా నాన్న మంచి రచయిత అని నమ్మకం ఉంది. ఆయన స్మృతి పది కాలాలు పచ్చగా ఉండాలి. అది నా స్వార్థమేమో. కానీ ఆయన రచనలు మేలు చేసేవే అన్న విశ్వాసం పూర్తిగా ఉంది. దానికి మీ సహకారం కావాలి.

నాన్నగారి పుస్తకాలన్నీ అచ్చువేసి ఊరికే ఇచ్చి చదివి చెప్పమన్నాను. నిరాశే మిగిలింది. ప్రస్తుత స్థితిగతులు చూసి అందుకే ఈ పోటీ పెడుతున్నాను. ఇతి ఒక ఎరలాంటిదే. వల లాంటిదే. అయినా తప్పనిసరై సాహసిస్తున్నా.

నాన్నగారి ఏ రచన మీదేనా విమర్శ రాసి పంపండి. మొదటి బహుమతి రెండు లక్షలు, రెండో బహుమతి లక్ష. మూడో బహుమతి యాభై వేలు. ఇవి కాక ఇంకా బహుమతులున్నాయి. పోటీ సంపూర్ణ వివరాలు కరపత్రాల్లో, ప్రకటనలో ఉన్నాయి. ఇప్పటికేనా దయతో స్పందించి, నా కోరిక తీర్చమని వేడుకుంటున్నారు అన్నాడు ఆ దీనస్థితికి కళ్లమ్మట నీళ్లు కారుతుండగా రఘునాథం.


వారసత్వంగా వచ్చిన ఆస్తి, వ్యాపారాలని వారసులు కాపాడుకున్నట్టు, సాహిత్యాన్ని కాపాడాల్సిన కాలం వచ్చింది.

వచ్చేవారం కథ..

**ఈత సాపలు**

– బండారి రాజ్‌కుమార్





వన్డే క్రికెట్ మినీప్రపంచకప్‌కు మాజీ ఛాంపియన్, ప్రపంచ నంబర్ వన్ ర్యాంక్ జట్టు భారత్ గురిపెట్టింది. పాకిస్తాన్, దుబాయ్ వేదికలుగా ప్రారంభమైన 2025 ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో రోహిత్ శర్మ నాయకత్వంలోని భారత్ టైటిల్ వేటలో నిలిచింది.




# భారత్ 'మినీ' టార్గెట్!

అంతర్జాతీయస్థాయిలో ఐసీసీ క్రికెట్ వ్యాపారం మూడుపువ్వులు, ఆరుకాయలు అన్నరీతిలో సాగిపోతోంది. పురుషుల, మహిళల విభాగాల్లో టీ-20, వన్డే ప్రపంచకప్ టోర్నీలు నిర్వహిస్తున్న అంతర్జాతీయ క్రికెట్ మండలి ( ఐసీసీ ) మినీ ప్రపంచకప్ పోటీలు సైతం నిర్వహిస్తూ వందలకోట్ల రూపాయలు ఆర్జిస్తోంది. ఐసీసీ ప్రపంచ టోర్నీల పరంపరలో భాగంగా ఎనిమిదేళ్ల విరామం తరువాత 2025 వన్డే ఛాంపియన్స్ ట్రోఫీకి పాకిస్తాన్ క్రికెట్ బోర్డు ఆధ్వర్యంలో తెరలేచింది.



### ఎనిమిది అగ్రశ్రేణిజట్ల సమరం

ఐసీసీ 50 ఓవర్ల వన్డే క్రికెట్లో ఎనిమిది అగ్రశ్రేణి జట్ల నడుమ మినీ ప్రపంచకప్ కమ్ ఛాంపియన్స్ ట్రోఫీని నిర్వహిస్తోంది. పాక్ గడ్డపై మ్యాచ్‌లు ఆడటానికి భారతజట్టు నిరాకరించడంతో ఈ టోర్నీని 'హైబ్రిడ్ తరహా'లో నిర్వహిస్తున్నారు. ఆతిథ్య పాకిస్తాన్ తన గ్రూపు మ్యాచ్‌లన్నింటినీ స్వదేశంలో ఆడనుంది. హాట్ ఫేవరెట్ భారత్ ఆడే మ్యాచ్‌లను మాత్రం దుబాయ్ వేదికగా నిర్వహిస్తున్నారు.

ఈ పోటీలు మొత్తం ఎనిమిది జట్లను రెండు గ్రూపులుగా చేసి గ్రూప్ లీగ్ కమ్ సెమీఫైనల్స్ నాకౌట్ తరహాలో రెండున్నరవారాలపాటు ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది అభిమానులను అలరించనున్నాయి.

### గ్రూప్-ఏ లీగ్‌లో భారత్, పాకిస్తాన్

గ్రూపు-ఏ లీగ్‌లో చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్తాన్, న్యూజిలాండ్, బాంగ్లాదేశ్ తలపడనున్నాయి. గ్రూప్-బీ లీగ్‌లో అఫ్ఘనిస్తాన్, ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా పోటీపడనున్నాయి. ప్రపంచ మాజీ ఛాంపియన్ వెస్టిండీస్ , జింబాబ్వే జట్లు అర్హత సాధించడంలో విఫలమయ్యాయి.



కృష్ణారావు చొప్పరపు
సీనియర్ జర్నలిస్ట్, 84668 64969

డాషింగ్ ఓపెనర్ రోహిత్ శర్మ నాయకత్వంలోని భారతజట్టు తన లీగ్, నాకౌట్ మ్యాచ్‌లను దుబాయ్ వేదికగానే ఆడనుంది. భారతజట్టు ఫైనల్స్ చేరితే దుబాయ్ వేదికగాను, పాకిస్తాన్ జట్టు టైటిల్ సమరానికి అర్హత సాధిస్తే పాక్ వేదికగాను మార్చి 9న ఫైనల్స్ నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. పాకిస్తాన్‌లోని రావల్పిండి, కరాచీ, లాహోర్‌తో పాటు దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియాలు వేదికలుగా ఉన్నాయి.

నాలుగు జట్ల గ్రూపులీగ్ దశలో అత్యధిక విజయాలు సాధించిన మొదటి రెండు జట్లూ సెమీఫైనల్స్ నాకౌట్ రౌండ్లో తలపడనున్నాయి. గ్రూప్-ఏ లీగ్ లో అగ్రస్థానం సాధించిన జట్టుతో గ్రూప్-బీ లీగ్‌లో రెండోస్థానం సాధించిన జట్టుతోనూ, గ్రూప్-బీ లీగ్ విజేతతో గ్రూప్ -ఏ లీగ్ రెండోస్థానం సాధించిన జట్టు ఫైనల్లో చోటు కోసం పోటీపడనున్నాయి.

మార్చి 4, 5 తేదీలలో సెమీఫైనల్స్, మార్చి 9న ఫైనల్స్ నిర్వహిస్తారు.

### భారత్ వైపే అందరి చూపు

ఇప్పటికే ఐసీసీ టీ-20 ప్రపంచకప్, వన్డే ప్రపంచకప్ టోర్నీలను రెండేసిమార్లు నెగ్గిన భారత్‌కు మినీప్రపంచకప్ టోర్నీలో సైతం ఘనమైన రికార్డే ఉంది. 1998 నుంచి 2017 వరకూ జరిగిన ఎనిమిది మినీప్రపంచకప్ టోర్నీలలో ఓసారి విజేతగా(2013), మరోసారి సంయుక్త విజేతగా (2002 ), రెండుసార్లు రన్నరప్‌గా (2000, 2017) నిలిచిన ఘనత భారత్‌కు ఉంది.

టెస్ట్ హోదాలేని దేశాలకు నిధులు సమకూర్చడం కోసం ఐసీసీ ప్రవేశపెట్టిన ఈ ఛాంపియన్స్ ట్రోఫీకి బంగ్లాదేశ్, కెన్యా, భారత్, ఇంగ్లండ్ దేశాలు మాత్రమే ఆతిథ్యమిస్తూ వచ్చాయి. 2017 టోర్నీ తరువాత వివిధ కారణాలతో గత ఏడేళ్లుగా వాయిదా పడుతూ వచ్చిన ఈ పోటీలకు ఆతిథ్యమిచ్చే అవకాశాన్ని పాకిస్తాన్ దక్కించుకొంది.

2009 నుంచి వన్డే ర్యాంకింగ్స్ మొదటి ఎనిమిది స్థానాలలో నిలిచిన జట్లు మాత్రమే మినీప్రపంచకప్ బరిలోకి దిగేలా ఐసీసీ నిబంధన ప్రవేశపెట్టింది.

### రెండుసార్లు విజేత ఆస్ట్రేలియా

గత ఎనిమిది మినీప్రపంచకప్ టోర్నీలలో అత్యధికంగా రెండుసార్లు విజేతగా నిలిచిన ఘనత ఆస్ట్రేలియా (2006, 2009) కు మాత్రమే దక్కుతుంది. 2002 టోర్నీలో శ్రీలంకతో కలసి టైటిల్ పంచుకొన్న భారత్ 2013లో మాత్రమే పూర్తిస్థాయి విజేతగా నిలువగలిగింది.

1998 ప్రారంభ మినీప్రపంచకప్‌ను దక్షిణాఫ్రికా, 2004 టోర్నీని వెస్టిండీస్, 2017 టోర్నీని పాకిస్తాన్ సొంతం చేసుకోగలిగాయి. ప్రస్తుత ఈ మినీ ప్రపంచకప్ సెమీఫైనల్స్‌కు దక్షిణాఫ్రికా, భారత్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ జట్లు చేరుకొనే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని క్రికెట్ విశ్లేషకులు చెబుతున్నారు.

### రోహిత్, విరాట్, జడేజాలకు ఆఖరి మినీప్రపంచకప్

భారత్ క్రికెట్‌కు మూడు ఫార్మాట్లలోనూ గత దశాబ్దకాలంగా అసమాన సేవలు అందిస్తూ వచ్చిన దిగ్గజ త్రయం రోహిత్ శర్మ, విరాట్ కొహ్లీ, రవీంద్ర జడేజాలకు ఇదే ఆఖరి ఛాంపియన్స్ ట్రోఫీ కానుంది.

2023 వన్డే ప్రపంచకప్ రన్నరప్, 2024 టీ-20 ప్రపంచకప్ విజేతగా నిలిచిన భారతజట్టులో సభ్యులుగా ఉన్న రోహిత్, విరాట్, జడేజా మినీప్రపంచకప్‌ను సైతం మరోసారి భారత్‌కు సాధించి పెట్టాలన్న పట్టుదలతో ఉన్నారు.

కోట్లాదిమంది భారత అభిమానులు సైతం రోహిత్ సేనే విజేతకావాలని కోరుకొంటున్నారు. విశ్వక్రికెట్ అభిమానులకు ఈ మినీప్రపంచకప్ ఐపీఎల్ కంటే ముందుగానే వచ్చిన వేసవి వినోదం అనటం ఏమాత్రం అతిశయోక్తికాదు. ★

# పని సంస్కృతి వీడి పరాన్న



కొన్ని సమయాలలో భారత న్యాయస్థానాలు, ప్రధానంగా సుప్రీంకోర్టు వెల్లడించిన అభిప్రాయాలను శ్లాఘించకుండా ఉండలేం. ఆ అభిప్రాయాలు జాతి మౌలిక స్వరూపానికి చెందినవి కావచ్చు. సామాజిక స్వరూపానికి సంబంధించి కావచ్చు. ప్రధానంగా రాజకీయ పార్టీలు అధికార కాంక్షతో, ఇంకొన్ని అనివార్యంగా సమాజంలోకి ప్రవేశపెడుతున్న వికృత ధోరణులను నిలదీయడంలో, లేదా నివారించడంలో న్యాయస్థానాలు తమదైన పాత్రను పోషిస్తున్నాయి. రాజకీయ పరుగు పందెంలో స్వయంకృతాపరాధంతో చతికిల పడుతున్న పార్టీలు దొడ్డితోవన మళ్లీ అధికారం చేజిక్కించుకోవడానికి ఉచితాలను విచక్షణా రహితంగా ప్రకటిస్తున్నాయి. చాలా ప్రాంతీయ పార్టీలు, జాతీయ రాజకీయ పక్షంగా పేరున్న కాంగ్రెస్ కూడా ఉచితాలతో భారతీయ వ్యవస్థ స్వరూప స్వభావాలను దెబ్బ తీసే విధంగా వ్యవహరిస్తున్నాయి. అవన్నీ అభివృద్ధి చెందుతున్న ఆర్థికవ్యవస్థకు గుదిబండలా తయారవుతున్నవే. ఈ విషయంలో చాలామంది పౌరులలో ఆవేదన ఉంది. కానీ బయటకు చెప్పుకోవడానికి, ప్రకటించడానికి వీలు లేని విధంగా వీటి చుట్టూ రాజకీయ, సామాజిక వలలను కట్టి ఉంచారు. ప్రధానంగా పన్ను చెల్లింపుదారులకు జరుగుతున్న అన్యాయం దారుణమైనది. అది దేశ పురోభివృద్ధికి కాకుండా, ఆ పురోభివృద్ధిని మందగించేటట్టు చేస్తున్న చర్యలే ఉచితాలన్నీ. ఈ నేపథ్యంలోనే ఫిబ్రవరి 12న భారత అత్యున్నత న్యాయస్థానం చేసిన వ్యాఖ్యలు దేశంలో ఒక గొప్ప చర్చకు తావిచ్చాయి.

ఉచిత పథకాలు ప్రకటించి పరాన్నజీవులను సృష్టిస్తున్నామా? ఇది సుప్రీంకోర్టు జాతికి వేసిన ప్రశ్న. దీనికి రాజకీయ పార్టీలు దాదాపు అన్నీ సమాధానం ఇవ్వడం అవసరం. లేదా ధోరణి మార్చుకోవడం ఇంకా అవసరం. ఉచిత పథకాల గురించి సుప్రీంకోర్టు ఈ స్థాయిలో వ్యాఖ్యలు చేయడం దాదాపు ఇది మొదటిసారి. దీనితో రాజకీయ పార్టీలు కొన్ని పోటీలు పడి ప్రకటిస్తున్న ఈ ఉచితాల మీద పునరాలోచన ఆరంభం కావాలి. ఎన్నికలు ప్రకటించగానే రాజకీయ పార్టీల నుంచి ఉచిత హామీలు వెల్లువెత్తుతున్నాయి. ఈ పద్ధతి సరైనది కాదని, ఈ కారణంగా ప్రజలు పని చేయడానికి ఇష్టపడడం లేదని సాక్షాత్తు అత్యున్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. అందుకే మరి, ఉచితాలతో మనం 'పరాన్నజీవులను సృష్టిస్తున్నామా?' అని కూడా ప్రశ్నించింది.

ఢిల్లీలో ఇళ్లు లేనివారికి ఆశ్రయం కల్పించాలంటూ సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ దాఖలు చేసిన వ్యాజ్యంతో నిజానికి డొంక కదిలిందనే అనాలి. అందుకు న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ మహారాష్ట్ర ఎన్నిలకు ముందు అక్కడ వినిపించిన ఓ ఉచిత పథకం గురించి ఉదహరించారు. దాని వల్ల ప్రజలు ఉచితాల మీదనే జీవితం గడిపేయాలని అనుకుంటున్నారని, పని చేయడానికే ఇష్టపడడం లేదని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. నిజమే, వాస్తవాలు ఎప్పుడూ కఠినంగానే ఉంటాయి. అంతమాత్రాన వాటి నుంచి దూరంగా జరగడానికో, వాయిదా వేయడానికో ప్రయత్నించడం వ్యవస్థకు పెద్ద చేటు.

పని ఉంటే చేయకుండా ఎవరూ ఉండరని, పని లేకే వలసపోతున్నారని ఈ ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేసిన ప్రశాంత భూషణ్ వాదనను న్యాయ మూర్తి దాదాపు కొట్టిపారేశారు. మీకు ఒక కోణం మాత్రమే తెలిసినట్టు ఉంది అని చురక వేయవలసి వచ్చింది. తాను కూడా వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చానని, ఎన్నికలకు ముందు ఉచితాలు ప్రకటించడం వల్ల వ్యవసాయ పనులకు మనుషులు దొరకడం లేదని న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ జవాబు ఇచ్చారు. ప్రతి ఒక్కరికీ ఇంటికే రేషన్ వస్తుంటే అది కూడా ఉచితంగా వస్తుంటే ప్రజలు ఎందుకు పని చేస్తారని ఆయన సూటిగానే ప్రశ్నించారు. నిరాశ్రయులకు నీడ కల్పించమని కోరడం, ఉచితాలకూ, పనికీ మధ్య సమతౌల్యం గమనించడం అందరికీ అవసరమని చాలా కీలకమైన అంశాన్ని న్యాయమూర్తి జాతి ముందు పెట్టారు. ఉచిత పథకాల తరువాత, ఇంకొన్ని ఇతర పథకాల వల్ల వ్యవసాయ రంగంలో పనిచేయడానికి కూలీలు దొరకని మాట ఒక వాస్తవం. అది న్యాయమూర్తికి మాత్రమే పరిమితమైన సమస్య కూడా కాదు. దేశంలో ఎందరో రైతులకు సంబంధించినది. ఉచిత పథకాలు, ఇతర పథకాల వల్ల ఒక కూలీకి రోజుకు ఆరువందల రూపాయలు వస్తున్నాయి. ఇంతకు మించి ఇస్తే కూలీలు దొరుకుతారు. కానీ అంత కూలి చెల్లించడం సాధారణ రైతుకు సాధ్యమా? ఇక్కడ పని సంస్కృతి విచ్ఛిన్నం అవుతుండడానికీ, పేద రైతు ఎదుర్కొంటున్న సమస్యకీ మధ్య తలెత్తిన ఘర్షణ గురించి చర్చ జరగవలసి ఉంది. ఒక ఉచిత పథకం, మరొక పేద వర్గాన్ని ఇంకాస్త పేదరికంలో నెట్టివేసే పరిణామం అవాంఛనీయం కాదా! రైతు కూలీగా మారాడు. కూలి వలసదారునిగా మారుతున్నాడు. ఇదే ఆ పరిణామం.

నిరాశ్రయులను ప్రధాన స్రవంతి సమాజంలో భాగం చేసి, దేశాభివృద్ధికి తోడ్పడేలా చేయడానికి బదులు, ఇన్నిన్ని సౌకర్యాలు ఇస్తున్నారు. ఇలా చేయడం ద్వారా మనం ఒక పరాన్నజీవుల వర్గాన్ని తయారు చేయడం లేదా? దురదృష్టవశాత్తు ఎన్నికలకు ముందు ప్రకటించిన ఉచితాల వల్ల ప్రజలు పని చేయడానికి ఇష్టపడడం లేదు అని సుప్రీంకోర్టు నిర్ద్వంద్వంగా వ్యాఖ్యానించింది.

వలసలు, ఉచితాలు, వీరికి ఆశ్రయం కల్పించడం అనే అంశాలు దేశంలో ఒక విచిత్ర వాతావరణాన్ని సృష్టించాయి. ఇది అన్ని వర్గాల సమస్య మాత్రం కాదు. పేదరికం ఉన్నమాట, నిరుద్యోగం ఉన్నమాట అంగీకరిస్తూనే కొన్ని వాస్తవాలను అంగీకరించాలి. ప్రశాంత భూషణ్ వంటి అర్బన్ నక్సల్ దృష్టి వేరు. ఉచిత రేషన్‌కార్డులు అందించడం దేశ పౌరులకు మాత్రమే ఇచ్చే విధానంగా ఉంటే మంచిదే. కానీ అక్రమ వలసదారులకు కూడా ఈ సౌకర్యం కల్పించడం చాలామంది అర్బన్ నక్సల్స్ ఉద్దేశం. ఇందుకు మతోన్మాద ముస్లిం రాజకీయ పక్షాలు దోహదం చేస్తున్నాయి. ఉదాహరణకు రొహింగ్యాలకు ఆశ్రయం కల్పించడం. వీరిని ఎప్పుడు దేశం నుంచి పంపివేస్తారని సుప్రీం కోర్టు ప్రశ్నించిన సంగతి వీరికి పట్టదు. కొన్ని రాజకీయ పార్టీల ఉచిత పథకాలు ఆర్థిక వ్యవస్థను సంక్షోభం వైపు నెడుతుంటే, అర్బన్ నక్సల్స్ దృష్టి కోణం శాంతిభద్రతలకు, అసలు సార్వభౌమాధికారానికి సవాలుగా మారుతోంది. ఈ నేపథ్యంలోనే సుప్రీం


# జీవులుగా..

కోర్టు తాజా వ్యాఖ్యలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి. ఉచితాలు పొందుతున్న వారిలో అక్రమ వలసదారులు లేరని ఎవరైనా చెప్పగలరా? వీరికి కావలసినవి వాస్తవాలు కావు. ఉదారవాదం ముసుగులో బుజ్జగింపు ధోరణికి ఊతం ఇవ్వడం. సెక్యులరిజం పేరుతో మెజారిటీ మతస్థుల హక్కులకు భంగం కలిగించడం. వ్యవస్థను సంక్షోభంలో ఉంచడమే.

ఇదంతా నిజమో, కాదో ఉచితాలు, వాటి విశ్వరూపం గురించి జస్టిస్ గవాయ్ చేసిన వ్యాఖ్యల తరువాత సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందా కారత్ స్పందన గమనించాలి. 'దేశంలో నెలకొన్ని ఉన్న దారుణ నిరుద్యోగ పరిస్థితులు, అల్ప వేతనాలతో భారత శ్రామికవర్గం ఉనికి కోసం చేస్తున్న జీవన పోరాటాన్ని గమనించడంలో న్యాయమూర్తి విఫలమయ్యారని బృంద తేల్చిపారేశారు. ఆ అభిప్రాయాలను ఉపసంహరించుకోవలసిందని కోరుతూ ఏకంగా న్యాయమూర్తికి ఆమె బహిరంగలేఖ రాశారు. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాల నుంచి లబ్ధి పొందుతున్న ఆయా వర్గాల మీద న్యాయమూర్తి అభిప్రాయాలతో దురభిప్రాయం ఏర్పడుతుందని కూడా ఆమె అన్నారు. ఎలాంటి వేతనం లేని సాధారణ భారతీయ మహిళ రోజుకు ఏడున్నర గంటల వంతున, వారానికి 50 గంటలు పాటు పడుతున్నారని, అలాంటివారికి కొన్ని రాష్ట్రాలు అమలు చేస్తున్న రుణ బదిలీ పథకం ఒక వెసులుబాటు అని అన్నారు. కాబట్టి దానిని తప్పు పట్టకూడదని ఆమె అభిప్రాయం. నిజానికి ఈ అంశం న్యాయమూర్తి వ్యాఖ్యల పరిధిలోకి వస్తుందా? నేరుగా బదిలీ అవుతున్న ఆ నగదు ఆమె అవసరాలకే ఉపయోగ పడుతున్నదా? ఇలాంటి విషయాలు కూడా కారత్ చర్చించి ఉంటే బాగుండేది. వాస్తవాలను గమనించక పోవడం, లేదా చర్చకు రాకుండా చేయడం గురించే ఇక్కడ ప్రశ్న. కొద్దిగా ఆలస్యమైనా ఒక మంచి అంశాన్ని న్యాయమూర్తి తెర మీదకు తెచ్చారు. పని సంస్కృతి నాశనం కావడానికి ఉచితాలు దోహదం చేస్తుండడమే ఆ అంశం. పేదరికం నిర్మూలన పేరుతో పరాన్నజీవుల వర్గాన్ని సృష్టించకోవడం గురించి ఆలోచించమన్నారు న్యాయమూర్తి.

– జాగృతి డెస్క్

# నిశ్చల భక్తికి నిదర్శనం శబరి జయంతి



హిందువులు శబరిమాత జయంతిని కొన్ని ప్రాంతాలలోనే అయినా భక్తశ్రద్ధలతో జరుపుకుంటారు. జాతికి ఆదర్శపురుషుడు శ్రీరామచంద్రుడి ఎడల ఉన్న నిరుపమానమైన భక్తికి నిదర్శనంగా ఈ పండుగ జరుపుకుంటున్నారు. శ్రీరాముడి భక్తకోటిలో శబరిమాత ఒకరు. ఫాల్గుణమాసం, కృష్ణపక్ష సప్తమికి (ఉత్తరాది చాంద్రమానం ప్రకారం) ఆ మహాభక్తురాలి జయంతిని జరుపుతారు. గుజరాత్, మహారాష్ట్ర, కొన్ని దక్షిణ భారత ప్రాంతాలలో అమంత చాంద్రమానం ప్రకారం మాఘమాసంలోనే నిర్వహిస్తారు. ఇలాంటి చిన్న చిన్న తేడాలు ఉన్నా చాలాచోట్ల శబరి జయంతిని నిర్వహిస్తారు. ఈ ఏడాది ఫిబ్రవరి 20న శబరి మాత జయంతి వచ్చింది.

గిరిజన స్త్రీ శబరికి రాముడి పట్ల ఉన్న అచంచలమైన భక్తిని గుర్తు చేసుకుంటూ ఆమె జయంతి వేడుకను నిర్వహిస్తారు. తన రాకకోసం చిరకాలం ఓపికగా వేచి ఉన్న శబరి గురించి విని చివరికి రాముడు ఆమె కుటీరానికి వెళతాడు. రామాయణ కావ్యంలో ఇదొక అద్భుత ఘట్టం. అత్యంత హృద్యం. ఆమె అడవి పళ్ల రుచి మొదట తాను చూసి, తరువాత తన ఆరాధ్యదైవానికి సమర్పిస్తుంది. ఆ మహనీయుడు ఆ ఎంగిలి పళ్లనే ఆనందంగా స్వీకరిస్తాడు. ఇదొక పరిపూర్ణ భక్తి. దీనిని గుర్తు చేసుకోవడమే ఈ పండుగ ఉద్దేశం.

శబరి జయంతికి హిందువులు ఉపవాసాలు చేస్తారు. రాముడిని, శబరి మాతను పూజిస్తారు. రామాయణంలోని శబరి ఘట్టాలను పఠిస్తారు. ఆలయాలలోనే కాదు, ఇళ్లలో కూడా రాముడు, శబరిల భజన గీతాలను ఆలపిస్తారు. ఈ సందర్భంగా పేదసాదలకు అన్న ప్రసాద వితరణ, ఆలయాలను సందర్శించడం కూడా సంప్రదాయంగా వస్తున్నది. ★

# అయోధ్య రామ మందిర ప్రధాన అర్చకులు దాస్ నిర్యాణం



అయోధ్య రామ జన్మభూమి ఆలయ ప్రధాన అర్చకులు మహంత సత్యేంద్రదాస్ ఫిబ్రవరి 12న పరమపదించారు. 85 సంవత్సరాల దాస్ (1940–2025) మెదడులో నాళాలు చిట్లి కొద్దిరోజులుగా అస్వస్థులుగా ఉన్నారు. 13వ తేదీన ఆయన పార్థివ దేహాన్ని సరయు నదిలో జల సమాధి చేశారు. 1992 నుంచి కడ ఊపిరి వరకు ఆయన రామ జన్మభూమిలో ప్రధాన అర్చకులుగా సేవలు అందించారు. దాస్ ఉత్తరప్రదేశ్‌లోని సంత్ కబీర్‌నగర్‌లో జన్మించారు. ఇది అయోధ్యకు వంద కిలోమీటర్ల దూరంలోనే ఉంది. సత్యేంద్రదాస్ విద్యాభ్యాసం అయోధ్యలోనే జరిగింది. 1975లో ఆయన సంస్కృత విద్యాపీఠ్ నుంచి ఆచార్య పట్టా పొందారు. అక్కడే సంస్కృత మహా విద్యాలయంలో సహాయక అధ్యాపకుని పదవీ బాధ్యతలు చేపట్టారు. వీరి కుటుంబం చిరకాలంగా అయోధ్యతో అనుబంధం కలిగి ఉంది. అలాగే అక్కడి అభిరామ్‌దాస్ ఆశ్రమంతో కూడా ఆ అనుబంధం ఉంది. అభిరామ్‌దాస్ అంటే 1949లో రామజన్మభూమిలో విగ్రహాలను మార్చారని చెప్పే ఉదంతంలో కీలకంగా వ్యవహరించారని అంటారు. తరువాత వ్యాజ్యంలో కూడా అభిరామ్‌దాస్ కీలకపాత్ర పోషించారు. 1992లో కట్టడం కూల్చిన తరువాత రాములవారి విగ్రహాలను సురక్షిత ప్రాంతానికి తరలించే కార్యక్రమంలో సత్యేంద్రదాస్ పాలు పంచుకున్నారు. సత్యేంద్రదాస్ మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోదీ, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ★

# బాల జాగృతి

## తెలుసుకుందాం

# శ్రీ వాసుదేవ పెరుమాళ్ దేవాలయం, మందస



శ్రీకాకుళం జిల్లా మందస గ్రామంలో వెలిసిన ప్రాచీన దేవాలయమే శ్రీ వాసుదేవ పెరుమాళ్ ఆలయం. సుమారు 700 సంవత్సరాల క్రితం ఈ ఆలయం నిర్మించినట్లు చారిత్రక ఆధారాలు తెలుపుతున్నాయి. ఎర్రని ఇసుక రాయితో కళింగ శైలిలో తీర్చిదిద్దిన ఈ ఆలయ అపూర్వ శిల్పసంపద వర్ణనాతీతం. ఆలయంలో నెలకొని ఉన్న నిలువెత్తు సాలగ్రామ మూలమూర్తి తిరుపతి వేంకటేశ్వరుని విగ్రహాన్ని పోలి ఉంటుంది. ఇక్కడి దేవుడిని జ్ఞానప్రదాతగా, అభయప్రదాతగా భక్తులు కొలుస్తారు.

## కథ | కోడి చేసిన మేలు!

ఒక ఊరిలో సునీత, లత అనే ఇద్దరు స్నేహితురాళ్లు ఉండేవారు.

ఒకసారి ఇద్దరూ కలిసి వేసవి సెలవులకి సునీత వాళ్ల మామయ్య ఇంటికి వెళ్లారు.

అది పల్లెటూరు కావటంతో అక్కడ ఉన్న పొలాలు, చెట్లు, పూల తోటలు, ఇళ్ల చుట్టూ ఉండే కూరగాయల మొక్కలు వీరికి బాగా నచ్చాయి.

సునీత వాళ్ల మామయ్య ఇంట్లో మేకలు, గొర్రెలు, బాతులను పెంచేవాడు. వాటిని చూసి వీరిద్దరూ చాలా సరదా పడ్డారు. అక్కడ వారికి ఒక తెల్లని కోడి ప్రత్యేకంగా కనిపించింది. మామయ్య కోడిని మిగతా పక్షులతో కలిపి ఉంచకుండా వేరుగా పెంచటం వారు గమనించారు. వారికి చాలా ఆశ్చర్యం వేసింది.

సునీత "మామయ్యా! పెంపుడు జంతువుల్ని జాగ్రత్తగా చూస్తారని నాకు తెలుసు. కానీ మీరు దీన్ని చాలా గౌరవంగా చూస్తున్నారు. ఎందుకు?" అని అడిగింది. అప్పుడు వాళ్ల మామయ్య "అవును! ఇది మాకు చాలా ప్రత్యేకమైనది" అన్నాడు. "ఎందుకంత ప్రత్యేకత?" అడిగింది లత. అప్పుడు మామయ్య "ఈ కోడి వాస్తవానికి మాది కాదు. ఎక్కడ నుంచి వచ్చిందో తెలియదు. ఒకసారి ఈ పశువుల కొట్టానికి నిప్పు అంటుకుంది. అప్పుడు ఈ కోడి మేమందరం మేల్కొనే వరకూ కొక్కొరోకో.. కొక్కొరోకో అంటూ కూస్తూనే ఉంది. అప్పుడు మేం లేచి నీళ్లు తెచ్చి పోసి మంటల్ని ఆర్పి పశువుల్ని రక్షించాం. ఈ కోడే లేకపోతే కొట్టంతో పాటు మా ఇల్లు కూడా తగలబడి పోయేది. దాని వల్లే మేం



## పద్యం

**అల్పుడెపుడు బల్కు నాడంబరముగాను**
**సజ్జనుండు బల్కు చల్లగాను**
**కంచు మ్రోగునట్లు కనకంబు మ్రోగునా?**
**విశ్వదాభిరామ! వినుర వేమ!**

**భావం :** తక్కువ బుద్ధి గలవాడు ఎప్పుడూ గొప్పలు చెప్పుచుండును. మంచి బుద్ధి గలవాడు తగినంత మాత్రమునే మాటలాడును. కంచు మ్రోగినంత పెద్దగా బంగారం మ్రోగదు కదా! అని భావం.

## శ్లోకం

**ఉపకారోపి నీచానా**
**మపకారోహి జాయతే**
**పయః పానం భుజంగానాం**
**కేవలం విషవర్ధనమ్**

**భావం :** నీచులకు ఉపకారం చేసినప్పటికీ వారి దుష్టబుద్ధిని పెంచినట్లే అవుతుంది. పాములను పాలు పోసి పెంచినా వాటిలో పెరిగేది విషమే కదా?

## జత పరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| జగ్జీవన్ రామ్ | ఆంధ్రభీష్మ |
| విశ్వనాథ సత్యనారాయణ | ఫ్లైయింగ్ సిక్ |
| అశోకుడు | బాబూజీ |
| మిల్కా సింగ్ | కవిసమ్రాట్ |
| న్యాపతి సుబ్బారావు | ప్రియదర్శి రాజా |

**సమాధానాలు :** జగ్జీవన్ రామ్–బాబూజీ; విశ్వనాథ సత్యనారాయణ–కవిసమ్రాట్; అశోకుడు–ప్రియదర్శి రాజా; మిల్కా సింగ్–ఫ్లైయింగ్ సిక్; న్యాపతి సుబ్బారావు–ఆంధ్రభీష్మ.

నిర్వహణ : నయనశ్రీ

## భారత స్వాతంత్ర్య సమరయోధులు

### గోళ్లమూడి రత్నమ్మ



ఆంధ్రప్రదేశ్‌కి చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు. గుంటూరు జిల్లా తెనాలి తాలూకా చేబ్రోలు గ్రామంలో 1886లో జన్మించారు. 1921లో మహాత్మా గాంధీ స్వరాజ్య యాత్ర చేస్తూ చేబ్రోలు వచ్చారు. గాంధీజీ ఉపన్యాసాలు విన్న తాను కూడా దేశసేవలో నిమగ్నమవ్వాలనుకున్నారు. రాట్నం వడకడం, నూలు తయారు చేయడం, ఖాదీ ధరించడం మొదలు పెట్టారు. 1930లో ఉప్పు సత్యాగ్రహములో, 1942 క్విట్ ఉద్యమంలోనూ పాల్గొన్నారు. రత్నమ్మను విప్లవ వనితగా భావించి బ్రిటిష్ వారు అనేక సార్లు అరెస్ట్ చేశారు.

## జనరల్ నాలెడ్జ్


1. ఇటీవలి ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీ అధికారాన్ని సాధించుకుంది?
2. ఓరాలజీ అంటే ఏమిటి?
3. భారతదేశంలో అతిపెద్ద ఆడిటోరియం ఏది?

సమాధానాలు : 1. బీజేపీ; 2. పర్వతాల అధ్యయనం; 3. శ్రీ షణ్ముకానంద హాల్ (ముంబై).

## మెదడుకు మేత

ఇంటింటికీ
ఒక నల్లోడు..
ఏమిటది?

జవాబు : మసిగుడ్డ



ప్రాణాలతో బయటపడ్డాం. అప్పటి నుంచి ఆ కోడి చేసిన మేలుకి దాన్ని ప్రత్యేకంగా పెంచుకుంటున్నాం" అని సమాధానం చెప్పాడు రమేశ్.

"మనం చాలా చిన్న వాళ్లం. మనం ఎవరికీ ఏమీ చేయలేం అనుకుంటాం. కానీ ఒక్కోసారి మనం చేసే చిన్న సహాయం కూడా ఇతరులకు ఎంతగానో ఉపయోగపడుతుంది" అని మామయ్య వారికి వివరించాడు.

అప్పుడు సునీత, లత.. మామయ్య వాళ్లింటికి రావడం వల్ల మాకు చాలా మంచి విషయాలు తెలిశాయని సంబరపడ్డారు. ★

## మంచిమాట

వనరులూ
వసతులూ కాదు,
ఎవరి విజయానికైనా
ఆలోచనా విధానమే
మూలం!



# వారఫలాలు

24 ఫిబ్రవరి - 2 మార్చి 2025



సింహంభట్ల సుబ్బారావు
6300674054

**మేషం :** అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

చేపట్టిన కార్యక్రమాలు పూర్తి చేసేవరకూ విశ్రమించరు. ఆధ్యాత్మిక కార్యక్రమాలపై దృష్టి. వాహనాలు, భూములు కొంటారు. గత జ్ఞాపకాలు నెమరువేసుకుంటారు. మీపై కుటుంబసభ్యులు మరింత ఆదరణ. వ్యాపారులు కొత్త పెట్టుబడులు సమ కూర్చు కుంటారు. ఉద్యోగవర్గాలకు అనుకోని ఇంక్రిమెంట్లు. కళాకారులు, క్రీడాకారులు, పరి శోధకులు రివార్డులు. 1,2 తేదీల్లో ప్రయాణాలలో అవాంతరాలు. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి.

**వృషభం :** కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు

శుభకార్యాలలో పాల్గొంటారు. ఆదాయానికి లోటు ఉండదు, రుణాలు కొంతమేర తీరతాయి. ముఖ్యకార్యక్రమాలను సమయానుసారం పూర్తి చేస్తారు. తరచూ తీర్థయాత్రలు చేస్తారు. బంధువులతో ముఖ్య విషయాలపై ఉత్తరప్రత్యుత్తరాలు సాగిస్తారు. వ్యాపారాలలో అనుకున్న లాభాలు. ఉద్యోగులకు ఉన్నత హోదాలు. పారిశ్రామికవేత్తలు, కళాకారులు, రచయితల ఆశలు ఫలిస్తాయి. 24,25 తేదీల్లో వృథా ఖర్చులు. కుటుంబసమస్యలు. లక్ష్మీస్తుతి మంచిది.

**మిథునం :** మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

ఆత్మీయుల నుంచి కీలక సమాచారం అందుతుంది. ఖర్చులకు తగినంత ఆదాయం. కొన్ని వివాదాలు నేర్పుగా పరిష్కరించుకుంటారు. ఆలోచనలు తక్షణం అమలు చేస్తారు. విద్యార్థులకు కొత్త ఆశలు. వాహనాలు, ఆభరణాలు కొంటారు. వ్యాపారాలు లాభసాటి. ఉద్యోగాలలో హోదాలు. పారిశ్రామికవేత్తలు, కళాకారులు, రచయితలకు కొత్త అవకాశాలు. 26,27 తేదీల్లో దూర ప్రయాణాలు. లక్ష్మీగణపతి స్తోత్రాలు పఠించండి.

**కర్కాటకం:** పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష

చేపట్టిన కార్యక్రమాలను సజావుగా పూర్తి చేస్తారు. భూములు, వాహనాలు కొనుగోలు. గత సంఘటనలు గుర్తుకు తెచ్చుకుంటారు. వేడుకలకు హాజరవుతారు. ఉద్యోగార్థుల కృషి ఫలిస్తుంది. వ్యాపా రాలు కొత్త పెట్టుబడులతో విస్తరిస్తారు. ఉద్యో గస్తు లకు విధి నిర్వహణలో అవాంతరాలు తొలగు తాయి. రాజకీయవేత్తలు, కళాకారులు రచయితలకు శుభ వర్తమానాలు. 28, 1 తేదీల్లో అనుకోని ప్రయాణాలు. దక్షిణామూర్తి స్తోత్రాలు పఠించండి.

**సింహం :** మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

వ్యతిరేకులను సైతం ఆకట్టుకుంటారు. ముఖ్య కార్యక్రమాలు విజయవంతంగా సాగుతాయి. . భూముల కొనుగోలులో ఆటంకాలు తొలగుతాయి. వాహనసౌఖ్యం. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. వ్యాపా రాలలో లాభాలు, పెట్టుబడులు అందుతాయి. ఉద్యో గస్తులకు కొత్త హోదాలు. పారిశ్రామిక, రాజకీయ వేత్తలు, రచయితలకు అవకాశాలు దక్కుతాయి. 24, 25 తేదీల్లో విరోధాలు. అనారోగ్య సూచనలు.

**కన్య :** ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు

కొత్త కార్యక్రమాలు చకచకా పూర్తి చేస్తారు. ఆశించిన ఆదాయం. కొత్త విషయాలు తెలుస్తాయి. నిరుద్యోగులకు శుభవార్తలు. వాహనాలు, భూములు కొనుగోలు. నేర్పుతో కొన్ని సమస్యలనుంచి బయట పడతారు. వ్యాపారాలలో ముంద డుగు. పారిశ్రామిక వేత్తలు, కళాకారులు, రచయితలకు ఊహించని అవకాశాలు. 26, 27 తేదీల్లో వృథా ఖర్చులు. నవగ్రహస్తోత్రాలు పఠించండి.

**తుల :** చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు

ఆదాయం సంతృప్తికరంగా ఉండి అప్పులు తీరుస్తారు. దూరప్రాంతాల నుంచి ఆహ్వానాలు అందు తాయి. వ్యాపారాలు మరింత లాభసాటి. భాగస్వాము లతో వివాదాలు పరిష్కారమవుతాయి. ఉద్యోగాలలో గందరగోళం తొలగుతుంది. రాజకీయవేత్తలు, కళా కారులు, రచయితలకు శుభవార్తలు. 25, 26 తేదీల్లో అనారోగ్యం, దూర ప్రయాణాలు. నృసింహ స్తోత్రాలు పఠించండి.

**వృశ్చికం :** విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ

కొన్ని ముఖ్య కార్యక్రమాలు ముందుకు సాగవు. రాబడి కంటే ఖర్చులు పెరిగి ఇబ్బందిగా మారవచ్చు. ఇంటి నిర్మాణయత్నాలు కొంత మందగిస్తాయి. వ్యాపారులు కొంత ఆచితూచి వ్యవహరించాలి. ఉద్యో గస్తులకు విధుల్లో ప్రతిబంధకాలు, మార్పులు ఉండ వచ్చు. రచయితలు, పరిశోధకులు, కళా కారులకు అందిన అవకాశాలు సైతం చేజారవచ్చు. 24,25 తేదీల్లో శుభవర్తమానాలు. ఆకస్మిక ధనలాభం.

**ధనుస్సు :** మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

కొత్త కార్యక్రమాలు ప్రారంభిస్తారు. ఆత్మీయుల ప్రేమానురాగాలు పొందుతారు. అదనపు ఆదాయం. వాహనాలు, ఆభరణాలు సమకూర్చుకుంటారు. కోర్టు కేసుల నుంచి విముక్తి. వ్యాపారాలు గతం కంటే పుంజుకుంటాయి. ఉద్యోగులకు పని భారాలు తగ్గు తాయి. పారిశ్రామికవేత్తలు, క్రీడాకారులు, పరి శోధకుల యత్నాలు సఫలం. 1,2 తేదీల్లో వివాదాలు. వృథా ఖర్చులు. ఆదిత్య హృదయం పఠించండి.

**మకరం :** ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

ముఖ్య కార్యక్రమాలు సకాలంలో పూర్తి. నిరుద్యోగులకు అరుదైన అవకాశాలు. ఆస్తి వివాదాల నుంచి బయటపడతారు. భాగస్వామ్య వ్యాపారాలలో అనూహ్యమైన లాభాలు. ఉద్యోగవర్గాలకు అనుకున్న ప్రమోషన్లు రావచ్చు. రాజకీయవేత్తలు, కళాకారులు, రచయితలకు శుభవర్తమానాలు. 24, 25 తేదీల్లో అనుకోని ప్రయాణాలు. బంధువులతో విభేదాలు. శివాష్టకం పఠించండి.

**కుంభం :** ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

చిన్ననాటి స్నేహితులను కలుసుకుంటారు. విద్యార్థులకు విదేశీ విద్యావకాశాలు. వాహన, గృహ యోగాలు. మీ అభిరుచులు, అభిప్రాయాలను కుటుంబసభ్యులు గౌరవిస్తారు. వ్యాపారాలు మరింత రాణిస్తాయి. ఉద్యోగులకు ఉన్నత పోస్టులు రావచ్చు. పారిశ్రామిక, రాజకీయవేత్తలు, పరిశోధకులకు పట్టింది బంగారమే అన్నట్లుగా ఉంటుంది. 28,1 తేదీల్లో వివాదాలు. శ్రీకృష్ణస్తోత్రాలు పఠించండి.

**మీనం :** పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

ఆస్తుల విషయంలో కొత్త అగ్రిమెంట్లు చేసుకుం టారు. ఇంటి నిర్మాణయత్నాలు. నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు అందుతాయి. ఒక సమాచారం సంతోషం కలిగిస్తుంది. వైద్యసలహాలు పొందుతారు. వ్యాపారాలలో కొత్త పెట్టుబడులు సమకూరి విస్తరి స్తారు. ఉద్యోగులకు అనుకోని హోదాలు రావచ్చు. పారిశ్రామిక, రాజకీయవేత్తలు, కళాకారులకు విదేశీయానం. 27, 28 తేదీల్లో వృథా ఖర్చులు. ఆకస్మిక ప్రయాణాలు. శ్రీరామస్తోత్రాలు పఠించండి.

# పదరసం - 502

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | ■ | 3 | ■ | 4 | | 5 | |
| | ■ | 6 | | | | | ■ | | ■ |
| 7 | | | ■ | | ■ | 8 | 9 | | 10 |
| | ■ | 11 | 12 | | 13 | ■ | | ■ | |
| ■ | 14 | ■ | | ■ | 15 | | | | ■ |
| 16 | | | | ■ | | ■ | | ■ | 17 |
| ■ | | ■ | 18 | | | 19 | ■ | 20 | |
| ■ | 21 | 22 | | ■ | ■ | | ■ | ■ | |
| 23 | ■ | | ■ | 24 | | | 25 | ■ | |
| 26 | | | | | ■ | ■ | 27 | | |

## ఆధారాలు

**అడ్డం**

1) చెడు అలవాటు, ఎప్పుడూ ఒకేపనిలో ఉండటం (3)
4) .... పడటమంటే విభ్రాంతితో కూడిన ఆందోళనపడటం (4)
6) అడుక్కుని సంపాదించుకున్న భిక్షాన్నం (5)
7) పంది ముద్రగల పాత నాణెం తిరగబడింది (3)
8) విరిగిన పటికబెల్లం (4)
11) మందమతి, పనికిమాలినవాడు (4)
15) గ్రామాలలో తీర్పుల / ముఖ్య సమావేశాల గద్దె (4)
16) తిరగబడ్డ దారిద్ర్యం, శూన్యం, దీనత (4)
18) బెల్లం కలిపిన పిండి చెదరిపోయింది (4)
20) మజ్జిగ (2)
21) రెండో తిథి సరిగా లేదు (3)
24) ఇది పట్టడమంటే నెత్తిన పెట్టుకొని ఊరేగు, ఎక్కువగా గౌరవించు (4)
26) మహాకుంభమేళా జరుగుతున్న ముఖ్యప్రాంతం (5)
27) పాటకు తలకాయవంటిది, చరణాలకు ముందుండేది (3)

**నిలువు**

1) ఆహారం దగ్గర ... దగ్గర మొహమాటం పనికి రాదంటారు (4)
2) పరాభవం పైకొచ్చింది (4)
3) నిలకడలేని చూపు తలక్రిందులైంది (4)
4) చెడ్డపేరు (3)
5) చంద్రకాంతి (3)
9) గుజ్జుగల దళసరి ఆకులుండే ఒక మందుమొక్క (4)
10) బాధ, చెడు పైకొచ్చింది (2)
12) పురాణాల సంఖ్య (5)
13) పిండి విసిరే రాయి (4)
14) వేసవికాలంలో చలువజేయడం కోసం పెద్దగా ఉండే ఈ కాయను తింటారు (4)
17) వెదురు వేణువు (5)
19) నిర్మాణం, గద్య పద్య కల్పన సరిగా లేదు (3)
22) శూన్యం లోపించిన ఎడబాటు (3)
23) జనం పైకొచ్చారు (2)
24) మధుర, బృందావన ప్రాంతం, ఒక మధురమైన ఉత్తరాది మాండలిక భాష (2)
25) తలక్రిందులైన దోవ (2)

## పదరసం - 501 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| మ[1] | హా | కుం[2] | భ | మే[3] | ళా | ■ | జ[4] | ■ | చై[5] |
| ద | ■ | భ | ■ | ధు | ■ | ను[6] | వ్వా | సే[7] | నా |
| న[8] | మ్మ | క | ద్రో | హం | ■ | దు | ■ | త్ర | ■ |
| మో | ■ | ర్ణు | ■ | మ[9] | కు[10] | రు | ■ | ప[11] | ట్టం |
| హ[12] | ర్షు | డు | శ్రీ[13] | ■ | మ్మ | ■ | గ[14] | ర్వం | ■ |
| న | ■ | ■ | రం[15] | గ | రిం | చు | ■ | ■ | ఆ[16] |
| మా[17] | జ | ల | గ | ■ | చు | ■ | వి[18] | రా | గం |
| ల | ■ | ■ | నీ | ■ | ■ | ■ | రు | ■ | త |
| వ్య[19] | క్తి[20] | ■ | తు[21] | ద | ము[22] | ట్టిం | చు | ■ | కు |
| ■ | పం[23] | తు | లు | ■ | ప్పు | ■ | కు[24] | జు | డు |

సినిమా

తెలుగు సినిమా బుడిబుడి అడుగులు వేస్తున్న సమయంలో బాలనటిగా చిత్రసీమలోకి అడుగుపెట్టారు చిత్తజల్లు కృష్ణవేణి. నాటకరంగంలోని అనుభవంతో చిత్రసీమలోకి ప్రవేశించి, నటిగా, గాయనిగా, నిర్మాతగా, స్టూడియో నిర్వాహకురాలిగా తొంబై యేళ్ల తెలుగు సినిమా గమనానికి ప్రత్యక్షసాక్షిగా నిలిచారు. ఫిబ్రవరి 16,2025న తనువు చాలించే సమయానికి కృష్ణవేణి వయసు 101 సంవత్సరాలు.



# వెండితెరపై 'కృష్ణ'కాంతులు




తొలి భారతీయ సినిమా 'రాజా హరిశ్చంద్ర' 1913లో విడుదలైతే, తొలి భారతీయ టాకీ 'ఆలంఆరా' 1931లో వచ్చింది. ఆ తర్వాత సంవత్సరమే 1932 ఫిబ్రవరి 6న తొలి తెలుగు టాకీ 'భక్త ప్రహ్లాద' విడుదలైంది. అప్పటికి ఎనిమిదేళ్ల వయసు ఉన్న కృష్ణవేణి నాటక రంగంలో బాలనటిగా చక్కని గుర్తింపు పొందారు. ఆమె నటించిన 'తులాభారం' నాటకం చూసిన ప్రముఖ దర్శకులు సి. పుల్లయ్య 'అనసూయ' అనే బాలల చిత్రంలో టైటిల్ రోల్ చేయించారు. తొలి చిత్రంలో నటించే సమయానికి ఆమె వయసు పదేళ్లు.

కృష్ణవేణి పశ్చిమగోదావరి జిల్లా పంగిడి గ్రామంలో డిసెంబర్ 24, 1924న జన్మించారు. ఆమె తొలిచిత్రం సమయంలో, అనంతర కాలంలో గొప్ప నటుడు రేలంగి వెంకట్రామయ్య ప్రొడక్షన్ వ్యవహారాలను పర్యవేక్షించే వారు. కొన్ని నెలల పాటు కోల్‌కత్తాలో జరిగిన ఈ సినిమా షూటింగ్‌లో పిల్లల బాగోగుల బాధ్యతను ఆయనే భుజానకెత్తుకున్నారు. 'అనసూయ' షూటింగ్ పూర్తి కాగానే కృష్ణవేణి సొంతవూరు వెళ్లి తిరిగి నాటకాలలో నటించారు. 'అనసూయ' 1936లో విడుదలైంది. ఆ తర్వాత సంవత్సరం నటుడు సి.ఎస్.ఆర్.ఆంజనేయులు ప్రోత్సాహంతో నాటి మద్రాసు నేటి చెన్నయ్ చేరారు. బాలతారగా కొన్ని సినిమాలుచేసిన తర్వాత పద్నాలుగేళ్ల వయసులో 'కచదేవయాని' చిత్రంలో కథానాయికగా నటించారు. ద్రోణంరాజు కామేశ్వర రావు దర్శకత్వం వహించిన ఈ సినిమాలో ఎస్.పి. లక్ష్మణస్వామి కథానాయకుడు. తొలినుంచి సినిమాలలో తన పాటలను తానే పాడుకోవడం అలవాటు గల కృష్ణవేణి 'కచదేవ యాని'లోనూ పాడారు. 1939లో 'మహానంద' చిత్రంలో నటిస్తుండగా మీర్జాపురం యువరాజాతో ఏర్పడిన పరిచయం పెళ్లికి దారి తీసింది. 1940లో వీరి వివాహం విజయవాడలో జరిగింది. అప్పటికే కొన్ని సినిమాలలో నటించిన కృష్ణవేణి వివాహానంతరం తమ సొంత సంస్థలోనే సినిమాలు చేశారు. మీర్జాపురం రాజా వారు స్వీయ దర్శకత్వంలో నిర్మించిన సినిమాల పర్యవేక్షణ బాధ్యతలనూ సమర్ధవంతంగా నిర్వహించారు.

'జీవనజ్యోతి, దక్షయజ్ఞం, భీష్మ, గొల్లభామ, మనదేశం, లక్ష్మమ్మ, సాహసం" వంటి చిత్రాలతో ఆమెకు నటిగా చక్కని గుర్తింపు లభించింది. ముఖ్యంగా 'గొల్లభామ, లక్ష్మమ్మ' చిత్రాలు నటిగా కృష్ణవేణికి ఎనలేని ఖ్యాతిని ఆర్జించి పెట్టాయి. అప్పట్లో ఆమె 'ధర్మాంగద' చిత్రంలో నటించినందుకు ఏకంగా 45వేల పారితోషికం తీసుకుందని చెబుతుండేవారు. నటిగానే కాకుండా పలు చిత్రాలలో ఎస్.పి.లక్ష్మణస్వామి, ఘంటసాల, ఎం.ఎస్. రామారావు, బి.రజనీకాంతరావు తదితరులతో కలిసి పాడిన పాటలు శ్రోతల ఆదరణ పొందాయి. కృష్ణవేణి దంపతులకు రాజ్యలక్ష్మీ అనురాధ (1942) జన్మించారు. దేశభక్తిని ప్రేరేపించే చిత్రం 'మన దేశం'ను నిర్మించడానికి మీర్జాపురం రాజావారు తటపటాయిస్తున్న సమయంలో ఆయన్ని ఒప్పించి, కృష్ణవేణి తన కుమార్తె పేరు మీద ఎం.ఆర్.ఎ. ప్రొడక్షన్‌ను స్థాపించి ఆ సినిమాను నిర్మించారు. ఎల్.వి. ప్రసాద్ దర్శకత్వం వహించిన ఆ చిత్రంలో నాగయ్య, నారాయణరావు, కృష్ణవేణి కీలక పాత్రలు పోషించారు. 1949లో విడుదలైన ఈ సినిమా ద్వారానే మహానటుడు ఎన్టీఆర్ తెలుగు తెరకు పరిచయం అయ్యారు. పోషించింది నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రే అయినా... ఆయన దానికి న్యాయం చేకూర్చారు. అలానే 'వరూధిని' సినిమాలో నటించి వెనక్కి వెళ్లిపోయిన ఎస్వీ రంగారావును తిరిగి పిలిపించి, ఈ సినిమాలో నటింపచేశారు. ఘంటసాల, రమేశ్ నాయుడును సంగీత దర్శకులుగానూ, లీలను గాయనిగానూ కృష్ణవేణి పరిచయం చేశారు. నాయిక పాత్రలు పోషించడమే కాకుండా తనకు నచ్చితే ఏ పాత్ర అయిన చేసే తెగువ కృష్ణవేణికి ఉండేది. అలా 'తిరుగుబాటు' సినిమాలో వ్యాంప్ తరహా పాత్రను పోషించి మెప్పించారామె. కుమార్తెను చూసుకోవడంతో పాటు స్టూడియో నిర్వహణ వ్యవహారాలను పర్యవేక్షించాల్సి రావడంతో 1952లో 'సాహసం' సినిమాతో నటనకు స్వస్తి పలికారు. ఈ సినిమాలో కోన ప్రభాకరరావు హీరోగా నటించారు. 1957లో ఆమె చివరిగా నిర్మించిన 'దాంపత్యం' సినిమా విడుదలైంది. దీనితో ఎర్రా అప్పారావును దర్శకుడిగా, విజయ్ కుమార్‌ను హీరోగా పరిచయం చేశారు కృష్ణవేణి. ఆపైన కూడా కొన్ని సినిమాలను నిర్మించాలని కృష్ణవేణి భావించినా... అవి పూర్తి స్థాయిలో కార్యరూపం దాల్చలేదు.

కృష్ణవేణి సినిమా నిర్మాణానికి దూరంగా ఉన్నా... ఆమె ఆశయాలను, ఆకాంక్షలను కుమార్తె అనూరాధాదేవి నెరవేర్చారు. తెలుగు, కన్నడ భాషల్లో ఆమె పదిహేనుకుపైగా చిత్రాలు నిర్మించారు. రాజ్ కుమార్, అక్కినేనితో మొదలు పెట్టి... వద్దే నవీన్ వరకూ సినిమాలు తీశారు. తెలుగు సినిమా రంగానికి గొప్పనటులను, సాంకేతిక నిపుణులను అందించిన నటగాయని, నిర్మాత కృష్ణవేణిని 2004లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రఘుపతి వెంకయ్య నాయుడు అవార్డుతో సత్కరించింది. గత యేడాది జరిగిన ఎన్టీఆర్ శత జయంతి వేడుకల్లోనూ, డిసెంబర్‌లో విజయవాడలో జరిగిన 'మనదేశం' సినిమా వజ్రోత్సవంలోనూ కృష్ణవేణిని ఘనంగా సన్మానించారు. తుదిశ్వాస విడిచే వరకూ ఆమె సినిమా జ్ఞాపకాలతోనే సాగారు. శతవత్సరాలను పూర్తిచేసుకుని, సంపూర్ణ జీవితాన్ని గడిపిన కృష్ణవేణి మృతికి సినీ ప్రముఖులు నివాళులు అర్పించారు.

**అరుణ**, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్



మహా శివరాత్రి శుభాకాంక్షలు...
తపస్
ఉమ్మడి నల్గొండ - వరంగల్ - ఖమ్మం శాసనమండలి ఉపాధ్యాయ
నియోజకవర్గం MLC గా TPUS మద్దతుతో పోటీచేస్తున్న BJP అభ్యర్థి
1
పులి సరోత్తమ్ రెడ్డి గారికి
మొదటి ప్రాధాన్యత ఓటు వేసి
అత్యధిక మెజారిటీతో గెలిపించగలరని మనవి
సంఘ బాధ్యునిగా గతంలో సమస్యల సాధనకు ప్రాతినిధ్యం చేసిన తీరును,
ఉద్యమాలు చేపట్టిన చరిత్రను గుర్తు చేసుకోవాలని, ప్రస్తుత బాధ్యులు పాలక పార్టీలకు మారి
సంతుష్టీకరణ కార్యక్రమాలు చేస్తున్న విధానాలు గమనించాలని,
భవిష్యత్తులో విద్యారంగ, అధ్యాపక, ఉపాధ్యాయుల సమస్యలను శాసన మండలిలో వినిపించి
వాటి సాధన కృషి చేయడానికి వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల ఉపాధ్యాయ
అధ్యాపకులందరికి విజ్ఞప్తి చేస్తు, మార్చి 2025 లో జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలలో
నాకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి నన్ను గెలిపించాలని ప్రార్థన.
విద్యారంగాన్ని కాపాడుకుందాం. ఉపాధ్యాయుల గౌరవాన్ని పెంపొందించుకుందాం.

From: **JAGRITI Telugu Weekly**
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 77 Issue : 18



# మహా శివరాత్రి శుభాకాంక్షలు...

తపస్



# మల్క కొమరయ్య

**ఉమ్మడి కరీంనగర్ - నిజామాబాద్ - మెదక్ - ఆదిలాబాద్**
**ఉపాధ్యాయ నియోజకవర్గ శాసన మండలి ఎమ్మెల్సీ అభ్యర్థి**

1

మొదటి ప్రాధాన్యత ఓటు వేసి
అత్యధిక మెజారిటీతో గెలిపించగలరని మనవి

# TPUS

## తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్)

(అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ (ABRSM) న్యూఢిల్లీ అనుబంధం)